ఆంధ్రజ్యోతి
5 ప్రకాశం
బుధవారం 8 జనవరి 2025



హుస్సేన్‌పురం వద్ద చేపట్టిన తవ్వకాలు

అవినీతిపరులు అవుట్

కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు

- భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు
- కనిగిరి తహసీల్దార్, వీఆర్వో సస్పెన్షన్
- అర్జీదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐపైనా వేటు



పునుగోడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహేష్‌రెడ్డి(ఫైల్)

ఒంగోలు కలెక్టరేట్/కనిగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసిన కనిగిరి తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మరపగుంట్ల వీఆర్వో రాధపై వేటు పడింది. వారితోపాటు అర్జీదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐ పురుషోత్తంరెడ్డిని కూడా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామానికి చెందిన వరికూటి మాలకొండయ్యకు 30 ఎకరాల పొలం ఉంది. ఆయన మరణం అనంతరం కుమారులు నలుగురు భూమిని భాగపంపకాలు చేసుకున్నారు. వారికి చదువు రాకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్, ఆన్‌లైన్ బాధ్యతను మాలకొండయ్య మనుమడైన మహేష్ రెడ్డికి అప్పగించారు. ఆయన నాలుగు నెలల క్రితం పునుగోడు వీఆర్వోగా పనిచేస్తున్న రాధను సంప్రదించారు. ఆమె రూ.2.50లక్షల లంచం డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని తహసీల్దార్‌కు ఇవ్వాల్సి మిగతా 6లో...

ఇంకొందరిని..

- డ్వామాలో నేడు, రేపు కీలక విచారణ
- శీనారెడ్డి వ్యవహారంలో ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కీలకమైన విచారణను త్రిసభ్య కమిటీ బుధ, గురువారాల్లో చేపట్టనుంది. శీనారెడ్డిపై ఫిర్యాదు చేసిన వారితోపాటు పలు అంశాలతో సంబంధం ఉన్న 36 మంది ఉద్యోగులను విచారించనుంది. ఈమేరకు త్రిసభ్య కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు ముందుగానే నోటీసులు పంపించారు. దాదాపు నెల రోజులుగా డ్వామాలో విచారణ ప్రక్రియ కొనసాగుతున్న విషయం విదితమే. నేరుగా ప్రభుత్వం నుంచి కొన్ని, కలెక్టర్ నుంచి వచ్చిన మిగతా 6లో...


అక్రమం.. తేటతెల్లం!

నిషేధమున్నా ఆగని తెల్లరాయి రవాణా

- సరుకు పేరు మార్చి లారీల్లో తరలింపు
- మూడు నెలల్లో రూ.50 కోట్ల వైట్ క్వార్ట్జ్ రాష్ట్రాలు దాటవేత
- మహిళ ఆధ్వర్యంలో ముఠా
- అధికారులు, నేతలు కీలకపాత్ర
- వాహనాలు పట్టుబడినా వదిలేసిన పోలీసులు
- వారితీరుపైనా అనుమానాలు

మట్టి అక్రమాలను విన్నాం. ఇసుక మాఫియాను చూశాం. జిల్లాలో తాజాగా వెలుగు చూసిన ఈ అక్రమం చూస్తే ఎవరైనా 'తెల్ల'బోవాల్సిందే. అరుదుగా దొరికే తెల్లరాయిని కూడా కొందరు వదలడం లేదు. కనిగిరి నియోజకవర్గంలో ఈ మాఫియా రెచ్చిపోతోంది. వెలిగండ్ల ప్రాంతంలోని తెల్లరాయి క్వారీ అడ్డాగా అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెల్లరాయి (వైట్ క్వార్ట్జ్) రవాణాపై నిషేధం విధించినా తప్పుడు వేబిల్లులతో ఎల్లలు దాటిపోతోంది. గడిచిన మూడు నెలల్లో రూ.50 కోట్లకుపైగా విలువైన ఖనిజం తరలినట్టు సమాచారం. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు ఈ అక్రమంలో కీలక రాజకీయ నేతలతోపాటు పోలీసులూ, అధికారులూ ఉన్నట్టు తెలుస్తోంది.

కనిగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల మండలంలోని హుస్సేన్‌పురం క్వారీ తెల్లరాయి అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. నియోజకవర్గంలో పీసీపల్లి, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలంతో పాటు కనిగిరిలో ఓగ్రామంలో తెల్లరాయి ఖనిజాలు ఉన్నాయి. ఇక్కడ లభించే తెల్లరాయికి మంచి గిరాకీ ఉంది. గూడూరు ప్రాంతం నుంచి వచ్చిన కొందరు ముఠాగా మిగతా 6లో...



అక్రమంగా తరలుతున్న తెల్లరాయి



హుస్సేన్‌పురంలోని క్వారీ వద్ద కుప్పలుగా ఉంచిన తెల్లరాయి

తప్పుడు వేబిల్లులతో తరలింపు

రాష్ట్రంలో తెల్లరాయి ఖనిజం రవాణా నిలిపివేయటంతో పాటు ఆన్‌లైన్ బిల్లులు కూడా నమోదు కావటం లేదు. హుస్సేన్‌పురం క్వారీ నుంచి లారీల ద్వారా తరలించే తెల్లరాయి రవాణాలో బల్లిపల్లి గ్రామం అడ్డరోడ్డు వద్ద ఉన్న వే బ్రిడ్జ్‌లో సిమెంట్, ఇతర సరుకుల పేరుతో కాటా వేయించి అవే బిల్లులతో తెల్లరాయిని తరలిస్తున్నారు.

మూడు నెలలుగా రాయి రవాణా

మూడు నెలలుగా హుస్సేన్‌పురం వద్ద ఉన్న క్వారీ నుంచి తెల్లరాయిని రాత్రికి ఊరు దాటించి రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతిరోజూ 120 నుంచి 150 టన్నుల వరకు అక్రమంగా తరలిపోతోంది. ప్రస్తుతం గ్రేడ్ 1 తెల్లరాయి టన్ను రూ.25 వేల వరకు పలుకుతోంది. గ్రేడ్ 2 రూ.18 వేలుంది. సగటున రోజుకు రూ.40 లక్షలు, నెలకు రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల విలువైన ఖనిజం తరలిపోతోంది. మూడు నెలలుగా ఇంచుమించు రూ.50 కోట్ల అక్రమ వ్యాపారం సాగినట్టు తెలుస్తోంది.

గుట్టు రట్టు ఇలా..

గతనెల 23న జరిగిన అక్రమ రవాణాతో గుట్టు బయటపడింది. తెల్లరాయి రవాణా చేసే 3 టర్బో లారీలు బల్లిపల్లి అడ్డరోడ్డు సమీపంలో వేబ్రిడ్జ్ వద్దకు వచ్చాయి. ఎప్పటిలాగానే దందా సాగించే ముఠా నాయకులకు, కాపలాదారులకు మామూళ్ల విషయంలో తేడా వచ్చింది. దీంతో ఈ వ్యవహారంపై కనిగిరి సీఐ ఖాజావలికి సమాచారం చేరింది. అక్కడకు చేరుకున్న పోలీసులు తమశైలిలో విచారించగా లారీ డ్రైవర్‌లు ముఖం తేలేశారు. ఆ 3 టర్బో లారీలను పరిశీలించగా తెల్లరాయి బయటపడింది. దీంతో ఆయా లారీలను స్వాధీనం చేసుకుని కనిగిరికి తరలించారు. ఈ విధంగా అక్రమం గుట్టు రట్టయింది.



దర్శి సమీపంలో రోడ్డు పక్కన ఆరబోసి ఉన్న ధాన్యం

7 ఆరోగ్యం పండుగా.!
- తాజా పళ్లు, కూరగాయలు తీసుకోవడం ఉత్తమం

కొత్త వైరస్‌పై కలవరం
పండుగ రోజుల్లో ప్రజల్లో ఆందోళన
ఇతర ప్రాంతాల నుంచి సంక్రాంతికి రానున్న వేలాది మంది 7

టీడీపీలోకి వైసీపీ నేతల బారులు
- ఇప్పటికే మార్కాపురంలో కొందరు నాయకులు, కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా
- రేపు మంత్రుల సమక్షంలో పచ్చ కండువా కప్పుకోనున్న పలువురు
6

'బంగారు బాల్యం'కు స్కోచ్ అవార్డు

- దేశవ్యాప్తంగా ఆ సంస్థ పరిశీలించిన 13 ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానం
- బాలల రక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమం
- కలెక్టర్ అన్సారియా చొరవతో అమలు



ఒంగోలులో బంగారు బాల్యం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి హాజరైన నోబెల్ అవార్డు గ్రహీత కైలాస్ సత్యర్థికి స్వాగతం పలుకుతున్న బాలికలు (ఫైల్)

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల్య వివాహాల నిషేధం, బాలికల్లో అక్షరాస్యత పెంపు, సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంతో చేపట్టిన బంగారు బాల్యం ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డుకు ఈ ప్రాజెక్టు ఎంపికైంది. ఆ సంస్థ పరిశీలించిన 13 ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ తీసుకొని దీన్ని అమలు చేస్తున్నారు. త్వరలో ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆమె అవార్డును అందుకోనున్నారు.

వివిధ శాఖల భాగస్వామ్యం..

గత ఏడాది జూన్ ఆఖరులో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్సారియా తొలి నెల రోజుల్లోనే బాలికల అంశంపై దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా అత్యధిక బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల్లో ముందు వరుసలో మన జిల్లా ఉన్న విషయాన్ని గుర్తించారు. మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో అనేక మంది పిల్లలు, మహిళలు ప్రత్యేకించి బాలికలు, గర్భిణులు... పౌష్టికాహారం లోపం, రక్తహీనతతో ఉన్న విషయాన్ని గమనించారు. వారిలో అక్షరాస్యత కూడా అతి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈనేపథ్యంలో ఒకవైపు బాల్య వివాహాల నిరోధం, మరోవైపు బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణ, అక్షరాస్యత పెంపుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని తలచారు. ఐసీడీఎస్, విద్య, వైద్యారోగ్య ఇతర శాఖల భాగస్వామ్యంతో ఆ తరహా కార్యక్రమానికి రూపకల్పన చేసే ప్రయత్నంలో అది ఒక ప్రాజెక్టు తరహాలో ఉండాలన్న అభిప్రాయాన్ని పలువురు అధికారులు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే బంగారు బాల్యం పేరుతో ప్రాజెక్టు చేపట్టారు.

ఆగస్టు 29న ప్రారంభం

జిల్లాలో మిగతా 6లో...

ధాన్యంలో దోపిడీ

మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం

- లభించని ప్రభుత్వ 'మద్దతు'
- నామమాత్రంగా పనిచేస్తున్న కొనుగోలు కేంద్రాలు
- భారీగా నష్టపోతున్న అన్నదాతలు
- పొదుపు సంఘాల పాత్రను మరిచిన అధికారులు

ధాన్యం కొనుగోళ్లలో ప్రైవేటు వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా పని చేస్తున్నాయి. కొన్ని పేరుకే అన్నట్లు నడుస్తుండగా, మరికొన్ని కొనుగోళ్ల ఊసే పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందక అన్నదాతలు నష్టపోతున్నారు.

- దర్శి, ఆంధ్రజ్యోతి



ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

ప్రభుత్వం నిధులిచ్చినా ఆసక్తి చూపని సిబ్బంది

జిల్లాలో మొత్తం 32 కేంద్రాలు ఏర్పాటు చేయగా 15 రోజుల్లో కేవలం 4,459 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసినప్పటికీ పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తూ కొనుగోళ్లపై దృష్టి సారించడం లేదు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది.

కొనుగోళ్లలో పొదుపు సంఘాల భాగస్వామ్యం నిల్

ధాన్యం కొనుగోళ్లలో పొదుపు సంఘాల పాత్రను అధికారులు మరిచారు. గతంలో సీఎం చంద్రబాబు మహిళలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో 2014 నుంచి 2019 వరకు కొనుగోళ్ల బాధ్యతను అప్పగించారు. సొసైటీలు, పొదుపు సంఘాలు ముమ్మరంగా కొనుగోలు చేసినప్పుడు రైతులకు న్యాయం జరిగింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఏడాది నామ మాత్రంగా పొదుపు సంఘాలకు కొనుగోలు బాధ్యత అప్పగించి ఆ తర్వాత పక్కన పెట్టారు. వారికి ఇవ్వాల్సిన కమీషన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు సంఘాలకు న్యాయం జరుగుతుందని మహిళలు మిగతా 6లో...

బస్తా రూ.1400, మూడు కేజీల తరుగు

ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం ధాన్యం గ్రేడ్-1 రకం 75 కేజీల బస్తా రూ.1740, సాధారణ రకం రూ.1725కు కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో నడుస్తుంటే రైతులకు గిట్టుబాటు ధర లభించేది. కానీ అవి అలంకారప్రాయంగా మారాయి. ఇదేఅదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. మరో మూడు కేజీలు అదనంగా తరుగు కింద తీసుకుంటున్నారు. దీంతో బస్తాకు రూ.400మేర రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల తీరు అధ్వానంగా మారడం పట్ల అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్‌గా జాన్సన్

అల్లూరి జిల్లాకు లోకేశ్వరరావు బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)గా ఈఎస్ జాన్సన్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతిపై జాన్సన్ జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వీఎస్ లోకేశ్వరరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన అక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా నియమితులయ్యారు.

సంక్రాంతి స్పెషల్

- జిల్లాకు వచ్చేవారి కోసం 264 ఆర్టీసీ బస్సులు



ఒంగోలు, కార్పొరేషన్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాకు వచ్చేవారి కోసం ఆర్టీసీ ప్రకాశం రీజియన్ పరిధిలో 264 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం బి.సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. హైదరాబాద్ నుంచి 242, బెంగళూరు నుంచి 12, చెన్నై నుంచి 10 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా కానీ, ఏటీబీ ఏజెంట్ ద్వారా కానీ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రాను, పోను ఒకేసారి రిజర్వేషన్ చేయించుకున్న వారికి చార్జీలో 10 శాతం రాయితీ ఉంటుందని వెల్లడించారు. ఏసీ స్లీపర్, నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులు కూడా సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు ఆర్ఎం తెలిపారు.

నేటి నుంచి సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు

సిద్ధమైన రావినూతల స్టేడియం

మేదరమెట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి క్రికెట్ పోటీలకు రావినూతల సిద్ధమైంది. బుధవారం నుంచి అంతర్‌రాష్ట్ర పోటీలు ప్రారంభమవుతున్నాయి. టర్ఫ్ పిచ్‌పై జరిగే ఈ పోటీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆర్‌ఎస్‌సీఏ నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి చెందిన గ్రామాలలో ముందు వరుసలో ఉన్న రావినూతలకు ప్రతి సంవత్సరం జరిగే సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చాయి. క్రికెట్ క్రీడపై ఉన్న అభిమానంతో ప్రారంభమైన ఈ టోర్నమెంట్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిని దాటి అంతర్ రాష్ట్ర పోటీలు నిర్వహించే స్థాయికి ఎదిగింది. ఈక్రమంలో సుమారు రూ.6 కోట్ల విలువైన స్టేడియం రావినూతలకు ఆస్తిగా మిగిలింది. ఇక్కడ 31 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్న పెవిలియన్. స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మాణం, టర్ఫ్ పిచ్ ఏర్పాటుకు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, పూర్వ కార్యదర్శి దివంగత పుట్టా వెంకట్రావు, అసోసియేషన్ సభ్యులు ఎంతగానో కృషి చేశారు.

1991లో ఆర్‌ఎస్‌సీఏ ఏర్పాటు

1991లో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌సీఏ) ఏర్పాటైంది. ఆ సమయానికి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కూడా లేదు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ 1995లో ఏర్పాటైంది. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో ఎక్కడా టర్ఫ్ పిచ్ లేని సమయంలో రావినూతల స్టేడియంలో టర్ఫ్ పిచ్‌పై పోటీలు నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోనే ఇన్నేళ్ల క్రమం తప్పకుండా క్రికెట్ పోటీలు నిర్వహించిన సంస్థ లేదు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారం లేకుండానే స్టేడియాన్ని ఇంతగా అభివృద్ధి చేయడం క్రికెట్ పట్ల అసోసియేషన్ సభ్యులకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

ఆటగాళ్లకు పండుగే

రావినూతలలో జరిగే అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఆటగాళ్లు సంక్రాంతి పండుగను సైతం వదులుకుని రావడానికి ఇష్టపడతారు. దీనికి కారణం ఇక్కడ ఆర్‌ఎస్‌సీఏ ఆతిథ్యం, గ్రామస్థుల ఆదరాభిమానాలే కారణం అని క్రీడాకారులు అంటున్నారు. భారత జట్టుకు ఆడిన వేణుగోపాలరావు, నోయల్ డేవిడ్, బీసీసీఐ సెలెక్టర్‌గా పనిచేసిన ఎంఎస్‌కే ప్రసాద్, రంజీల్లో ఆడిన కల్యాణ్ కృష్ణ, ఏజీ ప్రదీప్, ప్రవీణ్, వంశీలతోపాటు పలు రాష్ట్రాలలో రంజీ పోటీలలో పాల్గొన్న ఆటగాళ్లు రావినూతలలో సంక్రాంతి క్రికెట్ పోటీలలో ఆడడం విశేషం.


పోటీలకు సిద్ధంగా ఉన్న మైదానం

ఏసీఏతో ఒప్పందం

ఆర్‌ఎస్‌సీఏలో ఉన్న టర్ఫ్ పిచ్, పెవిలియన్, ఇండోర్ స్టేడియం, ఆటగాళ్ల వసతి గదులు, ఇతర వనరులను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వినియోగించుకుని మరింత అభివృద్ధి చేసేందుకు ఆర్‌ఎస్‌సీఏ, ఏసీఏల మధ్య ఒప్పందం జరిగింది. అందులో భాగంగా ఏసీఏ అండర్-12, అండర్-14, అండర్-19 బాల, బాలికల జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించడంతోపాటు బాలిక క్రికెట్ శిక్షణ కేంద్రంగా ఉపయోగించుకోనున్నట్లు తెలిసింది. ఆంధ్రక్రికెట్ అసోసియేషన్‌తో చేసుకున్న ఒప్పందంతో భవిష్యత్‌లో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్టేడియానికి మరిన్ని అదనపు హంగులతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు.

టీడీపీలోకి వైసీపీ నేతల బారులు

- ఇప్పటికే మార్కాపురంలో పలువురు నాయకులు, కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా
- రేపు మంత్రుల సమక్షంలో పచ్చ కండువా కప్పుకోనున్న వైసీపీ కేడర్

మార్కాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ తీర్థం పుచ్చుకోవడానికి వైసీపీ నాయకులు బారులు తీరుతున్నారు. వారంరోజులుగా పలువురు వైసీపీ నేతలు పార్టీ సభ్యత్వానికి రాజీనామాలు చేస్తున్నారు. వారిలో నియోజకవర్గస్థాయి నాయకుల నుంచి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు. ఈ నెల 9న మార్కాపురంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు డీబీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, జిల్లాఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఆ రోజే భారీస్థాయిలో వైసీపీ కేడర్ పచ్చకండువాలు కప్పుకోనున్నట్లు సమాచారం. కొన్ని నెలలుగా వైసీపీకి చెందిన పలువురు నాయకులు టీడీపీలోకి చేరుతామని సంకేతాలు పంపారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆచితూచి వ్యవహరిస్తూ వస్తున్నారు.మున్సిపాలిటీలో అభివృద్ధి విషయంలో ఇబ్బందులు తలెత్తున్న నేపథ్యంలో వైసీపీ కేడర్‌ను పార్టీలోకి ఆహ్వానించక తప్పలేదు.

గుంటకతో మొదలైన రాజీనామాల పర్వం

మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ షెక్షావలితో కలిసి తొలుత వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు పలువురు కీలక నాయకులు కూడా పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన 27, 28, 31 వార్డుల కౌన్సిలర్లు కశ్శెట్టి నగేష్, కరిమున్నిసా, షేక్ నాసర్‌వలిలు రాజీనామాలు చేశారు. తాజాగా మంగళవారం సాయంత్రం 8వ వార్డు కౌన్సిలర్ దొడ్డ భాగ్యలక్ష్మి, ఆమె భర్త దొడ్డ నాగిరెడ్డిలు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వీరేకాక ఈ నెల 9న జరిగే కార్యక్రమం రోజున మరో ఆరుగురు మున్సిపల్ కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు కూడా రాజీనామ చేసి పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వీరేకాక మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఫలించని మాజీ ఎమ్మెల్యే బుజ్జగింపులు

వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మూడు రోజుల క్రితం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పార్టీని వీడి వెళ్లేందుకు సిద్ధమైన వారిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలామంది మున్సిపల్ ఛైర్మన్‌పై అసంతృప్తిని వెళ్లగక్కారు. ప్రధానంగా మున్సిపాలిటీ అభివృద్ధికంటే కూడా అవినీతికి నిలయంగా మారేందుకు కారకుడయ్యారని ఛైర్మన్ వ్యవహారశైలిని దుయ్యబట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున నిధులు రాబట్టి మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలంటే తప్పక టీడీపీలోకి వెళ్లాల్సిందేనని కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. వచ్చే మార్చి నాటికి మున్సిపాలిటీ పాలకవర్గం నాలుగేళ్లు పూర్తి చేసుకుంటుదని అప్పుడు అవిశ్వాస తీర్మానం పెడితే ఛైర్మన్‌ను తప్పక గద్దె దింపుతామని వివరించారు. మున్సిపాలిటీ పాలకవర్గం వైసీపీదే అయినా ఛైర్మన్ లంచాల మత్తులో కమీషన్లకు తెరలేపాడని పలువురు కౌన్సిలర్లు విమర్శించినట్లు సమాచారం. అలాంటి వ్యక్తిని మీరు వెనుకేసుకురాబట్టే మేము పార్టీ మారుతున్నామని తెగేసి చెప్పినట్లు తెలిసింది.

బాలకృష్ణమ్మకు నివాళులు

ఒంగోలు విద్య, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమస్ఫూర్తి ప్రదాత మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని ఒంగోలులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బి.అశోక్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, పీవీ.సుబ్బారావు, ఎం.సురేష్‌బాబు, పి.ఆంజనేయులు, వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమతిలేని బ్యారన్‌లపై చర్యలు

టంగుటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా నిర్మించిన పొగాకు బ్యారన్‌ల చర్యలను తీసుకోవాలని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. టంగుటూరు వేలం కేంద్రం పరిధిలో ఇప్పటికే కొత్తగా 150 బ్యారన్‌లు నిర్మించినట్టు అధికారులు భావిస్తున్నారు. నూతనంగా బ్యారన్‌లు నిర్మించిన రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఆ జాబితాను వేలం కేంద్రం సూపరింటెండెంట్ మంగళవారం టంగుటూరులో తహశీల్దార్ ఆంజనేయులకు, గ్రామాల వారీగా వీఆర్వోలకు అందించారు.

11న జాతీయ ఏకపాత్రాభినయ పోటీలు

ఒంగోలు (కల్చరల్), జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. నాటకాల పోస్టర్‌ను మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో వీరబాహుడు, దుర్యోధనుడు, హరిశ్చంద్ర పాత్రలకు సంబంధించిన పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి దేనువకొండ సుబ్బయ్య, సభ్యురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, శేషారత్నం, వాకా సంజీవరెడ్డి, దిగ్విజయ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బేబీరాణి కోరారు. చవటపాలెంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ తక్షణ సాధ్యమైనవి అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో 16 అర్జీలు అందినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అవినీతిపరులు అవుట్

(5వ పేజీ తరువాయి)

ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ కారు డ్రైవర్ చేత ఆమె బేరసారాలు సాగించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం జరిగిన ఫోన్ సంభాషణలను మహేష్‌రెడ్డి రికార్డు చేశారు. ప్రస్తుతం వీఆర్వో రాధ వెలిగండ్ల మండలంలోని మరపగుంట్ల వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఈనెల 4న పునుగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొనగా రెవెన్యూ లంచం గురించి మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఫోన్ సంభాషనను కూడా వినిపించారు. ఆర్ఐ పురుషోత్తమ్‌రెడ్డి కూడా తన పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఆయన ఆరోపించారు. దీంతో సీరియస్ అయిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అర్జీదారుడి నుంచి లంచం డిమాండ్, ఆర్ఐ దురుసు ప్రవర్తన నిజమేనని ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. దీంతో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

అక్రమం.. తేట'తెల్ల'ం!

(5వ పేజీ తరువాయి)

ఏర్పడి తవ్వి తెల్లరాయిని చిన్నచిన్న వాహనాల ద్వారా వెలిగండ్ల మండలం, హుస్సేన్‌పురం గ్రామంలోని క్వారీకి చేరుస్తారు. అక్కడ క్రష్ చేసి రవాణా చేస్తున్నట్లు సమాచారం.

దందా మాటున పరాయి జిల్లాల ముఠాలు

నెల్లూరు జిల్లా గూడూరు ప్రాంతంలోని ఓ మహిళ ద్వారా పెద్దఎత్తున ముఠాలు వెలిగండ్ల మండలం హుస్సేన్‌పురం క్వారీ వద్ద పనిచేస్తున్నట్లు సమాచారం. వీరంతా హుస్సేన్‌పురం సమీపాన ఉన్న మరో మూరుమూల పల్లెలో ఉంటూ పనులు చేస్తున్నట్లు తెలిసింది. వీరు రాత్రి వేళల్లో కూడా క్వారీలో ఉండి లారీలకు తెల్లరాయి నింపుతున్నారు. ఆ తర్వాత లారీలో సరుకు బయటకు కనిపించకుండా పరదా కప్పి తరలిస్తున్నారు.

లారీలను కొత్తూరు వద్ద నిలిపివేసి బేరం

తెల్లరాయి రవాణా చేస్తున్నట్లు లారీలో సరుకును గుర్తించిన పోలీసులు వాటిని తరలిస్తూ బేరం మొదలుపెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతనెల 23వ తేదీ రాత్రి వరకు కొత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పట్టుకున్న లారీలను ఉంచారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో బల్లిపల్లి వద్ద పట్టుకున్న లారీలను రాత్రి 11 గంటల వరకు ఊరు చివర ఉంచి ఆ తర్వాత పంపివేశారు. దీనివెనుక లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బిల్లులు పరిశీలించి పంపించివేశాం

బల్లిపల్లి అడ్డరోడ్డు వద్ద గతనెల 23న అనుమానంతో మూడు లారీలను స్వాధీనం చేసుకుని నా సిబ్బంది కనిగిరికి తరలించారు. ఆ తర్వాత వేబిల్లులు పరిశీలించగా తెల్లరాయి డస్ట్‌గా తేలటంతో ఆరోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో వాటిని వదిలేశాం.

\- ఖాజావలి, సీఐ

తెల్లరాయి డస్ట్ తరలించేందుకు వీలులేదు

రాష్ట్రంలో ఎక్కడా తెల్లరాయి తరలింపు కానీ, వాటి డస్ట్ కూడా తరలించేందుకు వీలు లేదు. ఈమేరకు ప్రభుత్వం నిషేధం విధించింది. తెల్లరాయి కానీ, డస్ట్ కానీ తరలించాలన్నా వేబిల్లు ఆన్‌లైన్ తీసుకోదు. తెల్లరాయి అక్రమ రవాణా విషయంపై విచారిస్తాం. వాస్తవాలు రుజువైతే అక్రమార్కులపై, ఆయా క్వారీలపై చర్యలు తీసుకుంటాం.

\- నర్సింహారావు, మైనింగ్ ఏడీ, మార్కాపురం

'బంగారు బాల్యం'కు స్కాచ్ అవార్డు

(5వ పేజీ తరువాయి)

2024 ఆగస్టు 29న ఒంగోలులో బంగారు బాల్యం ప్రాజెక్టును ప్రారంభించారు. బాలల హక్కుల ఉద్యమకారుడు, నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ కైలాస్ సత్యర్థిని ఇక్కడికి తీసుకు వచ్చి ఆయన ద్వారా ప్రాజెక్టును ప్రారంభింపజేశారు. 18 ఏళ్లలోపు ఆడ పిల్లలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ వారిలో అక్షరాస్యత, ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక సామర్థ్యాల పెంపుపై విస్తృత అవగాహనకు శ్రీకారం పలికారు. ప్రజలను చైతన్యం చేయడంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేశారు. నవంబరు 14 నుంచి 20 వరకు ప్రత్యేక వారోత్సవాలు చేపట్టి గ్రామగ్రామానా అవగాహన ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు, వెలుగు, మెప్మాల ద్వారా మహిళలతో సమావేశాలు నిర్వహిస్తూ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కూడా క్రియాశీలకంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. గత ఆరు నెలల్లో జిల్లాలో ఏకంగా 30 బాల్య వివాహాలను స్థానికులు ఇచ్చిన సమాచారంతో అధికారులు అడ్డుకోగలిగారు. ఈ సమయంలో బంగారు బాల్యం ప్రాజెక్టుకు దేశంలో గుర్తింపు ఉన్న స్కాచ్ అవార్డు-24 లభించడం జిల్లా యంత్రాంగానికి మరింత ప్రోత్సాహకరంగా నిలవనుంది.

ధాన్యంలో దోపిడీ

(5వ పేజీ తరువాయి)

ఆశపడ్డారు. అయితే అధికారులు మాత్రం వైసీపీ విధానాలనే కొనసాగిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే పొదుపు సంఘాలను ధాన్యం కొనుగోళ్ల నుంచి పక్కనపెట్టారు. దీంతోపాటు ఈ ఏడాది ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు పూర్తిగా మందగించటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అవసరం కోసం ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితి గమనించి కొనుగోళ్లు ముమ్మరం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లను త్వరితగతిన కేటాయించాలి : కాంగ్రెస్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను త్వరితగతిన కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఆర్.గౌస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చింతల వద్ద టిడ్కో ఇళ్ల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, పూర్తి చేయలేక పోయారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అయితే గత పాలకులందరూ లబ్ధిదారులకు ఇళ్లను ఇవ్వడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకవైపు సొంతిల్లు దక్కక, మరోవైపు బ్యాంకు రుణాలతో నోటీసులు అందుకుంటూ పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం ఇళ్ళు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం రాష్ట్ర కో చైర్మన్ వద్దంటి మల్లిఖార్జునరావు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు ఉంగరాల శ్రీను పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత ఏడేళ్ళ నుంచి ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారో కూటమి ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. మెగా డీఎస్సీపై కాలయాపన చేయడం తగదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ప్రకాశం జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందువల్ల జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించాలని ఆయన కోరారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు నాలుగు శాతం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో ఒకటి నిరుద్యోగభృతిని ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ విచ్చలవిడిగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డ్రగ్స్ నివారణ కమిటీలు ఏర్పాటు చేసి పకడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీ.పిచ్చయ్య, కేఎఫ్.బాబు, పి.కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామన్న

పీఎఫ్ లోన్లు, క్లోజర్స్ మంజూరు చేయాలి

ఒంగోలు విద్య, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ కార్యాలయంలో అపరిష్కృతంగా ఉన్న ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, క్లోజర్లు వెంటనే క్లియర్ చేయాలని బీటీఏ నాయకులు కోరారు. మంగళవారం ఒంగోలులో జడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, కర్ర దేవసహాయం, మద్దిరాల శరత్‌చంద్రబాబు, పారాబత్తిన జాలరామయ్య, పల్లె కృష్ణమూర్తి, చెక్క కోటేశ్వరరావు, నన్నుసారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

ఆధునిక పద్ధతులతో లాభాలు

\- కలెక్టర్ తమీమ్ అన్సారియా


విజ్ఞాన యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : రైతులు విజ్ఞానం పెంచుకొని సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా మరిన్ని లాభాలు పొందవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ఉద్యాన ఉత్సవం-2025 విజ్ఞానయాత్రలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళ్తున్న రైతులతో కూడిన బస్సును స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం రాత్రి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రకు జిల్లా నుంచి 70 మంది రైతులు వెళ్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఒక బస్సు మార్కాపురంలో బయలుదేరి వైపాలెం మీదుగా వెళ్తుందని, మరో బస్సు ఒంగోలులో బయలు దేరి అద్దంకి మీదుగా వెళ్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జెండా ఊపి రైతులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి గోపిచంద్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమేష్, రామమోహన్‌రావు, ఆత్మ డీపీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి

- ఎంఈవో కిషోర్‌బాబు


ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంఈవో కిషోర్‌బాబు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని ఎంఈవో కిషోర్‌బాబు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ జిల్లా కమిటీలు గతనెలలో పదో తరగతి ప్రజ్ఞ వికాస పరీక్షల విజేతలకు మంగళవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువును ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐని అభినందించారు. చదువుతో పాటు సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ విద్యార్థులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఆదర్శంగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వి.బాలకోటయ్య, జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ పాల్గొన్నారు.

పేస్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు


వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఐటీ చదువుతున్న విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో మెషిన్‌లెర్నింగ్, కంప్యూటర్ విజన్ టెక్నాలజీలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్య, వైద్యం, ఆటోమొబైల్, వాణిజ్య, వ్యాపార, సామాజిక మాధ్యమాలు విస్తృతంగా వాడుతున్నట్లు చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్‌లో పట్టు సాధించడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు సాధించగలరన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, హెచ్‌వోడి ఎన్.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్విస్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 7,8,9తేదీల్లో క్విస్ ఫెస్ట్-25ను నిర్వహించనున్నట్లు ఆ విద్యా సంస్థల ఛైర్మన్ ఎస్.సూర్యకల్యాణ్‌చక్రవర్తి, వైస్ ఛైర్మన్ ఎస్.శ్రీగాయత్రిలు తెలిపారు. స్థానిక క్విస్ కళాశాలలో మంగళవారం క్విస్ ఫెస్ట్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నేషనల్ స్థాయిలో జరుగుతుందని, వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. రివైవ్, రీ యూజ్, రీ సైకిల్ అనే కాన్సెప్ట్‌తో పర్యావరణ హితంగా ప్రాజెక్టులు, పేపర్ ప్రజంటేషన్స్, క్విజ్, టెక్నికల్‌ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటల పోటీలు, డ్యాన్సులు, క్రీడా పోటీలు నిర్వహించిబహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వై.హనుమంతరావు, డాక్టర్ కిషోర్‌బాబు, ఫెస్ట్ కన్వీనర్ డి.సమీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొందరిని...


(5వ పేజీ తరువాయి)

మరికొన్ని ఫిర్యాదులను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ వాటిలో చాలా వరకూ వాస్తవమని గుర్తించింది. ప్రధాన ఫిర్యాదుదారుడైన పీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ ఈదర మోహన్‌తోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న శీనారెడ్డిని ఇప్పటికే వ్యక్తిగతంగా విచారించింది. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఫైళ్లను కూడా కొంత మేరకు పరిశీలించింది. పలు అక్రమాలు, అవకతవకలు గుర్తించింది. కొన్ని అంశాలలో అనేకమంది ఉద్యోగుల పాత్ర కూడా ఉందన్న నిర్ధారణకు వచ్చింది. కమిటీకి అందిన ఫిర్యాదుల్లో కొందరి పేర్లు కూడా ఉన్నాయి. దీంతో ఫిర్యాదులో పేర్కొన్న, ఫైళ్ల పరిశీలన సమయంలో భాగస్వామ్యం ఉండే అవకాశం ఉందని తాము గుర్తించిన ఉద్యోగులందరినీ వ్యక్తిగతంగా విచారించాలని త్రిసభ్య కమిటీ సభ్యులు నిర్ణయించుకున్నారు. అందుకోసం బుధ, గురువారాల్లో కీలక విచారణ చేపడుతున్నారు. తొలిరోజైన బుధవారం ఫిర్యాదుదారులైన ఐదుగురిని విచారించనున్నారు. గురువారం డ్వామాలో ఏపీడీ నుంచి అటెండర్ వరకు వివిధ స్థాయిల్లో ప్రస్తుతం పనిచేస్తున్న, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన 31 మంది ఉద్యోగులను విచారిస్తారు. వారిలో కొందరు డ్వామా జిల్లా కార్యాలయంలో, మరికొందరు వివిధ మండలాల్లో పనిచేస్తున్నారు. గుర్తించిన అక్రమాలపై లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకొనే యోచనలో కమిటీ ఉన్నట్లు సమాచారం.



● **గ్రీన్ యాపిల్ :** ధర కాస్త ఎక్కువ. విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉంటాయి. ఎముకల పుష్టికి, కంటి చూపుకు మంచి దని చెప్తున్నారు.

● **అవకాడో :** రుచిగా ఉంటుంది. ఆరోగ్య ప్రయోజనాలు అధికం. ఇందులో విటమిట్ డీతో పాటు, పోషకాలు అధికంగా ఉంటాయి. ధర ఎక్కువ.



ఆరోగ్యం పండుగా..!

- తాజా పళ్లు, కూరగాయలు తీసుకోవడం ఉత్తమం
- సామాన్యునికి అందుబాటులో లేని పలు రకాల ధరలు
- సాధారణ ఫ్రూట్స్‌లో విటమిన్లు, పోషకాలు లభ్యం



ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రజలకు.. కోవిడ్ ముందు, కోవిడ్ తర్వాత అన్న విభజన రేఖ ఏర్పడింది. దాదాపుగా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ఈ క్రమంలో విటమిన్లు, పోషకాలు ఉండే పండ్లు, కూరగాయల వాడకంపై కూడా అవగాహన పెంచుకుంటున్నారు. అయితే కొన్ని రకాల పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. సాధారణంగా మన ప్రాంతంలో పండించే పండ్లు, కూరగాయలలో కూడా అనేక రకాల విటమిన్లు, పోషకాలు లభ్యమవుతున్నాయి. వాటిని చిన్నచూపు చూడకుండా తక్కువ ఖర్చుతో ఆరోగ్య నియమాలు పాటించవచ్చని నిపుణులు చెప్తున్నారు.

-చీరాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి)

ప్రతి రోజూ తాజా కూరగాయలు, ఆకుకూరలు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేవి ఆహారంలో తీసుకుంటే అన్నింటికన్నా అవే దివ్య ఔషధాలని నిపుణులు చెప్తున్నారు. జంక్ ఫుడ్, ఎసెన్స్, ఒకటికి నాలుగుసార్లు మరిగించిన నూనెలతో తయారు చేసిన వంటలు, హోటళ్లలో తినడం మానేయాలి. వీలైనంత వరకు జొన్న, సజ్జ, రాగులు, మినుము తదితర రకాల (మిల్లెట్స్)తో చేసిన ఆహారాన్ని రోజులో ఒకసారి తీసుకుంటే మంచిది. ప్రకృతి ఇచ్చిన పంటలు, పళ్లను తిందాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

గిరాకీ ఉన్న పండ్లు

ధరలు అధికంగా ఉన్న పండ్లలో డ్రాగన్ ఫ్రూట్స్, లిచీ, పెర్సిమ్మాన్, అవకాడో, కివీ, పీర్స్, ఆస్ట్రేలియా గ్రేప్, గ్రీన్ యాపిల్ తదితరాలు మొదటి వరుసలో ఉన్నాయి. ప్రధానంగా విటమిన్-డీ ఆరోగ్యం పరంగా ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఎండలో ప్రతి రోజూ సుమారు 20 నుంచి 30 నిమిషాలు ఎండలో ఉంటే విటమిన్ డీ శరీరానికి లభిస్తుంది.





● **అత్తిపండ్లు(అంజీరా) :** గతంలో అత్తిచెట్లు గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా ఉండేవి. వాటి పండ్లను తినేవారు. ప్రస్తుతం అవి ఉనికిని కోల్పోతున్నాయి. అంజీరా పేరుతో వచ్చే పండ్లు (డ్రైఫ్రూట్స్)గా దర్శనమిస్తున్నాయి. వీటిలో డీ, సీ, ఏ, బీ విటమిన్లు ఉంటాయి. ధర ఎక్కువ. సాధారణంగా మనకు లభించే అత్తి పండ్లలో పోషకాలు లభిస్తాయి. ధర తక్కువ.



● **కివీ :** కరోనా నేపథ్యంలో కివీ పేరు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్లేట్‌లెట్స్ పెంపునకు కివీ దోహదపడుతుందని వైద్యులు సూచించడం అందుకు కారణం. డీ విటమిన్ కూడా పుష్కలంగా లభిస్తుంది. ధర ఎక్కువ.



● **నారింజ :** ఆరెంజ్‌లో విటమిన్ సీతోపాటు డీ లభిస్తుంది. ధర అందుబాటులో ఉంటుంది.

● **అరటిపండు :** తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనకారి అరటిపండు. డీ విటమిన్ సమృద్ధిగా ఉంటుంది. మెగ్నీషియం కూడా లభిస్తుంది. రోజుకు రెండు పండ్లు తింటే మంచిదని నిపుణులు చెప్తున్నారు. (మధుమేహ వ్యాధి గ్రస్తులు వైద్యుల సలహాతో మాత్రమే వాడుకోవాలి)



● **జామ :** అన్ని రకాల పండ్లలో జామ శ్రేష్టం. తక్కువ ఖర్చు. ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. విటమిన్ డీ, సీతోపాటు మంచి పోషకాలు ఉంటాయి. ధర తక్కువ.



● **బొప్పాయి :** బొప్పాయి ధర అందుబాటులో ఉంటుంది. విటమిన్ ఏ, సీ, డీలు ఉంటాయి.

● **ఉసిరి :** అత్యంత పోషక విలువలు ఉన్న పండు. ఆయుర్వేద వైద్యంలో విస్తృతంగా వాడతారు. ధర అందుబాటులో ఉంటుంది. విటమిన్ డీ పుష్కలంగా ఉంటుంది. ఉసిరిని రకరకాలుగా వినియోగిస్తారు. ఎలా తీసుకున్నా మంచి ఫలితాన్నిస్తుంది.



● **డ్రాగన్ ఫ్రూట్ :** ఇందులో సీ, డీ విటమిన్లు ఉంటాయి. ఫ్యాట్ తక్కువ. ప్రొటీన్, ఫైబర్, ఐరన్, మెగ్నీషియం లభిస్తాయి.

● **లిచీ :** ఇది చైనా, అమెరికా, వియత్నాం తదితర ప్రాంతాల్లో విస్తారంగా పండిస్తారు. విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. రోజుకు 10 నుంచి 12 పండ్లు తింటే మంచిదని నిపుణుల సూచన. ఇది ధర ఎక్కువ.



● **పెర్సిమ్మాన్ :** ధర ఎక్కువ. చైనా, జపాన్‌లో ఎక్కువగా వినియోగిస్తారు. ప్రస్తుతం మన మార్కెట్లలో కనిపిస్తోంది.



● **ఖర్జూరం :** ఖర్జూరంలో విటమిన్ బీ పుష్కలంగా ఉంటుంది. ధర అందుబాటులో ఉంటుంది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పచ్చి పండ్లు, ఎండిన పండ్లు ఎలా తీసుకున్నా మంచిదే.



ఆస్ట్రేలియా గ్రేప్

కొత్త వైరస్‌పై కలవరం

పండుగ రోజుల్లో ప్రజల్లో ఆందోళన
ఇతర ప్రాంతాల నుంచి సంక్రాంతికి రానున్న వేలాది మంది

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చైనాను కలవరపెడుతున్న హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) జిల్లా ప్రజలనూ కలవరపెడుతోంది. ఇప్పటికే మన దేశంలోని బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాలలో ఈ వైరస్ బయటపడడంతో ఆందోళన నెలకొంది. కరోనా కోరల నుంచి కోలుకున్న ప్రజానీకం మళ్లీ ఇప్పుడు చైనాలో హెచ్‌ఎంపీవీతో అక్కడి ప్రజానీకం తల్లడిల్లిపోతుండగా ఆ ప్రభావం దేశం మీదపడితే పరిస్థితి ఏమిటో అర్థం కాక ప్రజల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి నెల పండుగ సీజన్ కావడంతో వివిధ దేశాలు, రాష్ట్రాలు, మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉండే ప్రజానీకం సంక్రాంతికి భారీగా తరలి వస్తారు. ఈ వైరస్ చిన్న పిల్లలకు, వృద్ధులతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెప్తున్నా ప్రజల్లో మాత్రం భయం వీడటం లేదు. ఇప్పటికే ఈ వైరస్‌పై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేయగా, రాష్ట్రంలోని వైద్యశాఖ కమిషనర్ అన్ని జిల్లాల వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. ఈ వైరస్ పెద్ద ప్రమాదకరమైంది కాదని, సీజనల్ వ్యాధుల మాదిరిగానే జలుబు, దగ్గు వంటివి వ్యాపిస్తాయని, అందువల్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో వైద్యశాఖ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా ఈ వైరస్‌పై తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



ఈ వైరస్ ప్రమాదకరమైంది కాదు
డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో

ఈ వైరస్ పెద్ద ప్రమాదకరమైంది కాదు. ప్రజానీకం ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు. వైరస్‌పై ఇప్పటికే గ్రామాల్లో మెడికల్ ఆఫీసర్ల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అలాంటి లక్షణాలు ఎక్కడైనా ఉంటే వెంటనే వైద్యాధికారుల దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు. అందుకు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తిచేయాలి

- ఈ నెల 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- సమావేశంలో కలెక్టర్ తమీమ్‌అన్సారియా



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : బీసీ యాక్షన్ ప్లాన్ 2024-25 ఆర్థికసంవత్సరంలో ఓబీఎంఎంఎస్(ఆన్‌లైన్ బెనిఫిషరీ మానిటరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం) స్వయం ఉపాధి పథకం కింద బ్యాంక్‌లకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బీసీ యాక్షన్ ప్లాన్‌లో స్వయం ఉపాధి పథకంలో భాగంగా పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధించేలా జిల్లాకు 1195 యూనిట్లు, ఆర్థికంగా వెనుకబడిన(ఈడబ్ల్యూఎస్) సంబంధించి ఓబీఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద జిల్లాకు 483 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. నిరుద్యోగ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు చేయూతనందిస్తోందన్నారు. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.8 లక్షలు ఉండగా సబ్సిడీ 4 లక్షలు, బ్యాంకు రుణం రూ.4 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు సంబంధించి బీసీ యాక్షన్ ప్లాన్ కింద 24 జనరిక్ మెడికల్ షాపులు, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు సంబంధించి ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద 85 జనరిక్ మెడికల్ షాపులు మంజూరయ్యాయన్నారు. అర్హత కలిగిన బీసీ, ఈబీసీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసువాలని కోరారు. జిల్లాలో 13 బ్యాంకుల పరిధిలో యూనిట్ల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. బ్యాంకుల వారీ, బ్రాంచిల వారీగాలక్ష్యాలను నిర్దేశించామన్నారు. చిత్తశుద్ధితో పనిచేసి ఆయా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 8నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అవుతుందని మీసేవా, సచివాలయంలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మరణించిన కుటుంబానికి 5 లక్షలు మంజూరు

- మంజూరు పత్రం అందజేసిన మంత్రి స్వామి

కొండపి, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో గత ఏడాది అక్టోబరు 1న మండలంలోని కట్టుబడివారిపాలెంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం మంజూరు పత్రాన్ని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మంగళవారం అందించారు. జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామానికి చెందిన బాధితుడు ఇట్టా వెంకట్రావు భార్య ఇట్టా ఆదిలక్ష్మికి మంత్రి అందజేశారు.



మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి స్వామి

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

ఒంగోలు క్రైం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఒంగోలులోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రి సమీపంలో మంగళవారం జరిగింది. మద్దిపాడు మండలం కొలచనకోట గ్రామానికి చెందిన కోండ్రు సింగయ్య (75) నడుచుకుంటు వెళుతుండగా ఆర్టీసీ డిపోలో నుంచి నరసరావుపేట వెళ్లే బస్సు ఢీకొంది. దీంతో సింగయ్య కింద పడిపోగా అతనిపై బస్సు ఎక్కింది. దీంతో తీవ్రంగా గాయపడిన సింగయ్యను రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ఆసుపత్రిలో ఆయన మృతి చెందాడు. ఈమేరకు తాలుకా ఎస్‌ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ 12 వరకు పొడిగింపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్‌ను ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 12వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పించాలన్నారు. వాటి ఆధారంగా ఈనెల 16వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు చెప్పారు. సమగ్ర వివరాల సేకరణ ఈనెల 20న కులగణన తుది జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ అన్సారియా తెలిపారు.

రాత పరీక్షకు 267 మంది ఎంపిక

ఒంగోలు క్రైం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానంలో కానిస్టేబుళ్ల ఎంపిక పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన పోటీల్లో రాత పరీక్షలకు 267 మంది అర్హత సాధించినట్లు ఎస్పీ ఏఆర్. దామోదర్ తెలిపారు. మొత్తంగా 361మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కాల్‌లెటర్‌లో తెలిపిన అన్ని ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని ఎంపిక పోటీలకు రావాలని అభ్యర్థులకు సూచించారు. ఏదైన అప్పీలు ఉంటే ఈనెల 10వ తేదీన చేసుకోవచ్చని తెలిపారు. అంతేగాకుండా అభ్యర్థులు తమ ఆరోగ్య పరిస్థితులను చూసుకుని హాజరు ఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాహన్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవాలి

ఒంగోలు క్రైం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): రవాణశాఖలో ఉన్న సేవలన్నీ వాహన్ పోర్టల్‌లోకి మారినందున వాహనదారులు తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల కోరారు. కమర్షియిల్ పర్పస్ వాహనాల యజమానులు వాహన్ డాట్‌ఎన్‌ఐసీలో ఈకేవైసీ, మండలమ్యాపింగ్, మొబైల్ నంబరు అప్డేషన్‌ను ఈనెల 31లోపు చేయించాలన్నారు.



పథకం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

జీతాల కోసం రామతీర్థం ప్రాజెక్ట్ సిబ్బంది ధర్నా

- 32 గ్రామాలకు తాగునీరు నిలిపివేత

మద్దిపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మద్దిపూడిలోని రామతీర్థం తాగునీటి ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న 11 మందికి ఐదు నెలలుగా ఆటు పథకం నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌గానీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గానీ జీతాలు ఇవ్వకపోవడంతో సిబ్బంది మంగళవారం పథకం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు జోక్యం చేసుకుని తమకు జీతం ఇచ్చేదాకా విధులను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. సిబ్బంది విధులు బహిష్కరించడంతో 32 గ్రామాలకు తాగునీరు నిలిచిపోయింది. అనంతరం సిబ్బంది తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పశుపోషకులతో మాట్లాడుతున్న డీఏహెచ్‌వో బేబీరాణి

నాగులుప్పలపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని డీఏహెచ్‌వో బేబీరాణి సూచించారు. చవటపాలెంలోని పశుపోషకులకు మంగళవారం పశువులలో వచ్చే సీజనల్ వ్యాధులపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న 21వ పశుగణన, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రాపర్ల పశువైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి జీవీ.సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

సంతనూతలపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ హైస్కూలుకు కరిచేటి నరసింహారావు మంగళవారం బీరువాను బహూకరించారు. హెచ్‌ఎం నరసింహారావు, ఎస్ఎమ్‌సీ చైర్మన్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

● డీఏవో శ్రీనివాసరావు



సర్వేరెడ్డిపాలెంలో శనగ పంటను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

ఒంగోలు(రూరల్), జనవరి7(ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం అధిక వర్షాలతో శనగ పంట పెరుగుదల ఎక్కువగా ఉండి పూత, పిందె ఆలస్యంగా అయ్యే అవకాశం ఉందని డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామ పరిధిలో సాగు చేసిన శనగ పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు శనగపంట పూతదశకు ముందుగా హెక్సాకొనజోల్ పురుగుమందును పిచికారి చేసి తుప్పుతెగులను నివారించుకోవాలన్నారు. వరి పంటకు బీమాకు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువైద్యాధికారి వై.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు గడ్డిపెంచుకోవటానికి విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో జి.కిషోర్‌బాబు, ఏఈవోలు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి పాల్గొన్నారు.

త్వరలో రైతులకు గుర్తింపు నంబర్లు

నాగులుప్పలపాడు: రైతులకు త్వరలోనే ఆధార్‌కార్డు మాదిరిగా రైతు గుర్తింపు నంబర్లను ప్రభుత్వం జారీ చేయనున్నట్లు ఏవో పి.వెంకట్రావు తెలిపారు. మండలంలోని ఈదుమూడి, ముప్పాళ్ల గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు గుర్తింపు నంబర్ల ఆధారంగా ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతాయని చెప్పారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ఫ్యూజివన్ సిలీంద్రనాశిని ఎకరానికి 400 ఎంఎల్ పిచికారి చేసుకోవాలని తెలిపారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల బీమాకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించారని చెప్పారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు అనురాధ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూముల సమస్యలను పరిష్కరిస్తాం : జేసీ



అర్జీని స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(రూరల్), జనవరి7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు జేసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తమ రెవెన్యూ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. భూముల విస్తీర్ణాలలో తేడాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల ఆన్‌లైన్ తదితర సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అధికారులకు పలు సూచనలు చేశారు. మొత్తం 23 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వాసు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ విష్ణువర్ధన్, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. టంగుటూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూసంబంధమైన సమస్యలున్న ప్రజలంతా ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు కామని విజయకుమార్, టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు మాట్లాడారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

చీమకుర్తి, జనవరి7(ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో ఉన్న చైన్‌ను ఇద్దరు అగంతకులు లాక్కెళ్లిన సంఘటన మంగళవారం సాయంత్రం చీమకుర్తి-కేవీపాలెం మధ్య ఉన్న రహదారిలో జరిగింది. చీమకుర్తి పట్టణానికి చెందిన కృష్ణకుమారి ప్రతిరోజూ ఈ మార్గంలో వాకింగ్ చేస్తుంటారు. రోజు మాదిరిగా వాకింగ్‌కు వెళ్లిన కృష్ణకుమారిని ఇద్దరు అగంతకులు ఆపారు. ఒక్కసారి ఫోన్ చేసుకుంటామని ఆమె సెల్‌ఫోన్‌ను అడిగారు. దీంతో కృష్ణకుమారి ఇవ్వనని చెప్పడంతో అంతలోనే ఆమె మెడలో ఉన్న బంగారం చైన్‌ను లాక్కొని బైక్‌పై ఉడాయించారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరుపుతున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

పొగాకు రైతులకు అవగాహన

చీమకుర్తి, జనవరి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లామల్లి గ్రామంలో పొగాకు బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్లంపల్లి బోర్డు వేలం నిర్వహణాధికారి తులసి మాట్లాడారు. పురుగుమందుల అవశేషాలు, అన్యపదార్థాలు పొగాకు బేళ్లలో కలవటం వల్ల ఎగుమతుల్లో సంభవించే ప్రతికూల పరిస్థితులను రైతులకు ఆమె వివరించారు. బోర్డు అనుమతి లేకుండా బ్యారన్ నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. క్యూరింగ్‌లో తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సమావేశంలో ఫీల్డ్‌ఆఫీసర్ హర్ష, శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరావు, ఐటీసీ మేనేజర్ యశ్వంత్, పీఎస్ఎస్ మేనేజర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందుకున్న విద్యార్థినులు

ఒంగోలు(రూరల్) జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరవది జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఎం రవికుమార్ బహుమతులను అందజేశారు. అఖిల భారత యువజన సమాఖ్య సహకారంతో హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి గద్దల రవి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చేయూత

చీమకుర్తి, జనవరి7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ చీమకుర్తి గెలాక్సీ చేయుత అందించింది. మంగళవారం చీమకుర్తిలో జరిగిన సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు కొండవేటి ఏడుకొండలు రూ.25వేలు, సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ అందించిన రూ.5వేలను ఆశ్రమ నిర్వాహకుడు బాషాకు అందజేశారు. చలువాది బదరినారాయణ, విజయకుమార్‌రెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, రమేష్, నరసింహారావు, అనుదీప్, ఆంజనేయులు, ముత్యాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీఈవో కిరణ్‌కుమార్

మద్దిపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డీఈవో కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన లింగంగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు వంద రోజుల షెడ్యూల్ ఏర్పాటు చేసి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరికీ సబ్జెక్టులు పూర్తిగా అర్థమయ్యే విధంగా చెబుతూ వారు ఉత్తీర్ణత సాధించే దిశగా ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించాలి

మద్దిపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పొగాకును పండించాలని గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జితేంద్రకుమార్ కోరారు. మంగళవారం వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలో బి.నిడమానూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలిమి ఆకు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం.ప్రభాకర్, ఎక్స్‌టెన్షన్ అధికారి దామోదర్, సీనియర్ మేనేజర్ పునీత్ హెచ్చి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ తనిఖీ



యంత్రాలను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మలకుమారి

మద్దిపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పరికరాలను ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలని ఏడీఏ ఇ.నిర్మలకుమారి కోరారు. మండలంలోని బసవన్నపాలెంలోని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల ద్వారా పంపిణీ చేసిన పరికరాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ పింఛన్ లబ్ధిదారుల తనిఖీ



మంగమూరులో తనిఖీ చేస్తున్న డాక్టర్ల బృందం

సంతనూతలపాడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హెల్త్ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం ముగ్గురు డాక్టర్ల బృందం తనిఖీ చేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 53 మంది హెల్త్ పింఛన్లు తీసుకుంటున్నారని, దీంతో వారు అర్హులా.. కాదా అని వారి వద్ద ఉన్న ధృవపత్రాలను, లబ్ధిదారులను తనిఖీ చేశారు. మంగమూరు, గుర్వారెడ్డిపాలెం, పి.గుడిపాడు, మైనంపాడు, ఎండ్లూరు తదితర గ్రామాల్లో 25 మందికి సంబంధించి పింఛనుదారులను తనిఖీ చేశారు. బుధవారం మిగతా వారిని తనిఖీ చేస్తామని చెప్పారు.

నిడమానూరు వాసికి డాక్టరేట్

నాగులుప్పలపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బి.నిడమానూరు గ్రామానికి చెందిన షేక్ సల్మాన్‌అష్రఫ్ చెన్నైలోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డవలప్‌మెంట్ యూనివర్శిటీలో మంగళవారం డాకరేట్ అందుకొన్నారు. అదే యూనివర్శిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ ఇంజనీరింగ్‌లో ప్రొఫెసర్ షర్మిష్టా భట్టాచార్జీ ఆధ్వర్యంలో సోషల్ ఇంక్యుబేషన్ అనే అంశంపై పరిశోధన చేసినందుకుగానూ ఆయనకు డాక్టరేట్‌ను అందజేశారు.

అవీ..ఇవీ

పొలం వివాదంలో రైతుపై దాడి

● తీవ్రగాయాలతో వైద్యశాలలో చికిత్స

కొమరోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పొలం వివాదం నేపథ్యంలో ఓ రైతుపై మరో రైతు కొడవలితో దాడిచేసిన ఘటన మండలంలోని బసువుపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు కొమరోలు మండలంలోని బసువుపల్లి గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి అనే రైతు తమ పొలంలో పంటకు నీరు పెట్టేందుకు సోమవారం రాత్రి పొలానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వెంకట సాయికుమార్‌రెడ్డి కొడవలితో గాయపర్చారు. వీరి మధ్య భూమికి సంబంధించి గతంలోనే గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో కూడా కొమరోలు పోలీసులకు తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే తనపై కొడవలితో దాడికి పాల్పడ్డారని పోలీసులకు వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. గాయపడిన క్షతగాత్రున్ని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మిర్చి తోటలో కొండచిలువ కలకలం


కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ మల్లికార్జున

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగ పాలెం గ్రామంలోని డి.నరసయ్య మిరప తోటలో కొండ చిలువ కలకలం రేపింది. మంగళవారం ఉదయం కూలీలు మిరప కాయలు కోస్తున్న సమయంలో కొండ చిలువను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. తోట యజమాని వెంటనే ఎర్రగొండపాలెం అధికారులకు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారుల సమాచారం మేరకు స్నేక్ క్యాచర్ మల్లికార్జున మిరప తోటకు వెళ్లి కొండచిలువను పట్టుకున్నాడు. దీన్ని ఆటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు స్నేక్ క్యాచర్ మల్లికార్జున తెలిపారు.

బీజేపీ కార్యాలయంపై దాడికి ఖండన

గిద్దలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై, పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు భౌతికంగా దాడి చేయడం శోచనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పట్టణ శాఖ అధ్యక్షులు ఉదయ్‌శంకర్ ఒక ప్రకటనలో ఖండించారు. ఢిల్లీలో మాజీ ఎంపీ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకున్న తరువాత కూడా ఇలాంటి దాడులు చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు ఈ ఘటనపై క్షమాపణ చెప్పాలని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టపగలు గృహంలో చోరీ

● గంటల్లోనే నగదు, నగలు స్వాధీనం


పట్టుబడిన బంగారం

కంభం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలోని ఓ గృహంలో దొంగలుపడి రూ.11,500 నగదు, 3 తులాల బంగారు చోరీ చేశారు. అయితే స్థానికంగా ఉన్న ఓ ఇంట్లో అనుమానంతో తనిఖీ చేయడంతో సొత్తు గంట వ్యవధిలోనే రికవరీ అయ్యింది. బాధితులు షేక్ బీజాన్, ఖైరున్‌బీలు చెప్పిన కథనం ప్రకారం సాద్‌మియా వీధి మసీదు సమీపంలో షేక్ బీజాన్ నివాసం ఉంటోంది. ఆమె ఇటీవల అనారోగ్యానికి గురైంది. విషయం తెలిసిన కుమార్తె ఖైరున్‌బీ తల్లి వద్దకు వచ్చింది. మంగళవారం ఇంటికి తాళం వేసి తల్లిని ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఇంటికి తిరిగి రాగానే తాళం పగులగొట్టి ఉండగా ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.11,500 నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితులు 100కు డయల్ చేసి దొంగతనం జరిగిన విషయాన్ని తెలియజేశారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. పొరుగునే నివాసం ఉంటున్న మహిళపై బంధువులు అనుమానం వెలిబుచ్చారు. అయతే సదరు మహిళ తాను దొంగతనం చేయలేదని, కావాలంటే ఇంట్లో చూడండని చెప్పగా బాధితులు ఆమె ఇంట్లో వెతకగా ఒక చోట నగదు, నగలు దొరికాయి. అయితే సదరు మహిళ మాత్రం తన ఇంట్లో వారే వెదుకుతున్నట్లు నగదు, నగలు పెట్టి దొంగతనం నేరం మోపుతున్నారని ఆరోపించారు. ఆమె బంధువులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. ఈ క్రమంలో బాధితుల బంధువు మున్నా చేతికి గాయాలయ్యాయి. ఈ విషయంపై కంభం ఎస్సై నరసింహారావును వివరణ కోరగా ఘటనపై విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

మాదిగలను క్రైస్తవులుగా చూపడం దారుణం


వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటింట కుల గణన సర్వేలో ఎస్సీ మాదిగలను క్రైస్తవులుగా చూపడం దారుణమని ఎస్సీ మాదిగ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కొన్ని సచివాలాయాల్లో ఎస్సీ మాదిగలను క్రైస్తవులుగా నమోదుచేశారన్నారు. ప్రభుత్వం పరిశీలించి వాటిని తొలగించి ఎస్సీ మాదిగలుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు వినతిపత్రాన్ని ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, దళిత నాయకులు చెదూరి సుబ్బయ్య, డి అనేష్, ఆర్ ప్రసాద్, విల్సన్, చెదూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

పట్టణ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి


డివైడర్ మధ్య పిచ్చిమొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కుమ్మరం కట్ట నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుమధ్యన ఉన్న డివైడర్‌ను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. డివైడర్ మధ్యలో పిచ్చి మొక్కలు ఉండడాన్ని, చెత్తాచెదారం ఉండడాన్ని ఆయన మంగళవారం గుర్తించి పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను ఎప్పటికప్పుడూ తీసివేసి శుభ్రంగా ఉంచాలని తెలిపారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ వెంకటదాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

రేపు జాబ్ మేళా

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని తర్లుపాడు రోడ్డులోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అరబిందో ఫార్మా, కోల్‌మామాన్ సర్వీస్, సోలార్ ఇండియా, బీపీవో కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 19 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7013950097 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ వైఖరిపై

సచివాలయ సిబ్బంది నిరసన

● కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించిన ఉద్యోగులు ● ఎన్‌జీవో సంఘ నాయకుల సమన్వయంతో సమస్య పరిష్కారం


నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7 ఆంధ్రజ్యోతి: మార్కాపురం మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఏఈ ఉమామహేశ్వరరావులు సచివాలయ ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, సచివాలయ ఉద్యోగులు స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదురు మంగళవారం నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సచివాలయ సిబ్బంది పట్ల అనుచితంగా మాట్లాడుతున్నారని, మున్సిపల్ శానిటరీ సెక్రటరీని దుర్భాషలాడి కొట్టడానికి చెయ్యి ఎత్తారని సచివాలయ ఉద్యోగులు ఎన్‌జీవో సంఘ నాయకులకు తెలిపారు. కమిషనర్ ప్రవర్తనతో విసుగు చెంది అనేక మంది సెలవులపై వెళ్లారన్నారు. ఆయన ఏకపక్ష నిర్ణయాలతో కమిషనర్ తమను వేధిస్తున్నారని ఎన్‌జీవో సంఘ నాయకులకు ఫిర్యాదు చేశారు. సెలవులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఏఈ ఉమామహేశ్వరరావు చీపుర్లు కూడా ఇవ్వడం లేదని, మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా మాట్లాడుతు న్నారని తెలిపారు. సచివాలయాలలో కనీస సదుపాయాలు కల్పించకుండా వేధిస్తున్నారని, కనీసం స్టేషనరీ కూడా ఇవ్వడం లేదని ఎన్‌జీవో నేతలకు తెలిపారు. ఒక సచివాలయ మహిళా ఉద్యోగి తన బిడ్డకు ఆరోగ్యం సరిగా లేకపోవటంతో సెలవు అడగటానికి వెళితే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెలవు మంజూరు చేయకుండా ఆమెను అక్కడే నిలబెట్టారని ఎన్‌జీవో నాయకులకు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల నిరసన కార్యక్రమం తెలుసుకున్న ఎన్‌జీవో సంఘ నాయకులు టీవీ శ్రీనివాసశాస్త్రీ, శ్రీనివాసులు, బాల విజయకుమారి, సరస్వతి, రవికిరణ్, రామకృష్ణారెడ్డిలు కమిషనర్ డీవీఎస్ నారాయణ, ఏఈ ఉమామహేశ్వరరావుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఉద్యోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, మరొకసారి ఇటువంటి పరిణామాలు తలెత్తితే చూస్తూ, ఊరుకోమన్నారు. ఏఈ మహేశ్వరరావు మహిళా ఉద్యోగులకు క్షమపణలు చెప్పారు. కమిషనర్ డీవీఎస్ నారాయణ మాట్లాడుతూ, తాను ఉద్యోగుల విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించానని, ఎటువంటి దుర్భాషలాడలేదన్నారు. చెరువుకట్టపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సమయంలో ఆ పరిసర ప్రాంతాలన్ని చెత్తా చెదారంతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయని, కనీసం కొబ్బరికాయ కొట్టేందుకు కూడా స్థలం లేదన్నారు. ఈ విషయమై శానిటరీ సెక్రటరీని మందలించానన్నారు. ఉద్యోగుల సెలువలలో కూడా తమ ప్రమేయం ఏమి లేదన్నారు. ఏది ఏమైనా తామంతా కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి పనిచేస్తామన్నారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్‌జీవో నాయకులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేసిన అనంతరం విద్యార్థులతో ఎస్టీయూ నాయకులు

తర్లుపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లుపాడు, చెన్నారెడ్డిపల్లి, మీర్జపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీటి ద్వారా విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించవచ్చన్నారు. విద్యార్థులందరికీ ఎస్టీయూ మెటీరీయల్ పంపిణీ చేయటం హర్షణీయం అన్నారు. స్టడీ మెటీరీయల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు కశ్శెట్టి జగన్‌బాబు, కార్యదర్శి నజీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని రాయవరం గ్రామ పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ మంగళవారం యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రాజేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచిమార్కులతో ప్రతిభను చూపించాలని కోరారు. స్టడీమెటీరియల్ ఉపయోగించుకుని పదవ తరగతి పరీక్షలలో అధిక మార్కులు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

శివపురంలో మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి). భూ సమస్యల పరిస్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. మండలంలోని శివరాంపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభ అవగాహన ర్యాలీ గ్రామస్థులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామంలో నిర్వహించారు. గ్రామంలో గ్రామ దేవత భూమి ఆక్రమణ జరిగిందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఎల్‌పీ నంబర్ 51లోని పొలిమేర దేవత భూమిని పరిశీలించి సర్వేయర్‌లతో కొలతలు వేసి హద్దులను పరిశీలించారు. పక్కనే మిరపపంటను సాగుచేస్తున్న రైతుతో సాగు వివరాలను తెలుసుకుని పంట నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ సంజీవయ్య, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి : భూసమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం బృహత్తరమైన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నవరం, రాములవీడు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలతో దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రెవెన్యూ సదస్సులో అర్జీ ఇస్తే త్వరితగతిన పరిష్కారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గురవయ్య, ఎండోమెంట్ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి


డ్రా తీస్తున్న మేనేజర్ నరసింహులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రయాణికుడు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని మార్కాపురం డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పుల్లలచెరువు, గుండంచర్ల రూట్లలో తిరిగే ప్రయాణికులకు బస్సులలో ఏర్పాటు చేసిన గిఫ్ట్‌స్కీమ్ బాక్సులలో టికెట్ల డ్రాను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన ప్రయాణికులకు బహుమతులు అందించారు. ఆర్టీసీ సేవలు అందరూ ఉపయోగించుకోవాలన్నారు. సిబ్బంది కూడా నిబద్ధతో పనిచేసి ప్రయాణికులతో మర్యాదగా మెలగాలన్నారు.

రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

కంభం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ నుంచి రుణం పొందాలనుకొనేవారు బీసీ కులాల వారు ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

జోరుగా సీసీ రోడ్డు పనులు

● ఉమ్మడివరంలో రూ.30 లక్షలతో నిర్మాణాలు


సీసీరోడ్ల పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పుల్లలచెరువు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామి పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డుల నిర్మాణం జోరుగా సాగుతుంది. మంగళవారం మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో 30 లక్షల రూపాయల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని వచ్చే ఐదేళ్ళలో రాచకొండ పంచాయతీలో నూరు శాతం సీసీ రోడ్డులను నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మునగాల రామిరెడ్డి, టీడీపీ నాయకులు అన్నపురెడ్డి యల్లారెడ్డి,ముటూకూరి శ్రీనివాస్,కుందూరు కోటిరెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు సాగు పెరిగితే రైతులకు అనర్థమే

పొదిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగు విస్తీర్ణం పెరిగితే రైతులకు అనర్థాలు తప్పవని రైతులను పొదిలి వేలం కార్యనిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పొదిలి వేలంకేంద్రం పరిధిలో 9 వేల హెక్టార్లలో సాగుకు అనుమతి ఉందన్నారు. అయితే ఇప్పటికే 10,500ల హెక్టార్లలో సాగు చేశారన్నారు. మరో వెయ్యి హెక్టార్లలో సాగుచేసే అవకాశం ఉందన్నారు. డిసెంబరు నెల దాటిన్నప్పటికీ, ఇంకా పొగమొక్కలు వేస్తుండడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కర్నాటక మార్కెట్ ఆశాజనకంగా లేని విషయం రైతులు గమనించాలన్నారు. దీనికి తోడు తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా ముదురుగా సాగుచేసిన పొగాకు నాణ్యత తగ్గె అవకాశం ఉందన్నారు. ప్రతికూల పరిస్థితులను గమనించి రైతులు విధిగా సాగు నియంత్రణ పాటించాలని సూచించారు. వర్షాల వలన నాణ్యత తగ్గడం, ఆకుపైన గుళ్లరావడం వంటివి కనిపిస్తుందన్నారు. అవి ఆశిస్తే నాణ్యతపరమైన ఇబ్బందులు వస్తాయన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి అన్నదాతలు పొగాకుసాగు తగ్గించుకొని వీలైనంత వరకు ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగుచేసుకోవడం మంచిదన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఎంపీడీవో

పెద్దదోర్నాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరానికి సంబంధించిన బీసీ కార్పొరేషన్ ద్వారా లభించే రాయితీ రుణాల కోసం మండలంలోని బీసీ, ఈబీసీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్లు మంజూరుకు ఈ నెల 8వ తేదీ నుండి 19వ తేదీ వరకు సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గొర్రెల పెంపకం, మినీడైరీ, ఆటో, వెదురు బుట్టల తయారీ, సెల్‌ఫోన్ రిపేర్, లాండ్రీ వంటి 52 రకాల యూనిట్లలో, బీసీలకు 23, ఈబీసీలకు 11యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. సద్వినియోగ పర్చుకోవాలని కోరారు.

ముక్కోటికి ఏర్పాట్లు చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ నెల 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా చెన్నకేశవస్వామి ఉత్తరద్వార దర్శన కార్యక్రమ ఏర్పాట్లును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఉత్తరద్వారం వద్ద మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీ తట్టుకునేందుకు అన్ని కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉత్తర ద్వారదర్శనం అనంతరం తూర్పు ద్వారంలో స్వామి కాసేపు దర్శనమిచ్చి అనంతరం నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ, పట్టణ ఎస్ఐ సైదుబాబు, రథసప్తమి కమిటీ ఉపాధ్యాక్షులు ఆలంపల్లి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల స్లిప్ తప్పనిసరి : డీఐ ఉషారాణి

● మెడికల్ దుకాణాల నిర్వాహకులకు సూచన


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మెడికల్‌షాపుల యాజమాన్యం వైద్యల స్లిప్‌లేకుండా మత్తుమందులు అమ్మరాదని మార్కాపురండ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని మెడికల్‌షాపులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్సు లేకుండా షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలం చెల్లిన మందులు, అధిక రేట్లకు మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో బ్లడ్‌బ్యాంక్ నిల్వ చేసే సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు మేలు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయసాగు పద్ధతిలో రైతులు సాగు చేస్తే పంటలు దిగుబడి పెరిగి లాభసాటిగా ఉంటుందని ఉద్యానవన శాఖ అధికారి ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బోయలపల్లి, వీరభద్రాపురం గ్రామాలలో వ్యవసాయశాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో సాగుచేసిన మిరప, కంది, పత్తి పంటలను పరిశీలించారు. రబీలో సాగుచేసిన రైతాంగం తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఖరీఫ్‌లో సాగుచేసిన రైతులు వారి పేర్లను రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. రైతులు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రి రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రమేష్ అంజి నాయక్, మద్దయ్య, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది మస్తాన్, శివ, నాసరయ్య, నాగలక్ష్మీ రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పొలాల పరిశీలన

కంభం : ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న మినుము, శనగ పంటలను ఏవో స్వరూప పరిశీలించారు. పంటలో తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు.. శనగపంట పూత నిలబడడానికి 13.0.45, పచ్చపురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 20 ఎంఎల్, కోరాజిన్ 40 ఎంజి ఎకరాకు పిచికారి చేయాలన్నారు. కందిలో కాయ ఎర్రగా కనపడుతూ పుచ్చులు రాకుండా ఉండడానికి మోనో క్రొటోపాస్ 350 ఎంజి లేదా మల్టికె 300 గ్రాములు పిచికారి చేసుకోవాలన్నారు.


దోర్నాలలో మిరపతోటను పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు : మండలంలోని దంతెరపల్లి, ఓబులా పురం తాండా గ్రామాలలో వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీసీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు జరుగు తున్నందున రైతులు తప్పనిసరిగా సాగు చేసిన పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. అతివృష్టి, అనావృష్టి సందర్భాలలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం, పంటల భీమా, మద్దతుధర, సున్నావడ్డీ ప్రయోజనాలు పొందవచ్చన్నారు. సూక్ష్మనీటి యాజమాన్యశాఖ అధికారి మోహనకృష్ణ మాట్లాడుతూ 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు, 50 శాతం సబ్సిడిపై స్ప్రింక్లర్లు అందిస్తామని రైతులకు తెలిపారు. అనంతరం జొన్న, కందిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చీడ పీడలు, నివారణ చర్యల గురించి వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని యడవల్లి, గంటవానిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగుచేసిన పంటలను ఏవో జవహరలాల్ నాయక్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలని, ఫసల్‌బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, వహెచ్ఏ సంధ్యాభాయి తదితరులు పాల్గొన్నారు.


వై.పాలెంలో సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న ఆదిరెడ్డి

తర్లుపాడు : ఫసల్‌బీమా పథకం దరఖాస్తు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కేతగుడిపి, బుడ్డపల్లెలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, రైతులు ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ అగ్రీ స్టాప్ ప్రాజెక్టు పేరుతో రైతు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్‌లో రైతుకు 14 సంఖ్యల గల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తారన్నారు. ఈ యాప్‌ను చేసుకున్న రైతులకు అన్ని ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గాయత్రీ, బాబు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దొనకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు .. పెద్దారవీడు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన సీహెచ్ క్రాంతికుమార్ కంభంపాడు నుంచి కొచ్చెర్లకోటకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈక్రమంలో దోర్నాలకు చెందిన ఇద్దరు దొనకొండ వైపు నుండి దోర్నాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఢీకొనడంతో క్రాంతికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శ్రీశైలం బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

తాళ్లూరు, జనవరి7(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు ప్రాంతం మీదుగా తిరుగుతున్న అద్దంకి-శ్రీశైలం ఆర్టీసీ బస్సును గత మూడు రోజులుగా రద్దు చేయటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు నెలలుగా ఈప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు అద్దంకి డిపో నుంచి బస్సును నడుపుతున్నారు.

దీంతో అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి మండలాల్లోని పలుగ్రామాలకు చెందిన ప్రయాణికులకు పుణ్యక్షేత్రమైన శ్రీశైలం వెళ్లడానికి ఎంతో సౌలభ్యంగా ఉంది. అర్ధంతరంగా సర్వీస్‌ను రద్దు చేయటం తగదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. తిరిగి పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లూరు, జనవరి7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ రుణాల కోసం లబ్ధిదారులు ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.సుందరరామయ్య కోరారు. అర్హతగల లబ్ధిదారులు తమ కులధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్ తదితర వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తకు సాయం

తాళ్లూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని అంబేడ్కర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త పులుగు చినమోషాకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆపార్టీ మండల నాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డి రూ.ఐదు వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోషాను మంగళవారం పరామర్శించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తరుపున తన వంతుగా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. పార్టీ తరుపున అండగా నిలుస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన వెంట నాదెండ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

ఈపంట నమోదు చేసుకోవాలి

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫసల్ బీమా యోజన పథకానికి వరికి తప్ప మిగిలిన పంటలకు గడువు ముగిసిందని ఏవో కె.రాధ తెలిపారు. మంగళవారం మండలంలోని మోపాడు, లక్ష్మీనరసాపురంల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంటలు వేయకుండా బీమా కోసం రైతులు చేసుకొనే దరఖాస్తులు స్వీకరించేదిలేదన్నారు. సాగులో ఉన్న పంటలన్నింటిని ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. అలాంటి పంటలకు బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈసందర్భంగా వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు జి.సంతోష్, జి.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

సీఎస్‌పురం(పామూరు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని కె.అగ్రహారం ఎస్టీ కాలనీలో మౌలిక వసతులులేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి పెద్ద మస్తాన్ అన్నారు. యానాదుల కాలనీలో 30 కుటుంబాలు జీవిస్తున్నారని చెప్పారు. ఇప్పటికీ ఆధార్, రేషన్ కార్డులు లేక గుడిసెల్లోనే జీవిస్తూ ప్రభుత్వ పథకాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలనీలో వీధిలైట్లు, మంచినీటి వసతి, రోడ్డు సౌకర్యం లేదన్నారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే, ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలదే కీలకం

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ యాజమాన్య కమిటీలదే కీలకమని హెచ్‌ఎం ఎం.రామస్వామి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను ప్రతిరోజు తప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, బి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి

» గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్



ముండ్లమూరు: ఉమామహేశ్వర అగ్రహారంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

దర్శి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లంకోజనపల్లి, ఎర్రోబనపల్లి, సామంతపూడి, పోతకమూరు గ్రామాల్లో పీఎంఏవై కింద మంజూరై నిర్మాణాలు, పూర్తయిన గృహాలను ఆయన పరిశీలించారు. మిగిలిన గృహాలను నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారులకు అధికారులు, సిబ్బంది అవసరమైన సహకారం అందించి నిర్మాణ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ నిరీక్షన్‌రావు, ఏఈ షాకీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పక్కాగృహాలు నిర్మించుకోవాలి

ముండ్లమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, తూర్పు కంభంపాడు గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గృహాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరుకల్లా గృహాలు నిర్మించుకుంటే వారి ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారు. మండలంలో పక్కా గృహాల కోసం 187 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. ఇంకా అర్హత ఉన్నవారు ఉంటే దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని చెప్పారు. సిబ్బంది ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన గృహాలు పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై గృహాల పురోగతిపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో డీఈ నిరీక్షణరావు, ఏఈ టి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాలు త్వరగా నిర్మించుకోవాలి

కురిచేడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు త్వరితగతిన పక్కాగృహాలు నిర్మించుకోవాలని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పడమర గంగవరం, పొట్లపాడు గ్రామాలలో ఆయన పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహాలు మంజూరైనవారు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ నిరీక్షిణ రావు, మనోహర్‌బాబు, మరియదాసు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ

దొనకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దొనకొండ నుంచి పొదిలి వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో పెద్దన్నపాలెం చెరువుకట్టపై వెలసిన శ్రీకృష్ణుని దేవాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. దేవాలయానికి చెందిన ఐరన్ తలుపు పగులకొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. ఏడాదికి పైగా తాళాలు తెరవని హుండీని పగులకొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు. అనంతరం దేవాలయం వెనుక ఉన్న గదులకు చెందిన అన్నీ తాళాలు, బీరువాను పగులకొట్టి దాదాపు 40 ఇత్తడి గంటలు, దాదాపు అరకేజీ నాగమయ్య వెండి పడిగలు, 32 ఇంచుల టీవీ, సీసీ కెమెరాలు, స్పీకర్ బాక్స్‌లు, స్టోర్ రూమ్‌లోని 22 బియ్యం బస్తాలు దాదాపు రూ.2 లక్షల విలువైన వస్తువులు అపహరించినట్టు సమాచారం. ఉదయం దేవాలయ నిర్వాహకులు లైట్లు ఆర్పేందుకు దేవాలయం వద్దకు రాగా, తలుపుల తాళాలు పగులకొట్టి ఉండటం చూసి ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు.



దొంగలు పగులకొట్టిన హుండీ

గతంలో రెండుసార్లు ఇదే దేవాలయంలో చోరీకి పాల్పడినట్టు ధర్మకర్త సుబ్బారావు తెలిపారు. పోలీసుల సూచన మేరకు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. సీసీ కెమెరాలను, వాటి పరికరాలను సహితం దొంగలించి చోరీ చేయటంతో దొంగల బారినుంచి ఎలా కాపాడాలో అర్థంకావడంలేదని సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు.



దొంగలు పగులకొట్టిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

త్రిపురాంతకం సీఐ జి.హసాన్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మార్కాపురంకు చెందిన క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. దేవాలయ నిర్వాహకులు బ్రహ్మయ్య పిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలపై యువత దృష్టి సారించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్

దర్శి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలపై యువత దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొట్టిపాటి-నారపుశెట్టి మెగా టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మచ్చలేని నాయకులైన మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటుచేయటం ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎస్సై ఎం.మురళి, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కె .చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మారెళ్ళ వెంకటేశ్వర్లు, ఎం.శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. భూమస్యలకు సంబంధించి అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంగళవారం మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామ పంచాయతి పరిధిలోని పుట్టంనాయుడుపల్లిలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22 మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నెపల్లి విజయ్‌శేఖర్, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ జడ్పీటీసీ బొల్లా మహాలక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ రాయవరపు రుస్సీరాణి, టీడీపీ నాయకుడు రాయవరపు మాల్యాద్రిచౌదరి, ఎంఆర్ఐ బి.మల్లికార్జునరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాం అజయ్ కుమార్, వీఆర్వో అమ్ములూరి సుధాకర్‌రావు, మండల సర్వేయర్ స్వప్న, ఈవో నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ముండ్లమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కారానికి చర్యలు తీసుకుంటుంటున్నట్టు తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని చినఉల్లగల్లు, బసవాపురం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూముల సరిహద్దులు, రికార్డుల్లో తప్పులు ఉంటే పరిష్కరిస్తామని చెప్పారు. రైతులు తగు సమాచారంతో అర్జీలు ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో ఆర్ఐ మూర్తి, మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వోలు పెద్దన్న, కోటయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: చిన్నఉల్లగల్లులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తాళ్లూరు, జనవరి7 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పరిష్కారంకాక రైతాంగం ఇబ్బందులు పడుతున్న భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.సంజీవరావు తెలిపారు. మంగళవారం మండలంలోని దోసకాయలపాడులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రీసర్వే జరిగిన దోసకాయలపాడులో పొరపాట్లు చోటుచేసుకున్నాయన్నారు. రైతులు అన్నివివరాలతో అర్జీలు ఇస్తే పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా 40 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్‌వో రమణమ్మ, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జనరేటర్

» విద్యుత్ అంతరాయం ఏర్పడితే నిలిచిపోతున్న ప్రభుత్వ కార్యకలాపాలు

తాళ్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి ప్రభుత్వం మంజూరుచేసిన జనరేటర్ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. పది సంవత్సరాల క్రితం కార్యాలయానికి రూ.లక్ష వెచ్చించి జనరేటర్ ఏర్పాటుచేశారు. ప్రారంభంలో కొన్నిరోజులు మాత్రమే ఉపయోగించారు. ఆతరువాత డీజిల్ ఖర్చు అధికమవుతుందన్న సాకుగా చూపుతూ జనరేటర్‌ను వినియోగించడంలేదు. గతంలో విద్యుత్‌కు అంతరాయం జరిగినపుడు అతి కష్టం మీద డీజిల్ సమకూర్చి జనరేటర్‌ను వాడుకునేవారు. గత కొంత కాలంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర అధికారులు నిత్యం పలుశాఖలపై టెలీ కాన్ఫరెన్సు నిర్వహిస్తున్నారు. ఆసమయంలో విద్యుత్‌కు అంతరాయం జరిగితే అర్ధంతరంగా ఈకార్యక్రమం నిలిచిపోతుంది. దీంతో ఉన్నతాధికారుల సూచనలు క్షేత్రస్థాయికి చేరటం లేదు. గ్రామంలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తే తహసీల్దార్ కార్యాలయంలో కార్యకలాపాలు స్తంభించిపోతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న జనరేటర్

స్థానిక అధికారులు దీని గురించి పట్టించుకోకపోవడంతో జనరేటర్ ఎందుకు పనికి రాకుండాపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

కాలుష్య నివారణ చర్యలు పాటించాలి

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల సమీపంలో ఉన్న కంకరు మిల్లుతో స్థానికులు దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నారని మార్కాపురం మైనింగ్ శాఖ జియాలజిస్ట్ డి.పోలిరెడ్డి అన్నారు. వెంటనే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నివాస ప్రాంతాల్లో కంకర మిల్లు ఉండటంతో స్థానికులు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో మండలంలోని నుచ్చుపొద గ్రామానికి చెందినవారు గత అక్టోబరు 21న జిల్లా కలెక్టరు, జేసీ, ఆర్డీవో, తహసీల్దార్, పంచాయతి కార్యదర్శులకు ఫిర్యాదు చేశారు.



కంకరమిల్లును పరిశీలిస్తున్న మైనింగ్ జియాలజిస్ట్ పోలిరెడ్డి

కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు పోలిరెడ్డి తెలిపారు. ముందుగా ఈ సమస్యపై స్థానికులతో చర్చించారు. స్టోన్‌క్రషర్‌తో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే మరో చోటకు తరలించాలని కోరారు. అనంతరం మిల్లు పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు.

కంకర్‌మిల్లుకు సంబంధించి అన్ని అనుమతులు సక్రమంగా ఉన్నాయని చెప్పారు. అయితే, మానవతా దృక్పథంతో కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాము కూడా త్వరలో మరో చోటకు మి ల్లును తరలిస్తున్నామని మేనేజింగ్

రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ముండ్లమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వచ్చిన పెండింగ్ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. పదేపదే రైతులను కార్యాలయానికి తిప్పుకోవద్దన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమాచారాన్ని వీఆర్‌వోలు సేకరించాలన్నారు. రేషన్ కార్డులు, అసైన్‌మెంట్ భూముల వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో కె.శ్రీనివాస్

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి పథకాల కోసం గ్రామ సచివాలయ సిబ్బంది చేపట్టే సర్వేలను సమగ్రంగా నిర్వహించాలని డీఎల్‌డీవో కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రస్తుతం జరుగుతున్న సర్వేలు, ఉపాధి హామీ కార్యక్రమాలపై గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులందరికి ప్రభుత్వ పథకాలు దరిచేరేలా గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో బి.సురేష్, ఈవో పీఆర్డీ కె.శ్రీనివాసరావు, ఏపీవో బి.మాల్యాద్రి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు జి.పద్మజ, ఎంపీఎస్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు విరివిగా పురుగు మందులు వాడొద్దు!

ముండ్లమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులు వాడవద్దని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం మండలంలోని పూరిమెట్లలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారుల సూచనలప్రకారం పంటలను సాగుచేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కందిలో మచ్చల పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ మస్తాన్‌రావు, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ రాకేష్‌ను సన్మానించిన హరీష్

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డూండి రాకేష్‌ను తెలుగుయువత పామూరు పట్టణ అధ్యక్షుడు పందిటి హరిష్ సన్మానించారు. విజయవాడలోని గాంధి మున్సిపల్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో హరీష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రాకేష్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎస్సీల్లో 59 ఉపకులాలకు ఫలాలు అందాలి

కనగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లోని 59 ఉపకులాలకు ఫలాలు అందాలని జైభీం దళిత బహుజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సూరె రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆర్‌ఆర్ మిశ్రా కమిటీకి సోమవారం ఒంగోలులో తన వాణిని వినిపించినట్టు తెలిపారు. వర్గీకరణ సమ్మతమేనని, వెంటనే వర్గీకరణ అమలు జరగేలా రాష్ట్ర ఏకసభ్య కమిషన్ కేంద్రానికి నివేదిక ఇవ్వాలని కోరారు. దళితులలోని 59 ఉపకులాలతో మాలలు ఎలాంటి పొత్తు కాని, వివాహ సంబంధాలుకాని చేసుకున్నది లేదన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు సహకారం

కనగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో సౌకర్యాల కల్పనకు సహకారం అందించడం అభినందనీయమని మోడల్ స్కూల్ హెచ్‌ఎం పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులోని మోడల్ స్కూల్‌కు రిటైర్డ్ ఉపాధ్యాయుడు సింగారెడ్డి మోటర్ అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో 550 మంది విద్యనభ్యసిస్తున్నారన్నారు. సింగారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ వైస్‌ప్రిన్సిపాల్ రమణయ్య, జ్యోతి, పి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో కమిటీల పాత్ర కీలకం

కనిగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష శిక్షణ కార్యక్రమాలపై ఎంఈవోలు రాజాల కొండారెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డిలు డాక్యుమెంటేషన్ చేసిన తీరు అభినందనీయమని రాష్ట్ర సమగ్ర శిక్ష పథక సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. అమరావతిలో సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్యుమెంటేషన్‌ను ఎంఈఓలు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల విద్యాకమిటీల పాత్ర విద్యా వ్యవస్థలో చాలా కీలకమని అన్నారు. శిక్షణ కార్యక్రమాల వీడియోలు, ఫొటోల ద్వారా పొందుపరచిన తీరు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆదర్శంగా తీసుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. సీఎస్‌పురం మండలంలో ఎస్‌ఎంసీలకు ఇస్తున్న తీరుపై ఎంఈవో రాజాల కొండారెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవోలు దేవిరెడ్డి రామిరెడ్డి, శ్రీనివాసాచారి, బి.నరసింహారావు, రమాదేవిలు పాల్గొన్నారు.

కాలువలో యువకుడు గల్లంతు

కురిచేడు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కురిచేడు సమీపంలోని దర్శి బ్రాంచి కాలువలో వినుకొండకు చెందిన యువకుడు జువ్వెనబోయిన వెంకట వరప్రసాద్ (45) గల్లంతు అయినట్లు సమాచారం. కాలువ కట్టపై అతడి ద్విచక్రవాహనం, చెప్పులు ఉండటంతో గల్లంతు అయినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. వారి కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితుడు సైదులుతో కలసి ద్విచక్రవాహనంపై వరప్రసాద్ దర్శికి వచ్చారు. అక్కడ పోలేష్ అనే వ్యక్తితో కలసి మద్యం సేవించారు. మధ్యాహ్నం తరువాత దర్శి నుంచి కురిచేడుకు సైదులుతో కలసి వరప్రసాద్ వచ్చారు. ఇరువురు దర్శి బ్రాంచి కాలువ మీదకు వెళ్లారు. ఆతరువాత నుంచి కనిపించడంలేదు. మంగళవారం వరప్రసాద్ కుటుంబసభ్యులు, వినుకొండ పోలీసులు సైదులును తీసుకుని కురిచేడులో కాలువ కట్టమీదకు వచ్చి పరిశీలించారు. సైదులు మాటలు అనుమానాస్పదంగా ఉన్నాయని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై వరప్రసాద్ భార్య మంగళవారం కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన

తాళ్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను సర్వశిక్ష ఏఈ కె.కోటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ భవనం నిర్మాణం కోసం సర్వశిక్ష కింద రూ.23లక్షల 10 వేలు నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో టీడీపీ నేత ఐ.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 18న రక్తదాన శిబిరం

పామూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్టు ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సత్యదేవుని కల్యాణ మండపంలో జరిగే రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఇందుకుసంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, ఎం.రమణయ్య, పందిటి హరీష్, ముబినా మౌలాలి, మోషే, సయ్యద్ ఖాదర్‌బాషా, టీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, జనసేన నాయకులు వై.రహీముల్లా, దరిశి ఏడుకొండలు, షేక్ సందాని బాషా తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు తదితరులు





ఉపాధిలో.. పశుగ్రాసం సాగు

- రైతులు, పోషకులకు ప్రభుత్వం ఊతం
- నూరు శాతం రాయితీతో పథకం అమలు
- గరిష్ఠంగా అరెకరంలో సాగుకు ప్రోత్సాహం
- లబ్ధిదారుల ఎంపికలో అధికంగా రాజకీయ జోక్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులు, పశుపోషకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. చిన్న.. సన్నకారు రైతుల కోసం కొత్తగా పశుగ్రాస సాగు పథకాన్ని ప్రవేశపెట్టింది. పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం ఆర్థికంగా ఊతం ఇస్తోంది. గ్రాసం పెంపకం పథకానికి ఉపాధి హామీ నిధులు వెచ్చిస్తున్నారు. ఈ పథకాన్ని నూరు శాతం రాయితీతో అమలు చేస్తున్నారు. గరిష్ఠంగా అర ఎకరంలో పశుగ్రాసం పెంచుకు నేందుకు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోంది. రైతుల్లో ఎక్కువ మంది వ్యవసాయానికి తోడుగా పాడిని చేపడుతుంటారు. గేదెలు.. ఆవులు పెంపకంపై ఆధారిపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పశుగ్రాసానికి ఇప్పటి వరకు పెద్దగా కొరత లేదు. వేసవిలో గ్రాసం కొరత తలెత్తే పరిస్థితులు ఉంటాయన్న అంచనా. ఈ పరిస్థితుల్లో నీటి ఆధారం ఉన్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. తద్వారా పచ్చి మేతను పాడి పశువులకు అందించొచ్చు. ఒక్కో మండలానికి 35 నుంచి 45 ఎకరాల వరకు సాగుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. వీరికి ఖచ్చితంగా ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. అర్హులైనవారు సమీపంలోని పశువైద్యులు.. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు పొలానికి సంబంధించిన 1బీ, జాబ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు కాపీలను జత చేయాలి. గ్రామ సభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులు పశుగ్రాసం సాగుకు అర్హులు.

నిధుల కేటాయింపు ఇలా..

పది సెంట్లలో పశుగ్రాసాల పెంపకానికి కూలి ఖర్చు కింద రూ.3 వేలు, సామగ్రి ఖర్చుల కింద విత్తనం కొనుగోలుకు రూ.3,599, మొత్తంగా రూ.6,599 చెల్లి స్తారు. 50 సెంట్లలో పెంపకా నికి వేతనం కింద రూ.15 వేలు, విత్తన ఖర్చు లకు రూ.17,992 అందజేస్తారు. ఉపాధి పథకం అధికారులు, పశువైద్యులు ధ్రువీకరణ చేసిన అనంతరం రైతులకు బిల్లులు చెల్లిస్తారు.

100 రోజుల ఉపాధి హామీ
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం
ఆంధ్రప్రదేశ్

జిల్లాకు వెయ్యి ఎకరాలు..

ఒక్కొక్క జిల్లాకు వెయ్యి ఎకరాల్లో ప్రశు గ్రాసం పెంపకం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చిన్న.. సన్న కారు రైతులు గ్రాసం పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతుల నుంచి దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలోనే వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం అధికంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పశువులు లేని రైతులు కూడా ఈ పథకం కింద దరఖాస్తులు ఇస్తున్నారన్న విమర్శ లున్నాయి. పశువుల పెంపకంపై ఆధారపడి జీవించే రైతులకు ఈ పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. రైతులు విస్తృత ప్రయోజనాల కోసం ప్రవేశ పెట్టిన పశుగ్రాస పథకంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేనిపక్షంలో అర్హులకు అన్యాయం జరగడంతో పాటు పథకం లక్ష్యాలు నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

ఆ.. చేద్దాంలే

- సచివాలయాల్లో నిర్లక్ష్య ధోరణి
- నత్తనడకన సాగుతోన్న పరిశ్రమల సర్వే
- ప్రభుత్వ ఆదేశాలపై ఉద్యోగుల అలసత్వం
- సామాజిక పింఛన్ల పంపిణీలోనూ అదే తీరు
- ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలన్నా పట్టించుకోని వైనం
- తనిఖీల్లో పరిస్థితి చూసి బిత్తరపోతున్న ఉన్నతాధికారులు
- అడిగినంత నగదు ఇస్తే ఏ సర్టిఫికెట్ అయినా జారీ చేస్తోన్న ఉద్యోగులు

అలక్ష్యం. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం గుంటూరు జిల్లాలో 10326 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలియదు. ఆ లెక్క తేల్చేందుకు ప్రభుత్వం సర్వే ఆరంభించింది. సచివాలయ సిబ్బంది ఈ సర్వేపై ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో సదరు సర్వే నత్తకంటే నిదానంగా సాగుతోంది. రోజువారీ నివేదికలో జిల్లా వెనుకబడే ఉంది.'

అబద్ధం.. 'పెన్షన్ల పంపిణీ రోజున జిల్లా అధికారులు తక్కెళ్లపాడు వెళ్లారు. అక్కడ పెన్షన్లు అందిస్తున్న సచివాలయ ఉద్యోగి ఓ చోట కూర్చొని అందరినీ అక్కడకు పిలిపించి పంపిణీ చేస్తున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తిని కూడా అదేవిధంగా పిలిపించి పెన్షన్ ఇచ్చారు. జిల్లా అధికారి ఇదేమిటని నిలదీస్తే ఆ వ్యక్తి ఇల్లు ఇక్కడే అని ఉద్యోగి సమాధానం ఇచ్చారు. ఏది చూద్దాం పదా అని జిల్లా అధికారి పెన్షన్ దారుడు ఇంటికి వెళ్తే అది సుమారు అర కిలోమీటరు పైనే ఉంది. అంత దూరం నుంచి కాళ్లు ఈడ్చుకుంటూ పెన్షన్ కోసం రావాల్సి వచ్చింది.'

అలసత్వం ఇటీవల ప్రత్తిపాడు మండలం యనమదలలో సిబ్బంది సచివాలయం తలుపులు తీసేసి వెళ్లిపోయారు. సచివాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు, ప్రింటర్లు అనేకం ఉన్నా వాటిని గాలికి వదిలేశారు. పనుల కోసం వచ్చిన వారు సచివాలయంలో అన్ని సీట్లు ఖాళీగా ఉండటం.. ఎంతసేపు వేచి ఉన్నా ఒక్కరు కూడా రాకపోవడంతో గ్రామస్తులు విసుగుపోవాల్సి వచ్చింది. తలుపులు బార్లా తీసి వెళ్లిపోవడంలో ఉద్యోగుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.



ప్రత్తిపాడు మండలం యనమదల సచివాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల సీట్లు (పాతచిత్రం)



సకాలంలో విధులకు హాజరు కావాలి.. పనుల కోసం వచ్చే వారిని తిప్పించుకోకూడదు.. సామాజిక పింఛన్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి.. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలపై ఎప్పటికప్పుడు స్పందించాలి... అని ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు సూచిస్తోంది. అయితే ప్రతీ అంశంలోనూ సచివాలయ ఉద్యోగుల్లో నిర్లక్ష్యం.. అలక్ష్యం.. అశ్రద్ధ.. అవినీతి.. కనిపిస్తోంది. కొన్ని సచివాలయాల పరిధిలో ఉద్యోగులు 11 గంటలకు కూడా రావడంలేదని.. ఏదైనా పనిపై వెళ్తే సరైన సమాధానం ఉండటంలేదని.. ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీల సమయంలోనూ ఉద్యోగుల సమయపాలన.. పనులపై నిర్లక్ష్యం.. ఆదేశాలపై అలక్ష్యం.. తేటతెల్లమవుతోంది. కొన్ని సార్లు నిర్లక్ష్యంగా ఉండే ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నా.. వారి పనితీరులో మాత్రం మార్పు ఉండటంలేదని ఉన్నతాధికారులే వాపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొందరు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ పని చెప్పినా సిబ్బంది సాచివేత ధోరణి.. ప్రభుత్వ ఆదేశాలను కూడా పట్టించుకోవడంలేదు.. ఇదీ పలు సచివాలయాల్లోని ఉద్యోగుల తీరని కొందరు జిల్లా అధికారుల అభిప్రాయం. కొందరు సచివాలయ ఉద్యోగులు పనుల కోసం వచ్చే వారిని మామూళ్ల కోసం పీడిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు ఏమీ కాదన్న ధోరణిలో కొందరు ఉన్నారు. పరిశ్రమల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉండగా.. దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యధోరణిలో ఉన్నారు. ఈ సర్వే అంశంలోనే సచివాలయ ఉద్యోగుల పనితీరు తెలుస్తోందని పలువురు ఉన్నతాధికారులు వాపోతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కడ.. ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలిస్తే వాటికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సర్వే పూర్తి అయితేనే పరిశ్రమల లెక్క తెలుస్తోంది. అందుకు సంబంధించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తాయి. గతంలో ఒకసారి ఈ సర్వే ఆరంభించి మధ్య లోనే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ సర్వే ఆరంభించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో జరుగుతున్న పరిశ్రమల సర్వే చాలా నిదానంగా జరుగుతుంది. సర్వేకి సంబంధించి ఉదాహరణకు ఈ నెల 4న నివేదికను పరిశీలిస్తే.. గుంటూ రు జిల్లాలో 10326 పరిశ్రమలు ఉండగా, ఆ రోజు వరకు కేవలం 2591 మాత్రమే సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత రోజు నుంచి ఆ సంఖ్య దాటడం లేదు. కొన్ని సచివాలయాల్లో రోజుకు 20 కంటే ఎక్కువ సర్వే జరగడం లేదు. ఈ నివేదికలు చూసి జిల్లా అధికారులు సైతం నిత్యం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఉద్యోగుల తీరులో మార్పు రావడంలేదు.

పెన్షన్ పంపిణీ విధానమే..

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ విధానాన్ని కొందరు సచివాలయ ఉద్యోగులు మార్చేశారు. ప్రతి ఇంటికి ఉద్యోగులు వెళ్లి పెన్షన్ అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే కొందరు ఉద్యోగులు ఒక చోట కూర్చొని లబ్ధిదారులను పిలిపించి ఇస్తున్నారు. జిల్లా అధికారుల ఆకస్మిక తనిఖీలో ఇదే విషయాలు వెలుగు చూస్తున్నాయి. చివరకు ముఖ్యమంత్రి కూడా ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తుంటే కొందరు సిబ్బంది ఇలా ఎందుకు చేస్తున్నారన్నది జవాబు దొరకని ప్రశ్నగా ఉంది. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల్లో లోపాలను వెతికి వివాదాలు సృష్టిస్తున్న సచివాలయ ఉద్యోగులను (మిగతా 8వ పేజీలో)

పరిశ్రమల స్థాపనతోనే ఉత్పాదకత

- అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- పల్లెపండుగలో పూర్తి చేసి పనులను ప్రారంభించాలి
- పథకాల పురోగతిపై సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతో ఉత్పాదకత పెరుగుతుందని తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పరిశ్రమలు, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో అమలౌతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా ఉంటే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కొరిశపాడులో రూ.245.66 కోట్లతో విత్తనాలతో డీజిల్ ఉత్పత్తి చేసే పరిశ్రమను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కర్లపాలెం మండలంలో రూ.120 కోట్లతో ఏర్పాటు చేసే పరిశ్రమ ద్వారా 800మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. చీరాల ఇండస్ట్రీయల్ క్లస్టర్‌లో రూ.10 కోట్లతో వైద్యరంగానికి అనుబంధమైన యూనిట్ స్థాపనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద ఇప్పటి వరకు 36,100 దరఖాస్తులు రాగా 2,649 మందికి యూనిట్లు మంజూరు చేశామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ల సర్వే వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 45,482 విద్యుత్ కనెక్షన్లు పరిశ్రమ కేటగిరిలో ఉండగా ప్రస్తుతం 8,260 కనెక్షన్ల సర్వే పూర్తిపై ఆరాతీశారు. పొదుపు మహిళల జీవనోపాధి పెంచటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

- పల్లెపండుగ పనులు త్వరగా పూర్తి చేసి ఈ నెలాఖరిలో ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాకు 656 పనులు మంజూరు కాగా కేవలం 260 మాత్రమే పూర్తి కావడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు? సంక్రాంతికి పనులు పూర్తి కావాలన్నారు. మార్చికి 45.78 కిలోమీటర్ల సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరు చేస్తామన్నారు. చీరాల ఓడరేవు నుంచి సూర్యలంక వరకు తీరంవెంబడి గ్రామాలను అనుసంధానం చేస్తూ సీసీరోడ్డు నిర్మించాలన్నారు. నిరుపేదలు వలస వెళ్లడానికి వీలులేదని కలెక్టర్ చెప్పారు.
- సురక్షితమైన తాగునీరు ప్రతి గృహానికి పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 3,64,788 గృహాలు ఉండగా 1,48,361 గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని మిగిలిన వాటికి లేకపోవడం బాధాకరమన్నారు. నిధులు రాగానే కృష్ణా బ్యారేజి, ఎన్ఎస్పీ, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నుంచి నీటిని ప్రతిరోజు ప్రతి గృహానికి సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. 109 సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించకపోవడంపై అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సచివాలయాలు, పాఠశాలలు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తప్పనిసరిగా మరుగుదొడ్లు ఉండేలా చూడాలని లేకుంటే తక్షణమే నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నేడు జాతికి అంకితం

చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిలో చిలకలూరిపేట వద్ద సుమారు రూ.వెయ్యి కోట్లతో నిర్మించిన 16.4 కిలోమీటర్ల ఆరు లైన్ల బైపాస్ రోడ్డును ప్రధాని మోదీ బుధవారం జాతికి అంకితం చేయనున్నారు. విశాఖపట్నంలో జరిగే పలు కార్యక్రమాలలో భాగంగా ప్రధాని వర్చువల్‌గా ఈ రోడ్డును ప్రారంభిస్తారు. -చిలకలూరిపేట


నేటి నుంచి క్రికెట్ సందడి

- అంతర్ రాష్ట్ర పోటీలకు రావినూతల సిద్ధం
- గ్రామీణ ప్రాంతంలో 18 ఏళ్లుగా ఆర్‌ఎస్‌సీఏ నిర్వహణ

మేదరమెట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి క్రికెట్ పోటీలకు రావినూతల సిద్ధమైంది. బుధవారం నుంచి అంతర్ రాష్ట్ర పోటీలు ప్రారంభమవుతున్నాయి. టర్ఫ్ పిచ్‌పై జరిగే ఈ పోటీలను ఆర్‌ఎస్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం జరిగే సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలతో రావినూతలకు రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చింది. క్రికెట్ క్రీడపై ఉన్న అభిమానంతో ప్రారంభమైన టోర్నమెంట్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిని దాటి అంతర్ రాష్ట్ర పోటీలు నిర్వహించే స్థాయికి ఎదిగింది. ఈ క్రమంలో సుమారు రూ.6 కోట్ల స్టేడియం రావినూతలకు ఆస్తిగా మిగిలింది. స్టేడియం పెవీలియన్, ప్రహరి నిర్మాణం, టర్ఫ్ పిచ్ ఏర్పాటుకు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, పూర్వ కార్యదర్శి దివంగత పుట్టా వెంకట్రావు, సభ్యులు ఎంతగానో కృషి చేశారు.

1991లో ఆర్‌ఎస్‌సీఏ ఏర్పాటు

1991లో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆర్‌ఎస్‌సీఏ) ఏర్పాటైంది. ఆ సమయానికి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కూడా లేదు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో ఎక్కడా టర్ఫ్ పిచ్ లేని సమయంలో రావినూతల స్టేడియంలో టర్ఫ్ పిచ్‌పై పోటీలు నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోనే ఇన్నేళ్లు క్రమం తప్పకుండా క్రికెట్ పోటీలు నిర్వహించిన సంస్థ లేదు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారం లేకుండానే స్టేడియాన్ని ఇంతగా అభివృద్ధి చేయడం క్రికెట్‌పై అసోసియేషన్ సభ్యులకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. భారత జట్టుకు ఆడిన వేణుగోపాలరావు, నోయల్ డేవిడ్, బీసీసీఐ సెలక్టర్‌గా పనిచేసిన ఎంఎస్‌కే ప్రసాద్, రంజీల్లో ఆడిన కల్యాణ్ కృష్ణ, ఏజీ ప్రదీప్, ప్రవీణ్, వంశీలతోపాటు పలు రాష్ట్రాలలో రంజీల్లో పాల్గొన్న ఆటగాళ్లు రావినూతలలో సంక్రాంతి క్రికెట్ పోటీలలో ఆడడం విశేషం.



డ్రోన్‌తో తీసిన ఆర్‌ఎస్‌సీఎస్ స్టేడియం

సదస్సులతో సమస్యలకు చెక్ పడేనా?

- నేటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు
- ప్రజల నుంచి భారీగా అభ్యంతరాల స్వీకరణ
- వచ్చిన అర్జీల్లో 80 శాతం మ్యుటేషన్ వివాదాలే
- 5,837 రాక 3,317 పిటిషన్ల పరిష్కారం.. 2520 పెండింగ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతోమందిని బాధితులుగా మార్చారు. వారి గోడు వినకపోగా తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు, ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో భూవివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూవివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం ఆరంభం నుంచే దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8 బుధవారంతో సదస్సులు ముగియనున్నాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని సదస్సులపై బాధితుల నుంచి అర్జీల స్వీకరణ.. కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. చివరిగా ఈ నెల 8 బుధవారం కొన్ని గ్రామాల్లో మాత్రమే సదస్సులు జరగనున్నాయి. తహసీల్దార్ నేతృత్వంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌వోలు బృందంగా ఏర్పడి సదస్సుల్లో పాల్గొన్నారు. కొన్ని మండలాల్లో దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు కూడా సదస్సులకు హాజరయ్యారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురు చూస్తున్నారు. దాదాపుగా నెలకుపైగా జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో మ్యుటేషన్‌కు సంబంధించి వివాదేలా ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి వస్తున్న భూవివాదాలకు సంబంధించిన సమస్యలపై ఆయా సదస్సుల్లో బాధితులు బారులు తీరారు. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించగా ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేయడంతో పాటు సిబ్బంది విచారణ చేపడతారని తర్వాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని యంత్రాంగం చెబుతోంది. 20 శాతం పైగా దరఖాస్తుల్లో కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ, ఎఫ్‌లైన్ పిటిషన్లు వంటివి ఉన్నాయి. వాటిని సత్వరమే పరిష్కరించడానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందాయి.

277 గ్రామాల్లో..

జిల్లా వ్యాప్తంగా 277 రెవెన్యూ గ్రామాలకు 262 గ్రామాల్లో సదస్సులు జరిగాయి. మిగిలిన 15 గ్రామాల పరిధిలో బుధవారం సదస్సులు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ఇప్పటి వరకు వివిధ సమస్యలపై 5,837 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఇప్పటికే 3,317 పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. 2,520 అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దాదాపు 600 ఫిర్యాదుల వరకు స్థానికంగా ఉండే వైసీపీ నేతాగణంతో పాటు ఆ సమయంలో అక్కడ పనిచేసిన రెవెన్యూ సిబ్బందిపైనే వచ్చినట్లు తెలుస్తోంది. ఇవన్నీ కూడా బలవంతపు భూ ఆక్రమణలేనని ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చినట్లు సమాచారం. దాదాపు 250 ఎకరాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఫిర్యాదులు అందాయి. గత ప్రభుత్వంలో రేపల్లె నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నేతలు భూ అక్రమాల విషయంలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోగా సదస్సుల్లో 1,386 ఫిర్యాదులు అధికారు లకు అందాయి. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజక వర్గం ఇదే కావడంతో ఇక్కడ వచ్చిన పిటిషన్ల సంఖ్యతో పాటు వాటి పరిష్కారానికి తీసుకునే చర్యలపైనా అందరి దృష్టి కేంద్రీకృతమైంది.



రేపల్లె నియోజకవర్గ పరిధిలోని కారుమూరు గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు(ఫైల్ ఫొటో)



పోలీసులకు చిక్కిన రేషన్ బియ్యం లారీ

230 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఇంకొల్లు, జనవరి 7, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు సమీపంలో కడవకు దురు రోడ్డులోని భీమవరం షట్ల వద్ద మినీ లారీలో తరలివెళ్తున్న 230 బస్తాల రేషన్ బియ్యాన్ని ఇంకొల్లు పోలీసులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి చినగంజాం నుంచి ఇంకొల్లు వైపు మినీలారీలో బియ్యం తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు వాటిని పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. లారీ డ్రైవర్ గొట్టిపాటి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని బియ్యం లారీని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. వెంకటేశ్వర్లును విచారించగా గోగినేని వెంకటరమణ అనే వ్యక్తి చినగంజాంలో బియ్యంను లారీకి లోడ్ చేయించగా తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాతావరణ పరిస్థితుల వల్లే మిర్చికి తెగుళ్లు

ఏవో రవిప్రసాద్‌బాబు


మిర్చి రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో రవిప్రసాద్‌బాబు

పర్చూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి) ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మిర్చి పైరుకు తెగుళ్ల సమస్య నెలకొందని హార్టికల్చర్ ఏవో రవి ప్రసాద్‌బాబు అన్నారు. చల్లని వాతావరణంతోపాటు, ఐదేళ్ల కురిసిన వర్షాల నుంచి సరైన పగటి ఉష్ణోగ్రత లేకపోవడంవల్ల తెగుళ్ల ఉధృతి పెరిగిందన్నారు. దీంతో నల్లతామర పురుగు, నల్లనల్లి, బొబ్బర తెగుళ్లకు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితి అనుకూలంగా మారిందన్నారు. తెగుళ్లతో మిర్చి రైతులు బెంబేలు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై హార్టీకల్చర్ అధికారులు స్పందించారు. మంగళవారం పర్చూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మిర్చి పైరును పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతమున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకుండా మధ్యలో బవేరియా బాసియానా, వర్టిసీలియా లికాని లను సాయంత్రం వేళల్లో 5 మిలీ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే నల్లతామర పురుగు నివారణకు స్పైనోసాడ్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి లేదాఇమామెక్టిన్ 0.5లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని సూచించారు.

ఏపీ ఎయిడెడ్ కళాశాలల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటర్ బోర్డు కమిషనర్

చీరాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు కమిషనర్ కృత్తిక శుక్ల మంగళవారం ఆమె ఛాంబర్‌లో ఆవిష్కరించారు. స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గరపాటి పుష్పరాజు, జనరల్ సెక్రటరీ చావా రామారావు మర్యాదపూర్వకంగా కలిసి ఆవిష్కరింపజేశారు. అనంతరం ఎయిడెడ్ కళాశాలల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను అందించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.

ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్‌గా జాన్సన్

అల్లూరి జిల్లాకు లోకేశ్వరరావు బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)గా ఈఎస్ జాన్సన్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతిపై జాన్సన్ జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వీఎస్ లోకేశ్వరరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన అక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా నియమితులయ్యారు.

ఇరుగు పొరుగు వివాదంలో అన్నదమ్ములపై దాడి


తీవ్ర రక్త గాయాలతో వెంకటేష్


అపస్మారక స్థితిలో గణేష్

చీరాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటి సరిహద్దుల విషయంలో నెలకొన్న వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఏకంగా అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి అన్నదమ్ములపై ఇనుప రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల మునిసిపల్ పరిధిలోని గొల్లపాలెంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుబోయిన నాగేశ్వరమ్మ, గవిని ముత్యమ్మ ఇరుగు పొరుగు వారు. ఈక్రమంలో వీరికి ఇంటి సరిహద్దుల విషయంలో గతకొంత కాలంగా వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ముత్యమ్మ, నవీన్, వెంకటేష్, సుబ్బారావుమ్మ ఇనుప రాడ్లతో ఇంట్లోకి చొరబడి హెరంగా దాడి చేశారు. దీంతో అన్నదమ్ములు వెంకటేష్, గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే బంధువులు వీరిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో చీరాల్లోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. హాస్పిటల్‌కు చేరిన వెంటనే పెద్ద వాడైన వెంకటేష్ ఓ సోషల్ మీడియాలో నేను ఆమంచికి అనుకూలంగా పోస్టులు పెడుతున్నానని దాడి చేశారని చెప్పగా, రెండో వర్గం వారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీరిపై ఫిర్యాదు చేశారు.

‘బంగారు బాల్యం’కు స్కోచ్ అవార్డు

- దేశవ్యాప్తంగా ఆసాంతం పరిశీలించిన 13 ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానం
- బాలల రక్షణ కోసం ప్రత్యేకంగా సాగుతున్న కార్యక్రమం
- కలెక్టర్ అన్సారియా చొరవతో అమలు

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల్య వివాహాల నిషేధం, బాలికల్లో అక్షరాస్యత పెంపు, సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంతో చేపట్టిన బంగారు బాల్యం ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డుకు ఈ ప్రాజెక్టు ఎంపికైంది. ఆసాంతం పరిశీలించిన 13 ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ తీసుకొని దీన్ని అమలు చేస్తున్నారు. త్వరలో ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు.

వివిధ శాఖల భాగస్వామ్యం..

గత ఏడాది జూన్ ఆఖరులో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్సారియా తొలి నెల రోజుల్లోనే బాలికల అంశంపై దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా అత్యధిక బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల్లో ముందు వరుసలో మన జిల్లా ఉన్న విషయాన్ని గుర్తించారు. మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో అనేక మంది పిల్లలు, మహిళలు ప్రత్యేకించి బాలికలు, గర్భిణులు... పౌష్టికాహార లోపం, రక్తహీనతతో ఉన్న విషయాన్ని గమనించారు. వారిలో అక్షరాస్యత కూడా అతి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈనేపథ్యంలో ఒక వైపు బాల్య వివాహాల నిరోధం, మరోవైపు బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణ, అక్షరాస్యత పెంపుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని తలచారు. ఐసీడీఎస్, విద్య, వైద్య ఆరోగ్య ఇతర శాఖల భాగస్వామ్యంతో ఆ తరహా కార్యక్రమానికి రూపకల్పన చేసే ప్రయత్నంలో అది ఒక ప్రాజెక్టు తరహాలో ఉండాలన్న అభిప్రాయాన్ని పలువురు అధికారులు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే బంగారు బాల్యం పేరుతో ప్రాజెక్టు చేపట్టారు.


ఆగస్టు 29న ఒంగోలులో ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కైలాస్ సత్యర్థి

ఆగస్టు 29న ప్రారంభం

జిల్లాలో 2024 ఆగస్టు 29న ఒంగోలులో బంగారు బాల్యం ప్రాజెక్టును ప్రారంభించారు. బాలల హక్కుల ఉద్యమ కారుడు, నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ కైలాస్ సత్యర్థిని ఇక్కడికి తీసుకు వచ్చి ఆయన ద్వారా ప్రాజెక్టును ప్రారంభింపజేశారు. 18 ఏళ్లలోపు ఆడ పిల్లలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ వారిలో అక్షరాస్యత, ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక సామర్థ్యాల పెంపుపై విస్తృత అవగాహనకు శ్రీకారం పలికారు. ప్రజలను చైతన్యం చేయడంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాముల్ని చేశారు. నవంబరు 14 నుంచి 20 వరకు ప్రత్యేక వారోత్సవాలు చేపట్టి గ్రామగ్రామానా అవగాహన ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు, వెలుగు, మెప్మాల ద్వారా మహిళలతో సమావేశాలు నిర్వహిస్తూ రెవెన్యూ పోలీసు యంత్రాంగం కూడా క్రియాశీలకంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. గత ఆరు నెలల్లో జిల్లాలో ఏకంగా 30 బాల్య వివాహాలను స్థానికులు ఇచ్చిన సమాచారంతో అధికారులు అడ్డుకోగలిగారు. ఈ సమయంలో బంగారు బాల్యం ప్రాజెక్టుకు దేశంలో గుర్తింపు ఉన్న స్కోచ్ అవార్డు-24 లభించడం జిల్లా యంత్రాంగానికి మరింత ప్రోత్సాహకరంగా నిలవనుంది.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- జిల్లాకు వచ్చేవారి కోసం 264 సర్వీసులు
- ఆర్ఎం సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న ఆర్ఎం సుధాకర్‌బాబు

ఒంగోలు, కార్పొరేషన్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగను పురస్కరించుకుని జిల్లాకు వచ్చేవారి కోసం ఆర్టీసీ ప్రకాశం రీజియన్ పరిధిలో 264 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం బి.సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులను నడుస్తాయన్నారు. హైదరాబాద్ నుంచి 242, బెంగళూరు నుంచి 12, చెన్నై నుంచి 10 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా కానీ, ఏటీబీ ఏజెంట్ ద్వారా కానీ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రాను, పోను ఒకేసారి రిజర్వేషన్ చేయించుకున్న వారికి చార్జీలో 10 శాతం రాయితీ ఉంటుందని వెల్లడించారు. ఏసీ స్లీపర్, నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులు కూడా సాధారణ చార్జీలతోనే నడపుతున్నట్లు ఆర్ఎం తెలిపారు.


వెంకటేశ్వరరావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గరటయ్య

అందరికీ ఆప్తుడు వెంకటేశ్వరరావు

- గ్రామాభివృద్ధికి సహకరిస్తాం ▸ ఆలపాటి కుమారులు

మేదరమెట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సదరన్ ట్రావెల్స్, సదరన్ గ్రూప్ ఆఫ్ హోటల్ వ్యవస్థాపకుడు ఆలపాటి వెంకటేశ్వరరావు ఎంతో కష్టపడి అంచెలంచెలుగా ఎదిగారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచు గరటయ్య అన్నారు. మంగళవారం వెంకటేశ్వరరావు స్వగ్రామం పాసంగులపాడులో జరిగిన ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి గరటయ్య, డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, రిటైర్డ్ ఎస్పీ పాటిల్ అనిల్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి ఒక్కరికీ అక్కడ ఆతిథ్యం ఇవ్వడంలో వెంకటేశ్వరరావు ముందుండేవారని గుర్తు చేశారు. ప్రాసంగులపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోని పలువురిని తీసుకువెళ్లి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సదరన్ ట్రావెల్స్ వెంకటేశ్వరరావు అంటే తెలియని రాజకీయ నాయకుడు లేరంటే అతిశయోక్తి కాదు. ఏపీ రాష్ట్రం అందరికీ సుపరిచితులన్నారు. ఆయన కుమారులు ఆలపాటి కృష్ణమోహన్, ఆలపాటి ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్, శ్రీరామ్ గ్రూప్ సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాతులూరి తాండవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆ.. చేద్దాంలే

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని సెట్ సరి చేయకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని కొందరు జిల్లా అధికారులు బహిరంగంగానే అంటున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగుల్లో గత ప్రభుత్వంపై ఇప్పటికీ కృతజ్ఞత ధోరణి కనిపిస్తోందని అందువల్లే వారు ఇప్పటి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని కొందరు అంటున్నారు. అందువల్లే ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా పాటించకపోవడం, పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తోంది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హవా

సచివాలయ ఉద్యోగుల పనితీరు, వివరాల సేకరణపై కూడా గుంటూరు జిల్లాలో వివాదం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి దగ్గర ఉండి చాలా మంది జిల్లా అధికారులను సైతం దబాయించి మాట్లాడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సచివాలయ ఉద్యోగుల వ్యవహారాలు చూస్తున్నారు. జిల్లాలోని మొత్తం సచివాలయ సిబ్బంది ఆయన ఆధ్వర్యంలోనే పని చేస్తున్నారు. ఆయన ఉద్యోగి సూచనలు మేరకే సర్వేలు, సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయని సమాచారం. వివరాల నివేదికలు, ఇతర సమాచారం కోసం జిల్లా అధికారులు కూడా అదే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆధారపడుతున్నారు.

రూ.4 వేలకు సర్టిఫికెట్

గురజాల టౌన్: అడిగినంత ఇస్తే చాలు ఏ సర్టిఫికెట్ అయినా గంటల్లోనే చేతికి అందుతోంది. ఓ సచివాలయంలో ఓ అధికారి బహిరంగంగానే నగదు వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. తనకు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలుసని వసూళ్లకు మునిగితేలుతున్నారు. సాధారణంగా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందాలంటే దాదాపు నెల రోజులకుపైగానే పడుతుంది. కానీ గురజాల మండలం పులిపాడు-1 సచివాలయంలో ఓ అధికారి గంటల్లోనే ఆ సర్టిఫికెట్ ఇస్తాడు. ఉదయం రూ.4 వేలు ఇచ్చి ఇద్దరు దంపతుల ఆధార్ కార్డులను వాట్సాప్ చేస్తే సాయంత్రం కల్లా జనన, మరణ ధ్రువీకరణ పత్రం చేతికి అందుతోంది. ఐదేళ్ల గురజాలకు చెందిన ఓ వ్యక్తి సదరు ఉద్యోగికి రూ.4 వేలు ముట్టజెప్పి సర్టిఫికెట్టును పొందగా దానిని ఓ ప్రభుత్వ ఉద్యోగికి చూపించగా అది నకిలీదని తేలింది. నకిలీ బాగోతం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో ఆ సచివాలయ అధికారి చెలరేగిపోతున్నాడు. ఈ అధికారికి మండల పరిధిలోని పలువురు గ్రామ కార్యదర్శులు, మండల అధికారులు సహకరిస్తున్నట్లు సమాచారం. జనన, మరణ సర్టిఫికెట్లే కాక గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో సదరన్ సర్టిఫికెట్టుకు రూ.20 వేల దాకా తీసుకొని అధిక మొత్తంలో నకిలీ సర్టిఫికెట్లు అందించారనే ఆరోపణలు ఈ అధికారిపై ఉన్నాయి.

ద్వామాలో నేడు, రేపు కీలక విచారణ

ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ద్వామాలో పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కీలకమైన విచారణను త్రిసభ్య కమిటీ బుధ, గురువారాల్లో చేపట్టనుంది. శీనారెడ్డిపై ఫిర్యాదు చేసిన వారితో పాటు పలు అంశాలతో సంబంధం ఉన్న 36 మంది ఉద్యోగులను విచారించనుంది. ఈమేరకు త్రిసభ్య కమిటీకి నేతృత్వంలో వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు ముందుగానే నోటీసులు పంపించారు. దాదాపు నెల రోజులుగా ద్వామాలో విచారణ ప్రక్రియ కొనసాగుతున్న విషయం విదితమే. నేరుగా ప్రభుత్వం నుంచి కొన్ని, కలెక్టర్ నుంచి వచ్చిన మరికొన్ని ఫిర్యాదులను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ వాటిలో చాలా వరకు వాస్తవమని గుర్తించింది. ప్రధాన ఫిర్యాదుదారుడైన పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబు ఆరోపణలు ఎదుర్కొంటున్న శీనారెడ్డిని ఇప్పటికే వ్యక్తిగతంగా విచారించింది. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పైళ్లను కూడా కొంత మేరకు పరిశీలించింది. పలు అక్రమాలు, అవకతవకలు గుర్తించింది. కొన్ని అంశాలలో అనేకమంది ఉద్యోగుల పాత్ర కూడా ఉందన్న నిర్ధారణకు వచ్చింది. కమిటీకి అందిన ఫిర్యాదుల్లో కొందరి పేర్లు కూడా ఉన్నాయి. దీంతో ఫిర్యాదులో పేర్కొన్న, పైళ్ల పరిశీలన సమయంలో భాగస్వామ్యం ఉండే అవకాశం ఉందని తాము గుర్తించిన ఉద్యోగులందరినీ వ్యక్తిగతంగా విచారించాలని త్రిసభ్య కమిటీ సభ్యులు నిర్ణయించుకున్నారు. అందుకోసం బుధ, గురువారాల్లో కీలక విచారణ చేపడుతున్నారు. తొలిరోజైన బుధవారం ఫిర్యాదుదారులైన ఐదుగురిని విచారించనున్నారు. గురువారం ద్వామాలో ఏపీడీ నుంచి అటెండర్ వరకు వివిధ స్థాయిల్లో ప్రస్తుతం పనిచేస్తున్న, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన 31 మంది ఉద్యోగులను విచారిస్తారు. వారిలో కొందరు ద్వామా జిల్లా కార్యాలయంలో, మరికొందరు వివిధ మండలాల్లో పనిచేస్తున్నారు. తాము గుర్తించిన అక్రమాలపై లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకొనే యోచనలో కమిటీ ఉన్నట్లు సమాచారం.

అవినీతిపరులు అవుట్!

- భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు
- కనిగిరి తహసీల్దార్, వీఆర్వో సస్పెన్షన్
- అర్జీదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐపైనా వేటు
- కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతు (ఫైల్)

కనిగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసిన కనిగిరి తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మరపగుంట్ల వీఆర్వో రాధపై వేటు పడింది. వారితోపాటు అర్జీదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐ పురుషోత్తమ్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామానికి చెందిన వరికూటి మాలకొండయ్యకు 30 ఎకరాల పొలం ఉంది. ఆయన మరణం అనంతరం కుమారులు నలుగురు భూమిని భాగపంపకాలు చేసుకున్నారు. వారికి చదువు రాకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్, ఆన్‌లైన్ బాధ్యతను మాలకొండయ్య మనుమడైన మహేష్ రెడ్డికి అప్పగించారు. ఆయన నాలుగు నెలల క్రితం పునుగోడు వీఆర్వోగా పనిచేస్తున్న రాధను సంప్రదించారు. ఆమె రూ.2.50లక్షల లంచం డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని తహసీల్దార్‌కు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ కారు డ్రైవర్ చేత ఆమె బేరసారాలు సాగించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం జరిగిన ఫోన్ సంభాషణలు మహేష్‌రెడ్డి రికార్డు చేశారు. ప్రస్తుతం వీఆర్వో రాధ వెలిగండ్ల మండలంలోని మరపగుంట వీఆర్వోగా పని చేస్తున్నారు. ఈనెల 4న పునుగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పొలానికి గాను రెవెన్యూ లంచం గురించి మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఫోన్ సంభాషణలను కూడా వినిపించారు. ఆర్ఐ పురుషోత్తమ్‌రెడ్డి కూడా తన పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఆయన ఆరోపించారు. దీంతో సీరియస్ అయిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అర్జీదారుడి నుంచి లంచం డిమాండ్, ఆర్ఐ దురుసు ప్రవర్తన నిజమేనని ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. దీంతో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

ధాన్యంలో దోపిడీ

- మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం
- లభించని ప్రభుత్వ ‘మద్దతు’
- నామమాత్రంగా పనిచేస్తున్న సర్కారు కొనుగోలు కేంద్రాలు
- భారీగా నష్టపోతున్న అన్నదాతలు
- పొదుపు సంఘాల పాత్రను మరిచిన అధికారులు

దర్శి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో ప్రైవేటు వ్యాపారుల మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా పనిచేస్తున్నాయి. కొన్ని చోట్ల కేంద్రాలే అన్నట్లు నడుస్తుండగా, మరికొన్ని కొనుగోళ్లు ఊసే పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందక అన్నదాతలు నష్టపోతున్నారు.

బస్తా రూ.1400, మూడు కేజీల తరుగు

ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం ధాన్యం గ్రేడ్-1 రకం 75 కేజీల బస్తా రూ.1740, సాధారణ రకం రూ.1725కు కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో నడుస్తుంటే రైతులకు గిట్టుబాటు ధర లభించేది. కానీ అవి అలంకారప్రాయంగా మారాయి. ఇదేఅదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. మరో మూడు కేజీలు అదనంగా తరుగు కింద తీసుకుంటున్నారు. దీంతో బస్తాకు రూ.400మేర రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల తీరు అధ్వానంగా మారడం పట్ల అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిధులు ఇచ్చినా ఆసక్తి చూపని సిబ్బంది

జిల్లాలో మొత్తం 32 కేంద్రాలు ఏర్పాటు చేయగా 15 రోజుల్లో కేవలం 4,159 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేసినప్పటికీ పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తూ కొనుగోళ్లపై దృష్టి సారించడం లేదు. దీంతో రైతులు తప్పని సరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సి వస్తుంది.

కొనుగోళ్లలో పొదుపు సంఘాల భాగస్వామ్యం నిల్

ధాన్యం కొనుగోళ్లలో పొదుపు సంఘాల పాత్రను అధికారులు మరిచారు. గతంలో సీఎం చంద్రబాబు మహిళలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో 2014 నుంచి 2019 వరకు కొనుగోళ్ల బాధ్యతను అప్పగించారు. సొసైటీలు, పొదుపు సంఘాలు ముమ్మరంగా కొనుగోలు చేసినప్పుడు రైతులకు న్యాయం జరిగింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఏడాది నామమాత్రంగా పొదుపు సంఘాలకు కొనుగోలు బాధ్యత అప్పగించి ఆ తర్వాత పక్కన పెట్టారు. వారికి ఇవ్వాల్సిన కమీషన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు సంఘాలకు న్యాయం జరుగుతుందని మహిళలు ఆశపడ్డారు. అయితే అధికారులు మాత్రం వైసీపీ విధానాలనే కొనసాగిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే పొదుపు సంఘాలను ధాన్యం కొనుగోళ్ల నుంచి పక్కనపెట్టారు. దీంతో పాటు ఈ ఏడాది ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు పూర్తిగా మందగించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అవసరం కోసం ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితి గమనించి కొనుగోళ్లు ముమ్మరం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభమైన ఉపాధి పనులు


చెరువు కట్టమీద పనిచేస్తున్న ఉపాధి కూలీలు

మార్టూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. మండలంలో సోమవారం దాదాపుగా 700 మందికి పైగా కూలీలు పనులకు హాజరయినట్లు తెలిసింది. గ్రామాలలో కూలీలుతో చెరువులు పూడిక తీత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా మేజరు పంచాయతీ మార్టూరులో మంచినీటి చెరువు కట్టపై గడ్డిని తొలగించే పనులు చేస్తున్నారు. వాస్తవంగా మంచినీటి చెరువు కట్టపై గడ్డిపెరగడంతో రోజూ వాకింగ్ కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందిగా ఉంది. దాంతో ఉపాధి కూలీలతో చెరువుపై శుభ్రం చేయిస్తున్నారు. చెరువు కట్ట పై పెరిగిన గడ్డి మొక్కలతో పురుగు పుట్ర వచ్చే ప్రమాదం ఉండడంతో వాకింగ్ కోసం వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు సూచనలు చేరకు ఏపీవో ఆధ్వర్యంలో ఫీల్డు అసిస్టెంట్ అడకా లక్ష్మీనారాయణ ఉపాధి కూలీలతో చెరువు కట్ట పరిశుభ్రం చేయిస్తున్నారు.

మహావృక్షం మాయం!

- ఇష్టారాజ్యంగా ఆర్‌అండ్‌బీ చెట్ల నరికివేత
- 100 ఏళ్ల నాటి చింత బూడిద

ఇంకొల్లు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ మమల్ని అడిగేదెవరు... మా స్వప్రయోజనాలే ముఖ్యం.. మమ్మల్ని ఆపేదెవరు అన్నట్లు కొందరు వ్యవహరిస్తున్నారు. ఇంకొల్లు నుంచి గంగవరం వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారిలో రెండు గ్రామాల మధ్య 24 ఎకరాలలో బోడిశెట్టి కుంట ఉండేది. 1989లో ప్రభుత్వం బోడిశెట్టి కుంటను ఓ ప్రైవేటు విద్యా సంస్థలకు అప్పగించింది. ఈ కుంటకు తూర్పు వైపున ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన 100 ఏళ్ల చరిత్ర కలిగిన మహా వృక్షం ఉంది. వారం రోజుల కిందట ఈ చింత చెట్టును నరికివేశారు. ఈ విద్యా సంస్థలను నడుపుతున్న ఓ ప్రైవేటు యాజమాన్యం తమ స్వప్రయోజనాలకు వందేళ్ల చరిత్ర కలిగిన చింతచెట్టును నరికి నామరూపాలు లేకుండా మాయం చేసింది. ఇక్కడ చెట్టు ఉండాలనే ఆనవాళ్లు లేకుండా మొదులతో సహా కాల్చి బూడిద చేసారు. సమీపంలోని బస్సు షెల్టర్‌ను కూడా కాల్చారు. ఈ ఘటనపై సంబంధిత అధికారుల సైతం దోబూచులాడుతున్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ నళినిని వివరణ కోరగా.. చెట్టు తొలగించిన సంగతి మాకు తెలియదని, మేము వచ్చి పరిశీలిస్తామన్నారు. కానీ సోమవారం వచ్చి పరిశీలించిన సంబంధిత అధికారులు ఈ విద్యాసంస్థలు ఓ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించినవి కావడంతో గుట్టు చప్పుడు కాకుండా ఎటువంటి చర్యలు లేకుండా వెనుదిరిగి వెళ్లారు. వీరి ఆగడాలు ఆపేదెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చెట్టును నరుకుతున్న దృశ్యం



ఆనవాళ్లు లేకుండా బూడిదైన వృక్షం


మహా వృక్షం (ఫైల్)


మాస్కులను అందజేస్తున్న డాక్టర్ సౌమ్య, టీడీపీ నేతలు

వైరస్‌పై భయాందోళన వద్దు

- వ్యక్తిగత శుభ్రత, మాస్కులు తప్పనిసరి
- ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య

పర్చూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చైనాలో వ్యాప్తి చెందుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత పరిశుభ్రత, మాస్కులు ధరిస్తే దరిచేరదని డాక్టర్ జే సౌమ్య అన్నారు. హెచ్‌ఎంపీవీ వైరస్ దృష్ట్యా ముందస్తు చర్యలో భాగంగా మంగళవారం స్థానిక టీడీపీ నేతలు సారథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వైద్య సిబ్బందికి మాస్కులు శానిటైజర్లను పంపిణీ చేశారు. దీంతో పాటు పండ్లు కూడా రోగులకు అందజేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ తరుచూ జ్వరం వస్తుంటే అశ్రద్ధ చేయవద్దన్నారు. సొంత వైద్యానికి స్వస్తి చెప్పి వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వాణిజ్య విభాగంగా ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్, పరివర్తన భవనం అధ్యక్షుడు జూపూడి మార్కు, టీడీపీ సీనియర్ నేత కె.మార్కు, వడ్డెముక్కల అబ్రహం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండోరోజూ పింఛన్‌దారుల పరిశీలన


అద్దంకిలో మంచంపై ఉన్న పింఛన్‌దారును పరిశీలిస్తున్న వైద్యులు

అద్దంకిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం రెండవ రోజూ వైద్య బృందం పరిశీలించింది. ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ హరిబాబు, సాధారణ వైద్యులు డాక్టర్ విన్నీ దయానా, అద్దంకి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ అద్దంకి పట్టణంలోని పలువురిని పరిశీలించారు. దివ్యాంగుల పింఛన్ పొందుతూ మంచంలోనే ఉండే వారు, డయాలసీస్, ఇతర అనారోగ్య సమస్యలతో పింఛన్ పొందుతున్న వారి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. వివరానలు నమోదు చేసుకున్నారు. మండలంలోని మైలవరం, కొత్త రెడ్డిపాలెంలలో వైద్యుల బృందంతో పాటు మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష లబ్ధిదారులను పరిశీలించారు. వారి వెంట ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, ఆరోగ్యకార్యకర్తలు ఉన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ


దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మానవసేవే - మాధవసేవని.. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం ఆనందదాయకమని ఎన్‌ఆర్‌ఐ దంపతులు రామిశెట్టి దిలీప్ కుమార్, అనూష అన్నారు. వైకుంఠపురానికి చెందిన ధనలక్ష్మి, తోటవారిపాలెంకు చెందిన సాయి ఇద్దరు దివ్యాంగులు కావడంతో వారికి లెట్స్ హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ దంపతుల ఆర్థిక సహకారంతో ట్రై సైకిల్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు కిరణ్ మాట్లాడుతూ దాతల సాయంతో ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దయాకర్, డేవిడ్, రాజేష్, సాంబయ్య, ప్రకాష్, సుభాని, మధు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మి నవరాత్రి ఉత్సవాలు

- చందలూరులో కొలువైన అమ్మవారు
- ఏర్పాట్లు చేస్తున్న వంశస్థులు

పంగులూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మి అమ్మవారి నవరాత్రి కొలుపు మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదున్నర శతాబ్దాల నాడు కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారిని తమ ఇంటి ఇలవేల్పుగా, ఇష్ట దైవంగా కొలిచే గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ మహోత్సవంలో పాల్గొంటారు. మూడేళ్లకోసారి జరిగే మహాలక్ష్మి అమ్మవారి కొలుపు ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థుల సహకారంతో ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. 8, 9 తేదీలలో మానుపూజ నిర్వహించి త్రిశక్తి స్వరూపిణిగా అమ్మవారి ఆహ్వాన సంకల్పం తీసుకోవడం, ముత్తయిదువులకు పంచ మాంగళ్యాల పంపిణీ అనంతరం 10వ తేదీ అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం ప్రారంభమవుతుందని గణాచారి బ్రహ్మశ్రీ వేదమూర్తివర్యులు చల్లా సత్యనారాయణ శాస్రి తెలిపారు. గ్రామస్థులు, భక్తుల సిద్యానుసారం మూడేళ్లకోసారి జరిగే ఈ కొలుపు మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొంటారు.


ప్రత్యేక అలంకరణలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారు

10 అర్ధరాత్రి నుంచి 17వ తేదీ వరకు గ్రామోత్సవం

మానుపూజతో ప్రారంభమయ్యే మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవంలో 10 అర్ధరాత్రి నుంచి జరిగే అమ్మవారి ఊరేగింపు మహోత్సవంలో నిత్యం వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్దేశిత పుర వీధులలో ఈ ఉత్సవం కొనసాగుతుంది. తమ కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా భావించే భక్తులు అమ్మవారి విగ్రహంతో బయలుదేరిన గణాచారికి అభిముఖంగా వేలాది మంది అమ్మవారికి పూలు, తమలపాకులు సమర్పిస్తూ వెనుకు నడుస్తూ సాగే వేడుకతో నిత్యం గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది. ఈ ఉత్సవంలో రోజకు ఒకరు వంతున (చిట్టాబత్తిన, మురకొండ, పాలేరు, కళావంతులు, గొట్టిపాటి, పుల్లెల) వంశస్తులు నిర్వహించే ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాలలో వేరు వేరు ప్రాంతాలు, పట్టణాలలో స్థిరపడిన వారితో పాటు పలు రాష్ట్రాల ప్రజలు తమ మొక్కులు తీర్చుకునేందుకు చందలూరు చేరుకోవడంతో వారం రోజులుల పాటు గ్రామం జన సందోహంతో తిరుణాళ్లను తలపిస్తుంది. 18వ తేదీన మహాలక్ష్మి అమ్మవారికి పొంగళ్ల సమర్పణతో ఈ ఉత్సవం ముగుస్తుంది.

మణికేశ్వరం అభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థపతి పరమేశ్వరప్ప, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెళ్లూరు జిల్లాల డీఈ శ్రీనివాసరావు ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పరమేశ్వరప్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, అశోక్, అంజయ్య, బడావలి, మీరావలి తదితరులు పాల్గొన్నారు.


మణికేశ్వరం దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, ఇంజనీరింగ్ అధికారులు

శింగరకొండలో నిర్మాణ పనులు పరిశీలించిన స్థపతి

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణ పనులను స్థపతి పరమేశ్వరప్ప మంగళవారం పరిశీలించారు. దేవాలయంలో పరమేశ్వరప్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఈ శ్రీనివాసరావు, ఈవో తిమ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

చినగంజాం, జనవరి (ఆంధ్రజ్యోతి) : పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు సూచించారు. మండలంలోని గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో రైతులు వేసిన పొగాకు, మిరుప, జొన్న, వరి పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పీఎం కిసాన్ సంబంధించి రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోని వారు చేయించుకోవాలని ఏవో తెలిపారు. పీఎం కిసాన్ డబ్బులు జమకాని రైతులు మా దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం రైతులు వేసిన పంట వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సంధ్య, నీలిమ, గొనసపూడి, సంతరావూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఎస్‌ఎల్ గుడిపాడులో వరి పంటను పరిశీలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

కత్తెర పురుగుపై అప్రమత్తం

అద్దంకిటౌన్ : మొక్కజొన్నలో కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం అద్దంకి గోవాడ, చిన్న కొత్తపల్లి గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎమమెక్టిన్ బెంజోయేట్ లీటర్ నీటికి గ్రాము కలిపి మొవ్వులో పిచికారీ చేయాలన్నారు. మిరపలో రసం పీల్చు పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో కోటేశ్వరరావు, సాయిబాబు, రైతులు మానం మురళీమోహన్‌దాసు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బల్లికురవ : రైతులంతా పంటలు సాగు చేసే ముందు భూములకు భూసార పరీక్షలను చేయించుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్ డివిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎస్‌ఎల్ గుడిపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం వలన పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో కుమారి, వీఏఏ పవన్‌సాయి, రమణయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు : శనగ పంటలో పచ్చ పురుగును నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనగ పంటలను ఆయన పరిశీలించారు. పచ్చ పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 40మిలీ లేదా ఇండాక్సికార్బ్ 200మిలీ లేదా రైనాక్సిపైడ్ 60మిలీ ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాలలో వ్యవసాయ అధికారి మేరమ్మ శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. శనగ పైరులో లద్దెపురుగు నివారణకు రైతులకు పలు సూచనలుచేశారు.


సిబ్బందికి నగదు అవార్డును అందజేసి అభినందిస్తున్న ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలి

- డీఎం రామ్మోహనరావు
- కండక్టర్‌లు, డ్రైవర్‌లకు నగదు అవార్డులు అందజేత

అద్దంకి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు సిబ్బంది మరింత కృషి చేయాలని డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. డిసెంబర్‌లో ఎక్కువ ఈపీకే తీసుకు వచ్చిన కండక్టర్‌లు ఎం.ఏశేషయ్య, యూఎస్ రావు, మహేశ్వరి, ఎక్కువ కేఎంపీ తీసుకువచ్చిన డ్రైవర్‌లు బి.శ్రీరాములు, ఎంఎస్ మణ్యంకు మంగళవారం గ్యారెజ్‌లో జరిగిన కార్యక్రమంలో క్యాష్ అవార్డులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మహబూబి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బీసీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

అద్దంకిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలంలోని సబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరకాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో బీ సింగయ్య మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ వెబ్ సూట్ ద్వారా దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో బ్యాంక్ లిక్ యూనిట్లు బీసీలకు 17 యూనిట్లు మంజూరయ్యాయని, ఇందులో బీసీఏలకు 6 యూనిట్లు, బీసీబీలకు 2 యూనిట్‌లు, బీసీడీలకు 6, బీసీఈలకు 3 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. బీసీలకు, ఈబీసీలకు యూనిట్ విలువలో 40 నుంచి 50 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యూకేషన్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని ఎంపీడీవో తెలిపారు.

బల్లికురవ : అగ్రవర్ణాల్లోని నిరుపేదలకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తుందని, అర్హత ఉన్న వారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని ఎంపీడీవో కే కుసుమకుమారి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను బీసీ కార్పొరేషన్‌కు అందజేయాలని ఆమె కోరారు.

పంగులూరు : మండలంలో అర్హులైన బీసీ వర్గాలకు రుణాల మంజూరు కోసం ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి కోరారు. మండలానికి క్యాటగిరీలవారీగా బీసీ-ఏ 6, బీసీబీ 4, బీసీడీ 5, బీసీఈ 8 యూనిట్లు మంజూరయ్యాయని, ఆయా గ్రామాలకు కేటాయించిన క్యాటగిరీల వారీగా అర్హులైన వారు ఈ నెల 16వ తేదీలోగా తమ దరఖాస్తులు అందచేయాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్స్‌కు సంబంధించి క్యాటగిరీవారీగా ఈబీసీ 1, రెడ్డి - 4, కమ్మ-7, ఆర్యవైశ్యులకు ఒకటి యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులైనవారు 16లోగా దరఖాస్తులు అందచేయాలని ఎంపీడీవో కోరారు.

చినగంజాం : మండల పరిధిలోని బీసీ, ఈబీసీ సామాజిక వర్గాల వారు రాయితీ రుణాలు కొరకు బుధవారం నుండి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈడబ్ల్యుఎస్ యాక్షన్ ప్లాన్ ద్వారా అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. బీసీలు, ఈబీసీ(రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) సామాజిక వర్గాల వారికి సంబంధిత బ్యాంకుల ద్వారా రాయితీ రుణాల కొరకు ఈ నెల 8వ తేది నుండి 16వ తేది వరకు గ్రామ సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తదనంతరం లబ్దిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాయితీ రుణాలపై ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో టాం టాం, ఇతర ప్రసార సాధనల ద్వారా ప్రచారం చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.

అన్యాక్రాంతమైన భూములపై వినతి

బల్లికురవ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల నుంచి అన్యాక్రాంతంలో ఉన్న అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని కూకట్ల పల్లి గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వారు తహసీల్దార్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా గ్రామానికి చెందిన నిరుపేద దళితులు తమకు ప్రభుత్వం అందజేసిన అసైన్డ్ భూములను కొందరు అక్రమించి సాగు చేస్తున్నారని ఈ విషయాన్ని గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వారు తహసీల్దార్‌కు చెప్పారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నిరుపేదల తరపున సీపీఐ నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, పావులూరి రమణయ్య, గొల్లపూడి అంజయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

అద్దంకి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : లారీ పైనుంచి పడి గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మహమ్మద్ అబ్బాస్(52) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీస్‌ల కథనం మేరకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన మహమ్మద్ ఈ నెల 3వ తేదీన విజయవాడ నుంచి గుంటూరు నుంచి కాటన్‌సీడ్స్ లోడ్‌తో అద్దంకి మండలం చినకొత్తపల్లి వద్ద ఉన్న శ్రీ వత్సవ బయోటెక్ లిమిటెడ్ కంపెనీకి వచ్చారు. అన్‌లోడ్ అయిన తరువాత 4వ తేదీ సాయంత్రం లారీ పైన ఉన్న పట్టను మడత పెడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అబ్బాస్ కుమారుడు మగబుల్ ఫిర్యాదు మేరకు మంగళవారం ఏఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

బొడ్డువానిపాలెంలో బ్యారన్ దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

మేదరమెట్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువానిపాలెంలో పొగాకుతో ఉండి క్యూరింగ్ జరుగుతున్న బ్యారన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. మంగళవారం బొడ్డువానిపాలెంలకు చెందిన దేవరపల్లి అశోక్‌రెడ్డికి చెందిన బ్యారన్ పొగాకు కాలుస్తూ ఉండగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బ్యారన్‌లో ఉన్న పొగాకుతో పాటు బ్యారన్‌లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. సుమారు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు అశోక్‌రెడ్డి తెలిపాడు. అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వ్యక్తిపై కేసు నమోదు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇంట్లోకి చొరబడేందుకు యత్నించిన వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన నక్కల పోతురాజు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన గడ్డం ఏసు అర్ధరాత్రి ఇంటి వద్దకు వచ్చి అక్రమంగా ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేశాడు. దీంతో పోతురాజు ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏసుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో పడకలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డి, ఇతర అధికారులు

హెచ్‌ఎంపీవీ.. ఏం చేస్తుందో!?



- జిల్లావాసుల్లో మొదలైన వైరస్ కలవరం
- ప్రభుత్వ ఆదేశాలతో జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు
- ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లు వినియోగంలోకి తెచ్చేందుకు కసరత్తు

చైనాను కలవరపెడుతున్న 'హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)' దేశంలోకీ ప్రవేశించి, ఐదు కేసులు నమోదయ్యా యన్న వార్తలతో జిల్లావాసుల్లోనూ గుబులు మొదలైంది. కర్ణాటక, గుజరాత్, తమిళ నాడులలో పాజిటివ్ కేసులు బయ టపడటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నగరంలోని జీజీహెచ్‌లో ఇరవై పడకలతో కూడిన ప్రత్యేక వార్డును ఏర్పా టు చేశారు. ఇందులో ప్రత్యేక వైద్య బృందంతో పాటు అన్ని రకాల మందులను సమకూర్చారు. ఇక ఆక్సిజన్ ప్లాంట్లను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టా రు. కాగా, ఎక్కడా మరణాలు నమోదు కాకపోవటంతో ఎలాంటి ఆందోళన వద్దని వైద్య నిపుణులు భరోసా ఇస్తున్నారు.

కోడిపందేలు జరగనీయొద్దు

- ప్రత్యేక కమిటీలతో గ్రామాల్లో నిఘా
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జంతు హింస నివారణ చట్టం అమలుపై కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కోడిపందేలు నేరమనే విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు సభ్యులుగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి కోడి పందేలు జరగకుండా చూడాలని సూచించారు. నిబంధనలు అతి క్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డీఎఫ్‌వో మహబూబ్ బాషా, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి అరుదైన అవకాశం



జయమ్మకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిషనర్ సూర్యతేజ

- గణతంత్ర దినోత్సవంలో పాల్గొనాలని రాష్ట్రపతి భవనం ఆహ్వానం

నెల్లూరు (సిటీ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య (డ్రైనేజీ) కార్మికురాలు వనపర్తి జయమ్మకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 26వ తేదీన డిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ ఆమెకు ఆహ్వాన పత్రిక వచ్చింది. ఈ మేరకు ఆ పత్రికను కమిషనర్ సూర్యతేజ మంగళవారం తన కార్యాలయంలో జయమ్మకు అందచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంలో జయమ్మ లబ్ధిదారుగా సెప్టెక్ ట్యాంకు వాహనానికి యజమానిగా కొనసాగుతూ స్వయంకృషితో జీవిస్తూ ఆదర్శంగా ఉన్నారని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్రం గుర్తించిందని చెప్పారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనడంతోపాటు అక్కడ ఏర్పాటు చేసిన విందులో జయమ్మ పాల్గొంటుందని పేర్కొన్నారు.

వరిపైరుకు బీమా నమోదు గడువు 15 వరకు పెంపు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా వరి పంటకు బీమా ప్రీమియం నమోదు గడువును ఈ నెల 15వతేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గడువు డిసెంబరు 31వతేదీతో ముగి సినప్పటికీ ప్రభుత్వం పక్షం రోజులు పొడిగించిందని తెలిపారు. హెక్టారుకు రూ.450 చొప్పున ప్రీమియం చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని, పంట దిగుబడి తగ్గినప్పుడు బీమా ప్రయోజనం లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరాభవం నుంచి.. పైకి లేచేదెలా!?

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవం తరువాత ఫలితాలపై విశ్లేషణకు, భవిష్యత్ కార్యాచరణ పట్ల క్యాడర్‌ను దిశానిర్దేశం చేయడానికి వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం సమావేశం కానున్నారు. తాడేపల్లిలో ఉదయం జరగనున్న ఈ సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొననున్నారు. అయితే ఇప్పటికే చాలా మంది వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న నేపథ్యంలో ఎంత మంది ఈ సమావేశానికి హాజరవుతారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

- నేడు వైసీపీ నేతలతో జగన్మోహన్‌రెడ్డి భేటీ
- ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ
- తాడేపల్లికి తరలిన స్థానిక సంస్థల ప్రతినిధులు





నెల్లూరు (ఆంధ్రజ్యోతి), జనవరి 7 : 'ఒక్క చాన్స్' నినాదంతో జనంలోకి వచ్చిన జగన్‌కు జిల్లా ప్రజలు 2019 ఎన్నికల్లో బ్రహ్మ రథం పట్టారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని పదికి పది అసెంబ్లీ స్థానాలను కట్టబెట్టారు. ఆ తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అధికార పార్టీ నాయకులు ప్రజల ప్రమేయం లేకుండా ఫలితాలను ఏకపక్షం చేసుకున్నారు. ఆ క్రమంలో జిల్లాలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీపీ, 99 శాతానికిపైగా ఎంపీటీసీ స్థానాలు, మున్సిపాలిటీల్లోని కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాలు వైసీపీపరం అయ్యాయి. ఒకవిధంగా చెప్పాలంటే ఈ ఎన్నికలు జరిగిన తీరే ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేక భావనకు తొలి బీజం పడిందని రాజకీయ పరిశీలకుల వాదన. ఇలా రెండున్నరేళ్ల క్రితం ప్రజల్లో మొదలైన వైసీపీ వ్యతిరేకభావం ఆ తరువాతి కాలంలో విపరీతంగా బలపడింది. వైసీపీ ఎమ్మెల్యేల బహిరంగ అవినీతి, దౌర్జన్యాలు, రాజకీయ కక్ష సాధింపులు, వేధింపులు, ప్రతిపక్షాల సానుభూతిపరులపై నమోదు చేయించిన తప్పుడు కేసులు.. ఇవన్నీ జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాన్ని మింగేశాయి. ఒక వైపు నామమాత్రంగా కూడా జరగని అభివృద్ధి, మరోవైపు ఐదేళ్ల కాలంలో కొండలా పెరిగిన వైసీపీ నాయకుల ఆర్థిక స్థితి.. మరో వైపు ప్రతి ఒక్కరిలో అభద్రతా భావన, నోరుమెదపలేని నిరంకుశ పరిస్థితులు ఓటింగ్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

● నాయకుల్లో నిరాశ

ప్రజల పరిస్థితి ఇలా ఉంటే వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకుల పరిస్థితి మరీ దయనీయం. ఐదేళ్ల కాలంలో ఏనాడు వీరికి జగన్ దర్శనం లభించలేదు. అడపదడపా సభలు, సమావేశాలకు జిల్లాకు వచ్చినా పరదాల మాటున చేతులూపి వెళ్లారే కానీ ఏ నాయకుడినీ దగ్గర తీసుకొని మాట్లాడిన సందర్భం లేదు. వైసీపీ కోసం ఎంత చేసినా అగ్రనేత దృష్టిలో పడలేమనే నిర్ణయానికి వచ్చిన పలువురు నాయకులు ఎన్నికలకు ముందే పోలోమని తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. మిగిలిన వారిలో చాలా మంది ఎన్నికల తరువాత టీడీపీలో చేరిపోయారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల్లో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. పార్టీ క్యాడర్ ఇంతగా బలహీనపడిన తరువాత ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి మేలుకున్నారు. జిల్లాలో ఆ పార్టీకి తిరిగి పూర్వవైభవం తేవాలనే ఆత్రుతతో బుధవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలతో తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమావేశం అవుతున్నారు. ఇది ఎంత వరకు ఫలప్రదం అవుతుందో వేచి చూడాల్సిందే.

'రెడ్‌క్రాస్' కమిటీ
చైర్మన్ పదవికి రాజీనామా!

- సభ్యుడిగానే కొనసాగుతా
- నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కుట్ర
- ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి సంచలన ప్రకటన

- వివరాలు 6లో..



కావలి-తుమ్మలపెంట రోడ్డు ఇది. ఒకప్పుడు ఈ రోడ్డుపై ప్రయాణమంటే నరకమే. ఎందరో వాహనదారులు రోడ్డు మీదున్న గుంతల్లో పడి ఒళ్లు హూనం చేసుకున్నారు. 2020లో ఈ రోడ్డును ఎన్డీబీ ప్రాజెక్టు కింద బాగు చేయాలని టెండర్లు పిలిచారు. కానీ నాడు కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోతుండటం, ఇదే కాంట్రాక్టర్‌కు వేరే వర్కులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో పనులు జరగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లులు ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో కాంట్రాక్టర్ కూడా తుమ్మలపెంట రోడ్డు పనులు ప్రారంభించారు. 9 కి.మీ పొడవున రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తున్నారు. రూ.14 కోట్లతో మొదలైన ఈ పనులు నాలుగు నెలల నుంచి వేగంగా జరుగుతున్నాయి.



మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనంలో జరుగుతున్న పనులివి. 2020, నవంబరులో నాడు-నేడు పథకం కింద రూ.1.7 కోట్లతో శిలాఫలకం ఆవిష్కరించి, పనులు ప్రారంభించారు. అయితే, బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పీహెచ్‌సీ పనులు మొదలయ్యాయి. పెండింగ్ బిల్లులు చెల్లిస్తుండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ధైర్యంగా ముందుకొచ్చారు. ప్లాస్టింగ్, ఎలక్ట్రికల్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. మార్చిలోపు పీహెచ్‌సీని పూర్తి చేసే విధంగా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు.

బిల్లులకు మోక్షం.. ప్రగతికి బాట!

- అభివృద్ధి పనులకు వీడిన గ్రహణం
- బకాయిలు చెల్లిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఊపిరి పీల్చుకుంటున్న కాంట్రాక్టర్లు
- పనులు చేసేందుకు ఆసక్తి

సరిగ్గా 7 నెలల క్రితం వరకూ ప్రభుత్వ పనులంటే కాంట్రాక్టర్లు ఆమడ దూరం పారిపోయేవారు. ఏదైనా వర్కుకు టెండర్లు పిలిచారంటే ఒక్కరంటే ఒక్కరు కూడా బిడ్ వేసేవారు కాదు. ఒకరిద్దరు అప్పటికే పనులు దక్కించుకొని ఉన్నా వాటిని మొదలుపెట్టేందుకు సాహసించేవారు కాదు. కొందరు కాంట్రాక్టర్లయితే కొద్దిగా పనులు చేశాక ఆపేశారు. వీటిని పూర్తి చేయమని ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా ససేమిరా అన్న సంఘటనలు నాడు కనిపించేవి. అధికారులు కూడా గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. ఆఖరుకు రోడ్లపై భారీ గుంతలు ఏర్పడినా.. వాటిని అత్యవసరంగా పూడ్చేందుకు కూడా కాంట్రాక్టర్ దొరికేవారు కాదు. దీనంతటికీ ఒక్కటే కారణం.. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడమే. వైసీపీ ప్రభుత్వం అవలంబించిన తీరు నాడు కాంట్రాక్టర్లనే కాకుండా ప్రజలను కూడా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. రోజుల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అన్ని శాఖల్లోనూ పనులు చేసే వారు కరువయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు క్రమేణా మారిపోతున్నాయి. అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం, ఆ క్రమంలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తుండడంతో కాంట్రాక్టర్లలో మళ్లీ ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోంది. ఇప్పుడిప్పుడే పనులు చేసేందుకు ముందుకొస్తున్నారు.

● జోరందుకున్న పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులపై దృష్టి సారించడంతో కాంట్రాక్టర్లకు మంచి రోజులొచ్చాయి. ఇకపై పనులు జరగాలంటే పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందేనని నిర్ణయించుకున్న ప్రభుత్వం.. ఇటీవల పెండింగ్ బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తూ వస్తోంది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల్లో కాంట్రాకర్లలో ఒక్కొక్కరికి కొద్ది కొద్దిగా పేమెంట్లు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ పనులు చేసేందుకు మళ్లీ కాంట్రాక్టర్లు ఆసక్తి చూపుతున్నారు. టెండర్లు వేసేందుకు కూడా పోటీ పడుతున్నారు. ఇటీవల ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల్లో పిలిచిన టెండర్లే ఇందుకు నిదర్శనం. ఒక్కో వర్కుకు నలుగురు, ఐదుగురు వరకూ బిడ్లు దాఖలు చేయడంతో అధికార వర్గాలు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. టెండర్లు వేయడమే గాక వెంటనే పనులు కూడా చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో గుంతలు పూడ్చడం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సిమెంటు రోడ్లు వేయడమే ఇందుకు ఉదాహరణ. కాగా కొత్త పనులేగాక గతంలో పెండింగ్‌లో ఉన్న పనులకు కూడా మోక్షం లభిస్తోంది. నాడు బిల్లులు రాక అర్ధంతరంగా ఆపేసిన పనులను తిరిగి ప్రారంభిస్తున్నారు. న్యూడెవప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) ప్రాజెక్టు కింద చేపట్టిన పనులు, సీఆర్ఐఎఫ్ కింద టెండర్లు పిలిచి ఉన్న పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ పరిధిలో కూడా జైకా వర్కులు మొదలయ్యాయి. ఇదే మాదిరిగా అన్ని శాఖల్లోనూ అభివృద్ధి పనులు జోరందుకుంటున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

హోరా హోరీగా క్యారమ్స్ పోటీలు



ఉత్కంఠగా జరుగుతున్న క్యారమ్స్ పోటీలు

నెల్లూరు(విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు క్లబ్‌లో అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్స్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మూడో రోజు మంగళవారం విరామం సమయానికి పురుషులు, మహిళల డబుల్స్ మ్యాచ్‌లు సెమీఫైనల్స్ ముగించుకుని ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. సింగిల్స్ మ్యాచ్‌లు మూడో రౌండ్ జరుగుతున్నాయి.

నేడు ఫైనల్స్

సెమీ ఫైనల్స్ విజేతలు

పురుషుల డబుల్స్ విభాగంలో ఆర్‌బీఐకు చెందిన జహీర్ పాషా-ప్రశాంత్ మోర్‌లు జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీమ్ కరీంఖాన్-అభిజి త్ త్రిపాంకర్‌పై, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్ ధరియా-పంకజ్ అశోక్ పవార్‌లు జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్‌డైవ్-జైద్ అహ్మద్ ఫరూకీలపై విజయం సాధించారు. మహిళల డబుల్స్ విభాగంలో తమిళ నాడుకు చెందిన శోభిక-ప్రీతి ప్రిన్సెస్‌లు పీఎస్‌పీబీకు చెందిన రష్మీ కుమారి-ఇల వాం జిలపై, పీఎస్‌పీబీకి చెందిన ఎం.ఖాజి మా-మిత్ర లు సీసీసీ ఎస్‌బీకి చెందిన నాగజ్యోతి-నీలం ఘోడ్కేలపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు.

సింగిల్స్ విభాగంలో..

సింగిల్స్ పురుషుల విభాగంలో ఎల్ఐసీకి చెందిన డిల్లీబాబు పీఎస్‌పీబీకి చెందిన టాప్ సీడెడ్ ఎండి. ముఫ్రాన్‌పై, పీఎస్‌పీబీకి చెందిన పి.శ్రీనివాస్ బీఏఎస్ సీటీకి చెందిన ధర్మేంద్రకుమార్‌పై, విదర్భకు చెందిన ఇర్షాద్ అహ్మద్ యూపీకి చెందిన అలీఅబ్బాస్‌పై, ఢిల్లీకి చెందిన ఎండి.షాదాద్ ఏపీకి చెందిన ఉమామహేశ్వర రావుపై, సీఏజీకి చెందిన వి.అనిల్‌కుమార్ ఏఏఐకు చెందిన ముషారఫ్‌పై, ఆర్‌బీఐకు చెందిన ప్రశాంత్‌మోర్ డీఏఎస్‌సీసీఎస్‌బీకి చెందిన ఆర్.ప్రజో య్‌పై విజయం సాధించారు. మహిళల సింగిల్స్ విభాగంలో పీఎస్‌పీ బీకి చెందిన రష్మీకుమారి రాజస్థాన్‌కు చెందిన సీమా చౌహాన్‌పై, గుజ రాత్‌కు చెందిన వానిశ్రుతి ఏపీకి చెందిన సీహెచ్.సుధపై, ఏఏఐకు చెందిన నిధిగుప్తా తెలంగాణకు చెందిన నాగజ్యోతిపై, తమిళ నాడుకు చెందిన ఎల్.కీర్తన డీఏఎస్‌సీబీకి చెందిన అంజలి ప్రజాపతిపై, తమిళ నాడుకు చెందిన బి.శోభిత ఆర్‌బీఐకు చెందిన కవిత సోమంచిపై గెలుపొందారు.

10న జిల్లా హాకీ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్ర జ్యోతి) : జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 10వతేదీన సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల హాకీ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పీ జగన్‌మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంబంధిత తేదీలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

శ్రమశక్తి సంఘాలకు పునరుజ్జీవం

- ఉపాధి పనుల బాధ్యత వారికే...
- ఎంపికకు అధికారుల కసరత్తు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో వచ్చేనెల ఒకటి తేదీ నుంచి శ్రమశక్తి సంఘాలు కీలకం కానున్నాయి. పనికి దరఖాస్తు చేసుకోవడం, పనుల కేటాయింపులు, మస్టర్ల డౌన్‌లోడ్, పూర్తి చేసిన పనులకు కొలతలు వంటివి ఇకపై పక్కాగా అమలు కానున్నాయి. బాధ్యులుగా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో ఈనెలాఖరులోపు మండలాల్లో శ్రమశక్తి సంఘాలు, మేట్ల ఎంపిక పూర్తి చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆయా కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి 50 జాబ్‌కార్డులకు ఒక సంఘంగా ఏర్పాటు చేయడంతోపాటు మేటీని ఎంపిక చేయాల్సి ఉంది. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంఘాలు ఉండగా వైసీపీ వాటిని నిర్వీర్యం చేయడంతో మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారు.

● 50 జాబ్‌కార్డులకు ఒక సంఘం

జిల్లాలోని 721 పంచాయతీల్లో 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.38 లక్షల మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు లక్ష మంది కూలీలు పని చేస్తున్నారు. ప్రతి 50 జాబ్‌కార్డులకు ఒక సంఘం ఏర్పాటు చేయడంతో పాటు కమిటీని ఎంపిక చేయాల్సి ఉంది. గత టీడీపీ హయాం లో ఉన్న శ్రమశక్తి సంఘాలను పునరు ద్ధరించ నున్నారు. సంఘాలు ఏర్పాటైతే ఏడాదిపాటు ఏలాంటి మార్పు ఉండదు. సభ్యులు కమిటీని ఎంపిక చేసుకుని సమా చారాన్ని క్షేత్రసహాయకులకు అందించాల్సి ఉంటుంది. మేట్లు కచ్చితంగా 2023-24 సంవత్సరంలో వంద రోజుల పనిని విధిగా 25 రోజులు చేసి ఉండాలి. సంఘ సభ్యుడిగా ఉండడంతోపాటు 50 ఏళ్లలోపు ఉండాలి. చదవడం, రాయడం తెలియడంతో పాటు సొంత సెల్‌ఫోన్ కలిగి ఉండాలి.

త్వరగా పూర్తి చేస్తాం

శ్రమశక్తి సంఘాల ఎంపిక త్వరిగా పూర్తి చేస్తాం. సంఘాల ఎంపిక పూర్తి చేయాలని ఇప్పటికే అందరికీ సూచించాం. అందరి ఆమోదంతో మేట్లను ఎంపిక చేస్తాం.

- గాయత్రీదేవి, ఏపీడీ, ఉదయగిరి

ఆ ఊళ్లో ప్రతి ఇంటా ఉద్యోగే!

వ్యవసాయం తప్ప మరో ప్రపంచం తెలియని ఓ కుగ్రామం అది. ఇంకా చెప్పాలంటే సేద్యానికి కూడా సమృద్ధిగా భూమిలేని నిరుపేద గ్రామం. ఒకనాడు పుట్టిన నాటినుంచి చనిపోయేవరకు ఊరుదాటి వెళ్లని వారు ఈ గ్రామంలో ఎంతోమంది ఉండేవారు. అతి కొద్దిమంది మాత్రమే నెలకో, రెండు నెలలకో తమ అవసరాల కోసం సమీపంలోని కందుకూరుకు వెళ్లి వచ్చేవారు. ఊరే ప్రపంచంగా బతికిన ఆ గ్రామస్థులు నేడు దేశ, విదేశాలలో స్థిరపడ్డారు. అంతేకాదండోయ్! మనదేశంలో ఏ నగరానికి వెళ్లినా ఒక్కరైనా ఆ ఊరివాళ్లు ఉంటారు. ఆ గ్రామమే కందుకూరుకు 7 కి.మీ దూరంలో ఉన్న వలేటివారిపాలెం మండలం అత్తంటివారిపాలెం.


అత్తింటివారి గ్రామం ఏరియల్ వ్యూ

కందుకూరు, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ రికార్డులలో ఈ గ్రామం పేరు నేకునాంపురం అయినా అత్తంటివారిపాలెం అంటేనే అందరికీ తెలుస్తుంది. 200 వ్యవసాయ కుటుంబాలు, మరో 200 వ్యవసాయ కూలీ కుటుంబాలు నివసించే ఈ గ్రామంలో అంతా సన్న, చిన్నకారు రైతులే. వ్యవసాయ కుటుంబాలలో 90 శాతం కుటుంబాలకు ఎకరం, రెండు ఎకరాల భూమే జీవనాధారం. మిగిలిన పదిశాతంలో ఐదుశాతం మందికి ఐదారు ఎకరాలు, మరో ఐదు శాతం మందికి పది, పదిహేను ఎకరాల భూమి ఉంది. ఆ కొద్దిపాటి భూమితోనే వ్యవసాయం చేసుకుం టూ తాము జీవించ డమే గాక తమపై ఆధారపడి ఉన్న వ్యవ సాయ కూలీ కుటుంబాలకు కూడా ఉపాధి కల్పిస్తున్నారు. ఉన్నది కొద్ది భూమే అయినా విభిన్నమైన పంటలు పండించడం, ఏడాది పొడవునా శ్రమిస్తూ ఒకటికి రెండు పంటలు పండించటం ద్వారా అత్తంటి వారిపాలెం గ్రామస్థులు చుట్టుపక్కల గ్రామాల వారికి ఆదర్శంగా నిలిచే వారు. అలాంటి గ్రామంలో నేడు ప్రతి ఇంట్లో కనీసం ఒక ఉద్యోగి ఉండగా ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు ఉన్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి.

అనేక రంగాల్లో స్థిరపడి..

ఒక్క మాటలో చెప్పాలంటే గత మూడు దశాబ్దాల తర్వాత జన్మిం చిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉద్యోగంలో చేరి నగరాలలో స్థిరపడటం విశేషం. కేవలం ఉద్యోగులుగానే కాక విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లోనూ ఉన్నత స్థితిలో ఉన్నారు. కందుకూరులో ప్రఖ్యాతి గాంచిన ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించిన కంచర్ల రామయ్యది ఈ గ్రామమే. కందుకూరులో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన కొల్లూరు కొండయ్య ఈ గ్రామవాసే. తూర్పు రాయలయసీమ ఎమ్మెల్సీగా, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి, ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కంచర్ల శ్రీకాంత్ ఈ గ్రామవాసే. 60 సంవ త్సరాల క్రితం 1965లో సీఏ పూర్తి చేసిన ఉన్నం గోపాల్ ఈ గ్రామం నుంచి బయటకి వెళ్లిన తొలి ఉద్యోగిగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించిన రెండో వ్యక్తిగా కంచర్ల వెంకటేశ్వర్లు పేరు గడించారు. అనంతరం ఈ గ్రామవాసి కంచర్ల సుబ్బారావు లెక్చరర్‌గా, పోకూరి మాలకొండయ్య ఉపాధ్యాయుడిగా, కంచర్ల సుధాకర్ ఇంజనీర్‌గా ఉద్యోగాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. వారిని ఆదర్శంగా తీసుకొని విద్య ఒక్కటే తమ జీవితాన్ని మార్చుతుందని గుర్తించిన ఆ గ్రామ యువత కష్టపడి చదువుకోగా తల్లిదండ్రులు కూడా రెక్కల కష్టంతో చదివించి వారి ఉన్నతికి తోడ్పాటు అందించారు.


గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం

విదేశాల్లోనూ కొలువులు

1998లో కంచర్ల కృష్ణారావు అనే యువకుడు అమెరికా వెళ్లగా ప్రస్తుతం 8 మంది అమెరికాలోనూ, ముగ్గురు లండన్‌లో, ఇద్దరు ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే దేశంలో ప్రఖ్యాత నగరాలన్నింటిలో ఈ గ్రామస్థులు ఒకరిద్దరైనా ఉండగా బెంగళూరు, హైదరాబాదు, చెన్నైలో అనేక మంది ఉద్యోగాలు చేస్తుండటమే కాగా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉన్నత స్థానాలలో ఉంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే తమ తల్లిదండ్రులు పడ్డ కష్టం ప్రత్యక్షంగా చూడటం, చిన్నప్పుడు మాకూ పెద్దవాళ్లతో కలిసి పనిచేయక తప్పని పరిస్థితులే మమ్మల్ని పట్టుదలగా చదువుకునేలా ప్రోత్సహించాయని ఆ కష్టాలే తమను ఉన్నతంగా స్థిరపడేలా చేశాయని ఆ గ్రామ యువకులు చెబుతుంటారు.

గ్రామ అభివృద్ధికీ పాకులాట

ఎక్కడ ఉన్నా సొంతూరి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. గ్రామంలోని ఉద్యోగులంతా తమ శక్తిమేరకు చందాలు వేసుకుని ఇటీవల రమారమి రూ.2 కోట్లతో గ్రామంలో రామాలయం నిర్మించారు. అలాగే గ్రామదేవత పోలేరమ్మ ఆలయ నిర్మాణానికీ తమవంతు తోడ్పాటు అందించారు. గ్రామంలో స్మశానవాటిక అభివృద్ధికి పూనుకుని కృషి చేస్తున్నారు. గ్రామాభివృద్ధితోపాటు గ్రామస్థులకూ వ్యక్తిగతంగా తోడ్పాటు అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఏటా సంక్రాంతికి గ్రామానికి చేరుకొని అందరితో కలిసిమెలిసి సందడి చేస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

విజన్2020 ఫలితమే



మా గ్రామంలో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు ఉద్యోగులు ఉన్నారంటే అది విజన్ 2020 ఫలితమేనని నా అభిప్రాయం. ఒకప్పుడు అంతా నిరక్షరాస్యులై నప్పటికి ముందు తరంలో ఉద్యోగాలు సాధించిన వారి జీవనశైలి స్ఫూర్తితో ప్రతిఒక్కరు చదువుకోవడం విజన్ 2020 ఫలితాలను అందిపుచ్చుకోవడంతో ఈ మార్పు సాధ్యమైంది.

- కంచర్ల రామయ్య, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ కరస్పాండంట్

ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా అభివృద్ధి సాధించాలి



గ్రామం నుంచి వివిధ రంగాల్లో ఎంతో మంది స్థిరపడి నందున భవిష్యత్‌లో కేవలం ఉద్యోగులుగా కాకుండా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా అభివృద్ధి చెంది మరికొందరికి ఉపాధి కల్పించాలన్నదే అభిలాష. అలాగే యూపీఎస్‌సీ పరీక్షలకు సిద్ధపడటం ద్వారా ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా మా గ్రామం నుంచి వచ్చేలా యువతను ప్రోత్సహిస్తాం.

- కంచర్ల సుధాకర్, బీటెక్, ఎంబీఏ

అభివృద్ధికీ బాధ్యత తీసుకున్నాం



మా గ్రామంలో నిరుపేదల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం కూడా మేము బాధ్యత తీసుకుంటున్నాము. ఆర్థిక స్తోమతలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలలో వైద్య ఖర్చులకు తోడ్పాటు అందించడంతోపాటు ప్రైవేటు ఆసు పత్రిలలోనూ వారికి ఉచిత సేవలు అందేలా సొంత డబ్బు ఖర్చు చేస్తున్నాము. అలాగే విద్యను మరింతగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో మెరిట్ విద్యార్థులకు ఏటా ప్రోత్సాహకాలు అందచేస్తున్నాము.

కంచర్ల నరసింగరావు, సీఏ, ఖతార్

హెచ్‌ఎంపీవీ.. ఏం చేస్తుందో!?

- దేశంలో వైరస్ విస్తృతి మొదలు
- జిల్లావాసుల్లో మొదలైన కలవరం
- పాత వైరస్సే.. ఆందోళన వద్దంటున్న వైద్య నిపుణులు
- కూటమి ప్రభుత్వం అప్రమత్తం.. వైద్య శాఖకు కీలక ఆదేశాలు
- జీజీహెచ్‌లో 20 పడకల ఏర్పాటు
- ప్రత్యేక వైద్యబృందం నియామకం
- ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను పరిశీలించిన అధికారులు



హెచ్‌ఎంపీవీ బాధితుల కోసం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

నెల్లూరు (వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :కరోనా మహమ్మారి బారినపడి కుటుంబ సభ్యులను కోల్పోయిన జిల్లా ప్రజలలో ఈ కొత్త హెచ్‌ఎంపీవీపై అనేక అనుమానాలు ఉన్నాయి. ప్రస్తుతం చిన్నపిల్లలకు మాత్రమే వైరస్ సోకుతుండగా, 40 ఏళ్ల పైబడి రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారూ దాని బారిన పడే అవకాశం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. అయితే ఇది పాత వైరస్సేనని 2001లో గుర్తించిన కామన్ రెస్పిరేటరీ వైరస్ అని ఇది అన్ని వయస్కుల వారికి వస్తుందని మరికొందరు వైద్యులు చెబుతున్నారు. చలికాలంలో ఈ హెచ్‌ఎంపీవీ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతుంటాయని అంటున్నారు. కరోనాలా అంతటి ప్రభావం ఈ హెచ్‌ఎంపీవీకి లేదని దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రకటించింది. సాధారణంగా జలుబు చేస్తే ఎలాంటి లక్షణాలు ఉంటాయో హెచ్‌ఎంపీవీ లక్షణాలు కూడా అలాగే ఉంటాయి. అయితే ప్రజల్లో మాత్రం ఈ వైరస్‌పై ఆందోళన మొదలయింది.

● జీజీహెచ్‌లో 20 పడకలు

హెచ్‌ఎంపీవీ వ్యాపిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో నెల్లూరులోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) మంగళవారం 20 పడకలు ఏర్పాటు చేశారు. పది పడకలలో అనుమానిత వ్యాధిగ్రస్థులు, మరో పది పడకలతో వ్యాధి నిర్ధారణ అయిన వారి కోసం కేటాయించారు. వెంటిలేటర్లతోపాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతున్నారు. యాంటిబయాటిక్ మందులను అందుబాటులోకి తెస్తున్నారు. కరోనా తరహాలో జీజీహెచ్‌లో వైద్యసేవలు అందించేందుకు అన్ని సదుపాయాలను సమకూర్చుతున్నారు. అలాగే ప్రత్యేక వైద్యబృందాన్నీ ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకించి ఈ వ్యాధి ఊపిరి తిత్తులపైనే ప్రభావం చూపిస్తుండటంతో ఆ వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులను ప్రత్యేకంగా నియమించారు.

● ఆక్సిజన్ ప్లాంట్‌ల పరిశీలన

హెచ్‌ఎంపీవీ బాధితులకు ప్రధానంగా ఆక్సిజన్ అవసరం కావటంతో ముందస్తు జాగ్రత్తగా జీజీహెచ్‌లో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌లను డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. గాలి ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేసే రెండు కిలో లీటర్ల ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించి, మరో ప్లాంట్‌లో ఆక్సిజన్ ఉత్పత్తి లేకపోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.


ఆక్సిజన్ ప్లాంట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డి

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



కొవిడ్ తరహాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. హెచ్‌ఎంపీవీ బాధితుల కోసం ఇప్పటికే 20 పడకలు సమకూర్చాము. నిరంతర వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించాము. అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. అత్యవసర మందులు కొనుగోలుకు ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధంగా ఉన్నాము.

- డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్, జీజీహెచ్

ఆందోళన వద్దు



హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. మామూలు జలుబు, దగ్గు వంటి వ్యాధులతోపాటు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలి. ఇన్ఫ్లుయంజా వ్యాక్సిన్ వేసుకుంటే ఊపిరితిత్తుల వ్యాధులు నివారించవచ్చు. వయసు ఎక్కువగా ఉన్న వారు, ఆస్తమా, సీవోపీడీ బాధితులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి.

- డాక్టర్ పోకల రవి, రవి చెస్ట్ ఆసుపత్రి

రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ పదవికి చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా

- నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక మంత్రి నారాయణ కుట్ర
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పర్వ తరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని రాష్ట్ర కమిటీకి పంపిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్‌క్రాస్‌లో సేవే పరమావధిగా పనిచేస్తున్న తాను రాజకీయంగా ఎదగడాన్ని చూసి ఓర్వలేకే పురపాలక మంత్రి నారాయణ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తోటి సభ్యులతో అనేక దఫాలు మంత్రి మాట్లాడారని, తనను రెడ్‌క్రాస్ చైర్మన్ పదవి నుంచి దించాలని ఒత్తిడి చేశారన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ 13 విభాగాలుగా ఎంతో అభివృద్ధి చెందు తున్న దశలో అనేక ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని ఈ నెలాఖరులో చైర్మన్‌గా రాజీనామా చేస్తానని సంకేతాలు పంపినా మంత్రి రెడ్‌క్రాస్ రాష్ట్ర నేతలపై ఒత్తిడి తెచ్చారని విమర్శించారు. ఈ క్రమంలోనే రెడ్‌క్రాస్‌లో రాజకీయ నాయకులు ఉండరాదని రాష్ట్ర కమిటీ ఓ ప్రకటన విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో ఎన్నో జిల్లాల్లో అధికార పార్టీ నేతలే రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్లుగా ఉన్నారని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. నారాయణ ఆసుపత్రిలో కేన్సర్ విభా గాన్ని ఏర్పాటు చేస్తున్నారని, అయితే అక్కడ రేడియేషన్ విభాగం ఏర్పాటు ఆలస్యమవుతోందని తెలిసి రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రితో ఎంవోయూ కుదర్చుకునేందుకు ప్రయత్నించారన్నారు. ఇందుకు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి ససేమిరా అనడంతో తనపై పగబట్టారన్నారు. వైసీపీకి ఎక్కువ సమయం కేటాయించాలన్న ఉద్దేశంతో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఇక నుంచి రెడ్‌క్రాస్ కమిటీ సభ్యునిగా కొనసాగుతానని స్పష్టం చేశారు.


రాజీనామా పత్రం చూపుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పోలీసు పరీక్షలకు 462 మంది హాజరు

నెల్లూరు(క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో మంగళవారం ఉదయం 5 గంటల నుంచే పరీక్షలు ప్రారంభించారు. 600 మంది అభ్యర్థులకుగాను 462 మంది హాజరయ్యారు. వారిలో 387 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు

అవగాహన సదస్సులో ఎల్‌డీఎం ప్రదీప్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 7 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో ప్లాట్ కొనుగోలు చేసిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వెంటనే రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎల్‌డీఎం(లీడ్ బ్యాంక్ మేనేజర్) ప్రదీప్ తెలిపారు. ఈ రుణాల మంజూరుపై మంగళవారం నెల్లూరు ఏకే నగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ రుణాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఐఐసీ డీజెడ్ఎం వెంకట సురేష్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు అవస రమైన అన్నీ అనుమతులు వెంటనే ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ శ్రీనివాస్, కోఆర్డినేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

60 రోజులకు రావాల్సిన వెన్ను..

15 రోజులకే వస్తే..!?

● రాయలసీమ, తెలంగాణ మసూరిపై రైతుల్లో ఆందోళన

జలదంకి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో రైతులు సాగు చేసిన కేఎన్ఎం 1638 (రాయలసీమ మసూరి), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ మసూరి) రకం వరి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రతిఏడాది ఈ రెండు రకాలను సాగు చేసి లాభాలు పొందే అన్నదాతలు ఈ ఏడాది మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఈ రకం వరి సాగు జిల్లాలో 80శాతానికిపైగా ఉంది. నాట్లు వేసిన 60రోజుల తరువాత రావా ల్సిన వెన్ను పైరు వేసిన 15 రోజులకే తీస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

● ప్రకృతి అనుకూలించకే...

ఈ రబీ సీజన్‌లో వరి రైతుకు ప్రకృతి అనుకూలించలేదు. ముందస్తుగా వర్షాలు కురిసి చెరువులు, ప్రాజెక్టులలో జలకళ సంతరించుకుంది. దీంతో అక్టోబరులోనే నార్లు పోశారు. రాయల సీమ, తెలంగాణ ప్రాంతాలలో నవంబరు ఆఖరున నార్లు పోసి డిసెంబరు 15న నాట్లు వేస్తారు. ముందస్తుగా నార్లు పోసి, సకాలంలో నాట్లు వేసినా ఆ తరువాత వరుస తుఫానులతో అధిక వర్షాలు కురవడంతోపాటు చల్లని వాతావరణంతో మబ్బులు కమ్మడంతో సూర్యరశ్మి లేక తక్కువ సమయంలోనే వరి పైరులో వెన్నులు తీశాయి. ఈ రకాలకు సూర్యరశ్మి అధికంగా ఉంటేనే పైరు ఏపుగా ఎదిగి నాటిన 60 రోజులకు వెన్నులు వరిగెనుపు నుండి బయటకు వస్తాయి.

● దిగుబడిపై తీవ్ర ప్రభావం

తక్కువ రోజుల్లో పొట్టి వెన్ను తీస్తే ఎకరానికి 20బస్తాల (75 కిలోలు) కూడా దిగుబడి వచ్చేది కష్టమేనని రైతులు అంటున్నారు. మామూలుగా అయితే ఎకరానికి 40 బస్తాలు అవలీలగా ఈ రకాలు దిగుబడి రావాలి. కానీ ఈ ఏడాది సగం పంట మాత్రమే వచ్చేలా ఉందని పైర్లను రైతులు చర్చించుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా అందని పరిస్థితి తలెత్తింది. కౌలురైతు పరిస్థితి మరీ అగమ్యగోచరంగా మారింది.

● వాతావరణం అనుకూలించక కెఎన్ఎం, ఆర్ఎన్ఆర్ వరి రకాలు పంటలకు వెన్నులు తీస్తే ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. పైరులో నీరు పూర్తిగా తీసి ఎకరానికి 50కిలోల యూరియా చల్లి రెండురోజుల పాటు నీరు పెట్టరాదు. అనంతరం నీరు పెట్టి మరలా ఎకరానికి బస్తా యూరియా, అరబస్తా పొటాష్ పైరుపై చల్లితే కొత్తగా పిలకలు వచ్చి పైరు ఏపుగా పెరిగి దిగుబడులు వస్తాయన్నారు.

● ఎన్ఎల్ఆర్ 34449 రకం..

ఉమ్మడి జిల్లా వాతావరణానికి నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449) వరి రకం సాగు చేయవచ్చు. కెఎన్ఎం1638, ఆర్ఎన్ఆర్15048 ర కాలు మనకు సరిపోవు. వాతావరణ పరిస్థితి బట్టి రకాలు ఎంచుకోవాలి. ప్రతి ఏడాది సమా వేశాలు పెట్టి ఈ విషయం చెప్పినా కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్‌లకు ధర ఉందని సాగు చేస్తారు.

- వినీత, వ్యవసాయ శాస్త్రవేత్త



గన్నవరం సమీపంలో సాగు చేసిన కేపీటీగోల్డ్ 5854 రకం వరిపైరు

15 వరకు బీమా గడువు

బిట్రగుంట : రైతుల కోసం ప్రవేశపెట్టిన పంట బీమా పథ కంను ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిం చినట్లు మండల వ్యవసాయ అధికారి విజ యలక్ష్మీ తెలిపారు. మంగళవారం జక్కేప ల్లిగూడూరులో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులు, వీఆర్వో, వీపీఏలు ఉన్నారు.



తిరునాళ్లలో పాల్గొన్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతి, కావ్య కృష్ణారెడ్డి, టీడీపీ నేత బీద రవిచంద్ర తదితరులు

చంద్రబాబుకు పోలేరమ్మ ఆశీస్సులు అందాలి : మంత్రి ఆనం

అల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును అన్ని వేళలా ఆశీర్వాదించాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అల్లూరు పోలేరమ్మను మొక్కుకున్నారు. మంగళవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలతో కలిసి పోలేరమ్మ తిరునాళ్లలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతు సీఎం చేసే పలు బృహత్తర కార్యక్రమాలకు మరింత దీవెలను అందించి చల్లగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావలి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అలేఖ్య, జనసేన కావలి ఇన్‌చార్జి సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు

● విన్నర్స్, రన్నర్స్‌గా పీజీ కళాశాల, జేబీ జట్లు

కావలి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీజీ కాలేజీలో జరిగిన కావలి జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విన్నర్స్‌గా వీఎస్‌యూ పీజీ కళాశాల.. రన్నర్స్‌గా జేబి కళాశాల జట్లు నిలిచాయి. ఫైనల్స్ పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా కావలి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరారెడ్డి పాల్గొని విజేతలకు షీల్డ్‌లతో పాటు బహుమతులు అందజేశారు. టోర్నీ అబ్జర్వర్‌గా ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా పీడీ మణికంఠ వ్యవహరించారు. పీడీలు శ్రీనివాసులు, తిరుపాలు, రమణయ్య, భాస్కర్‌రావు, కొండలు, తిరుమల పోటీల నిర్వహణకు సహకారం అందించారు.



పీజీ కళాశాల జట్టుకు విన్నర్స్ కప్పు అందిస్తున్న ప్రిన్సిపాల్ వీరారెడ్డి

పిల్లల సంరక్షణ పుస్తకాల ఆవిష్కరణ

ఉలవపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికల వికాసం, వ్యక్తిగత పరిర క్షణపై ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో పీవీ రమణయ్య, చాకిచర్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సింధు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. బాలికలకు నాణ్యమైన విద్య, మానవ అక్రమ రవాణ, ఆత్మర క్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో యాక్ట్, బాల్య వివాహాలు, బ్యాడ్ టచ్.. గుడ్ టచ్, లింగ వివక్షత, ఉపాధి నైపుణ్యాలను వివరించారు. అనంతరం సీడీపీవో అరుణ ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్లు, పిల్లల సంరక్షణ పుస్తకాలను ఆవిష్కరించి వాటిని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజి అధ్యాపకురాలు సుభాషిణి, సాధన సచివాలయ మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో ఐసీడీఎస్ సీడీపీవో అరుణ, డాక్టర్ సింధు తదితరులు

పీఎం సూర్యఘర్‌కు మూడువేల రిజిస్ట్రేషన్లు

సంగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంలో ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు మూడువేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని బుచ్చి సబ్‌డివిజన్ ఎలక్ట్రికల్ ఏడీ సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో ఉచితంగా సోలార్ పలకలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనివల్ల బిల్లు చెల్లించకుండానే మిగులు విద్యుత్‌ను స్థానిక గిడ్‌కు సరఫరా చేసినందుకు వీలుంటుందన్నారు. ఆరు నెలలకొకసారి మనీ పే బ్యాక్ వారి ఖాతాకు జమ చేస్తామన్నారు. ఇందుకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆధార్, మొబైల్, కరెంటు సర్వీస్ రసీదు ఇస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఈ మన్మథరావు, సబ్ ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏడీ సతీష్

శిక్షణ తరగతులు తప్పనిసరి

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల శిక్షణ తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించి సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉదయం, సాయంత్రం సమయాల్లో నిర్వహించే శిక్షణ తరగతులను హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల సందేహాలను నివృతి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకేశవులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల విజేతకు అభినందన

కందుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం పుడిమాక బీచ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురుషుల బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలో కళాశాల విద్యార్థి నాగబాబు తృతీయ బహుమతి సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పీడీ కరుణకుమార్‌లు నాగబాబును అభినందించారు.



నాగబాబును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పీడీ తదితరులు

పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం

కందుకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆస్టర్ రమేష్ సంఘమిత్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. కందుకూరు సబ్ డివిజన్‌లోని వివిధ స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. వీరిని వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం

అవసరాల మేరకే యూరియా సరఫరా

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేస్తున్నమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని మినగల్లు, రేవూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలో సహకార సంఘాల ద్వారా 92 టన్నులు, రైతు సేవాకేంద్రాల ద్వారా 620 టన్నుల యూరియా ఇప్పటి వరకు సరఫరా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏలు శేషగిరిరావు, శ్రీనివాసులు, ఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి లేఅవుట్!

● కావలి పట్టణంలో ఓ వైసీపీ నేత నిర్వాహకం

● స్థానిక ప్రజల సమాచారంతో మున్సిపల్ అధికారుల స్థలం పరిశీలన

కావలి, జనవరి7 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ స్థలాల ఆక్రమణ అంటే జనాలకు భయం లేకుండా పోయింది. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే అక్కడ ఆక్రమించి ప్లాట్లు వేసుకున్నా ఇప్పటివరకు అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. అదే ధైర్యమో లేక ఆయన వెనుక బలమైన నేత ఎవరైనా ఉన్నారో ఏమో తెలియదు కాని ఓ వైసీపీ నాయకుడు పట్టణంలోని మద్దూరుపాడు పాత ఆర్అండ్‌బీ రోడ్డు, నేషనల్ హైవేకు మధ్యలోని కూడలిలో ఉన్న రూ.2కోట్ల విలువ చేసే 200అంకణాల స్థలాన్ని ఆక్రమించాడు. అందులో ప్లాట్లు వేసాడు. ఇది గత ప్రభుత్వంలో ఎప్పుడో జరిగింది కాదండోయ్.. ఇటీవల మూడు రోజుల కిందటే జరిగిన బాగోతం. ప్రస్తుతం వీటిని అమ్మకాలకు పెట్టారు. ఎంతో విలువైన ఆ ప్రభుత్వ స్థలంలో ఎవరు ప్లాట్లు వేశారో తెలియక స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ శ్రావణ్‌కుమార్, పట్టణ ప్రణాళికాధికారి వివేక్‌లు తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆశ్చర్యపోయారు. వెంటనే అందులో వేసిన రాళ్లు తొలగింపజేశారు. ఈ విషయంపై ఆరా తీయగా మూడు రోజుల కిందట వైసీపీ నాయకుడు ఒకరు ఆక్రమించినట్లు తెలిసింది. ఈ స్థలం ఆక్రమించిన ఆ నేత గతంలో కూడా ప్రభుత్వ స్థలం ఆక్రమించి తమ లేఅవుట్‌లో కలుపుకుని విక్రయించినా అప్పట్లో అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. అదే ధైర్యంతో ఇపుడు చేయడంతో ఇపుడు అది అందరి కంటపడి బహిర్గతం అయ్యింది.



రాళ్లు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

పెట్రోల్‌బంకు నిర్మాణం.. మేం ఒప్పుకోం

● నిర్మాణ పనులను అడ్డుకున్న నేతలు, స్థానికులు

కావలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న ఐవోసీ పెట్రోల్ బంకు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక ప్రజలు, టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలోని 20సెంట్లను భూమిని కేటాయిస్తూ గత ప్రభుత్వం స్థలం కేటాయించింది. అక్కడ నిర్మాణం చేపట్టేందుకు సోమవారం స్థలం చుట్టూ పరదాలు కట్టి లోపల నిర్మాణం కోసం పునాదులు కొంతమేర తీశారు. కాంక్రీట్ పనులు చేపట్టేందుకు అవసరమైన ఇసుక, కంకర, సిమెంట్‌ను తెచ్చి ఉంచారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు టీడీపీ నేతలు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల అనుమతుల మేరకే తాము పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు టీడీపీ నేతలతో కలిసి అక్కడ కట్టి ఉన్న పరదాలను పీకేస్తుండటంతో వారే మిగతా పరదాలను తీసుకున్నారు. ఇక్కడ పెట్రోల్ బంకు నిర్మాణం చేపడితే ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. అనంతరం అందరూ కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. పెట్రోల్ ఇక్కడ వద్దని ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని లేకుంటే మీరే పనులు ఆపాలని కోరుతూ తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఇక్కడ పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, పెట్రోలు బంకు నిర్మాణం చేపడితే వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటారని చెప్పారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంకు వచ్చే వాహనాలు కూడా పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం ఉండదని కనుక పెట్రోల్ బంకును మరొక ప్రాంతానికి తరలించాలని చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తహసీల్దారు వారికి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, దావులూరి దేవకుమార్, పోతుగంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన పరదాలను తొలగిస్తున్న ప్రజలు, టీడీపీ నేతలు

భూముల వివరాలు సరిచేయండి



లింగసముద్రం: చినపవనిలో రైతు నుంచి అర్జీ తీసుకుంటున్న తహసీల్దారు సీతామహాలక్ష్మి

లింగసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. మంగళవారం చినపవని, పెదపవని గ్రామాల్లో చేపట్టిన సదస్సుల్లో తహసీల్దారు ఎస్.సీతామహాలక్ష్మి పాల్గొని రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. చినపవనిలో 14, పెదపవనిలో 16అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. వీటిలో మ్యుటేషన్, పోర్టింగ్ కోసం వచ్చాయని, త్వరలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, వీఆర్‌ఓలు ఎంవీకే కిషోర్, మస్తాన్ వలి, బ్రహ్మయ్య, అమానుల్లా, జకీరా, సర్వేయర్లు సాయిరాం, వెంకటేశ్వరరెడ్డి, సోంపల్లి మనోహర్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

● ఉదయగిరి: రీసర్వేలో చోటు చేసుకొన్న భూ తప్పిదాలను సరి చేయాలని బిజ్జంపల్లి, బండగానిపల్లి, కృష్ణారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రీసర్వే పుణ్యమా అంటూ పలువురు రైతుల భూ విస్తీర్ణం తగ్గిపోవడం, వేరే రైతుల పేర్లు నమోదు కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే భూ ములకు ఆన్‌లైన్‌లో 1బీ, అడంగల్ రా కపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీ ఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వర రావు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం: రెవెన్యూసద స్సుల వల్ల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. పండ్రంగిలో తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు 26అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి ఎస్ నాగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ సంగీత, వీఆర్వో మనోహర్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి : తహసీల్దారుకు వినతిపత్రం అందచేస్తున్న రైతులు

ఉపాధి చట్టంపై అవగాహన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీవో ఆజంఖాన్ మాట్లాడుతూ కమిషనర్ సూచించిన మేరకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్ధేశించిన చట్టం మేరకు అర్హులైన ప్రతిఒక్కరికి పని కల్పించి, పెరిగిన రూ.300ల వేతనం అందేలా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ కీలకబాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షబ్బీర్ కాలనీ సమీపంలో ఉన్న ఖాజా గరీబున్ నవాజ్ అస్థాన వారి గంధమహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ గంధాన్ని ఊరేగింపుగా అస్థానకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ముస్లింలు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

ఉదయగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వింజమూరు ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగే ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయా లని ఉదయగిరి, దుత్తలూరు మండలాల టీడీపీ కన్వీనర్లు సీహెచ్ బయ్యన్న, వెంకటరత్నం మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల పాల్గొంటా రన్నారు.

● సీతారామపురం: వింజమూరులో జరిగే ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల టీడీపీ నాయకులు కోరారు. పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సింగాల నాగేశ్వరరావు, ఎడమ ప్రవీణ్, మహాలక్ష్మయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

● కలిగిరి: వింజమూరు ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు.

ఆశా వర్కర్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వింజమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ.బ్రిజిత ఆశా వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లు గ్రామంలో కేన్సర్, ఇతర వ్యాధులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలని కోరారు. అలాగే విధులు సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డాక్టర్ మురళీధర్, సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

● సంగం: స్థానిక వైద్యశాలలో ఆశాడేను పురస్కరించుకుని మంగళవారం వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి వైద్య ఆరోగ్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భగా జరిగిన నెలరోజులు నిర్వహించిన వైద్య సర్వేలు, టీకా కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం చేపట్టాల్సి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రెండవ వైద్యాధికారి అశోక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

10న ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిం చ నున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 91827 99405, 79016 20305 నెంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఆదర్శ మహిళా ఉద్యోగులకు అభినందన



మహిళా కండక్టర్లను అభినందిస్తున్న డీఎం శ్రీనివాసరావు

కావలి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరులో కండక్టర్లకు నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను 106శాతం సాధించిన ఆర్టీసీ ఆదర్శ మహిళా ఉద్యోగులు రమాదేవి, సునీత, సుభాషిణిలను నగదు, బహుమతులతో మంగళవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కల్పన, సూపరింటెండెంట్ రామకృష్ణ, సెక్యూరిటీ అధికారి రావు, రవిప్రకాష్ ఉన్నారు.

అండగా ఉంటాం

బిట్రగుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన కుటుంబసభ్యులకు అండగా ఉండేందుకే పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ప్రారంభిస్తున్నట్లు సంఘం కార్యదర్శి గోవిందరాజులు తెలిపారు. బోగోలులో మంగళవారం నూతన అసోసియేషన్ సభ్యులతో అధ్యక్షులు పసుపులేటి చెంచయ్య సమావేశమయ్యారు. ఈ నెల 9వ తేదీ నూతన కార్యాలాయాన్ని ప్రారంభిస్తా మన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసులు. కోశాధికారి ఎస్.శ్రీనివాసులు, కార్యనిర్వాహణ కార్యదర్శి దేవరాజన్, సభ్యులు ప్రసాద్, ఎలమందయ్య, రమణయ్య, సుబ్రమణ్యం తదిత రులు ఉన్నారు.

ఉపాధి పనులపై శిక్షణ

లింగసముద్రం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులపై శాఖ అధికారులు, సిబ్బందికి మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణతేజ వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ ఇచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణలో లింగస ముద్రం, వలేటివారిపాలెం ఎం పీడీఓలు శ్రీనివాసులు, నరేంద్రదేవ్‌లు ఏపీ ఓ షేక్ సమీర్‌బాషాలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

ఉలవపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అలగాయపాలెం రైతుసేవా కేంద్రం-3లో మంగళవారం కందుకూరు కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు వేరుశనగ రైతులకు సమగ్ర పోషకాలు, సస్యరక్షణ యా జమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు మాట్లాడారు. వేరుశనగ పూత దశలో ఎకరాకి 200కిలోల జిప్సం ఎరువును భూమిలో కలిపితే అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులతో కలిసి పంటను పరిశీలించి కాండం కుళ్లు తెగులు, మచ్చ తెగులు గమనించారు. నివారణకు వాడాల్సిన పురుగు మందులు సూచించారు. రైతులకు జిప్సం బస్తాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, మాయాంక్, డాక్టర్ శ్రీరంగ వీఏఏ వంశీ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడరుగా నారాయణరావు

నెల్లూరు, జనవరి 7 (ఆం ధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా చుండూరి శ్రీహరి నారాయణ రావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పరంగా ఉన్న సివిల్ కేసులను నారాయణరావు వాదించనున్నారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. నెల్లూరు నగరానికి చెందిన నారాయణరావు ప్రస్తుతం టీడీపీ స్టేట్ లీగల్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్నారు. ముప్పై ఏళ్లుగా ఆయన టీడీపీలో పనిచేస్తున్నారు. గత ప్రభు త్వం లో టీడీపీ నేతలపై పెట్టిన కేసులను న్యాయపరం గా ఎదుర్కోవడంలో కీలకంగా వ్యవహరించారు. 1994లో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన నెల్లూరు, గూడూరు, కోవూరు న్యాయస్థానాల్లో అనేక కేసులు వాదించారు.